www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'భూ భారతి'పైనే రైతుల ఆశలు

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో అమలు
ఏళ్లుగా ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయని అంచనాలు
పాస్ పుస్తకాలు, సాదా బైనామా కేసులే అధికం
సమస్యల వల్ల పథకాలకు దూరమవుతున్న రైతులు
పలు చోట్ల అభివృద్ధి పనులకు ఆటంకం
నేలకొండపల్లి, వెంకటాపూర్‌లో తొలి రోజు జరగని రిజిస్ట్రేషన్లు.. లింగంపేట, మద్దూర్‌లో నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

13

ఆ 4 మండలాల్లో రెవెన్యూ సదస్సులు

ఈనెల 17 నుంచి దరఖాస్తులు
కొత్త చట్టం ప్రకారం పరిష్కారం
తొలిరోజు సాంకేతిక సమస్యలపై సీసీఎల్ఏ సమీక్ష
15 మందితో వార్ రూమ్..
8 మందితో హెల్ప్ లైన్

13

బుధవారం | 16-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 17
శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: విదియ ఉ.10.56 తదియ, నక్షత్రం: విశాఖ తె.3.10 అనూరాధ. వర్జ్యం: ఉ.6.30-8.18, దుర్ముహూర్తం: ఉ.8.31-9.21, రా.10.15-రా.10.59, అమృతఘడియలు: సా.5.17-7.04, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.02, సూర్యాస్తమయం: 6.27 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పార్టీ లైన్ దాటొద్దు!

మంత్రివర్గ విస్తరణపై నిర్ణయాన్ని అధిష్ఠానం ఫ్రీజ్ చేసేసింది

ఇక దీనిపై ఎవరు ఏమి మాట్లాడినా ఉపయోగం ఉండబోదు
ఏదైనా చెప్పుకోవాలంటే అధిష్ఠానం వద్దకు వెళ్లి చెప్పుకోండి
మే 1 నుంచి 15 రోజులపాటు ఎమ్మెల్యేలతో ముఖాముఖి
మళ్లీ గెలిచేందుకు ఏం చేయాలో నివేదికలు సిద్ధం చేసుకోండి
వాటిని పరిశీలించి నిధులిస్తాం.. పథకాలపై ప్రచారం చేయండి
భారత్ సదస్సుకు రాహుల్, ప్రియాంక.. బాధ్యత మంత్రులదే
ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు పరిష్కారం చూపించాం
కులగణన, వర్గీకరణ, ఇందిరమ్మ ఇళ్లు.. గొప్ప నిర్ణయాలు
ప్రజల్లోకి తీసుకెళ్లండి.. సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
కుల గణన, వర్గీకరణ.. గొప్ప గొప్ప నేతలే చేయలేదు: భట్టి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడతగా లక్షరూపాయల చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, జూపల్లి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): "మంత్రివర్గ విస్తరణపై నిర్ణయాన్ని అధిష్ఠానం ఫ్రీజ్ చేసేసింది. ఇక, దీనిపై ఎవరు ఏమి మాట్లాడినా ఉపయోగం ఉండబోదు. ఏదైనా చెప్పుకోవాలంటే అధిష్ఠానం దగ్గరకు వెళ్లి చెప్పుకోండి. అంతే తప్ప.. పార్టీ లైన్ దాటి ఎవరూ మాట్లాడవద్దు" అని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. పార్టీ లైన్ దాటకుండా ఓపిగ్గా ఉంటే.. సమీకరణాలు కలిసొచ్చి అవకాశాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ మేరకు ఆయన స్పష్టత ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఎక్కడికి వెళితే అక్కడ కాబోయే మంత్రి ఎవరన్నది ప్రకటించి వస్తున్నాడు. అది ఆయన పరిధిలోని అంశం కాదు. అది ఆయన స్థాయీ కాదు" అని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ కలిగిన నాయకులుగా పార్టీ లైన్లోనే మాట్లాడాలని, పార్టీ బతికితేనే

మిగతా 12వ పేజీలో...

కుల గణన.. మోదీ సర్కారుకు మరణ శాసనం

దేశంలోనే గేమ్ చేంజర్.. బిహార్ ఎన్నికల్లోనూ కీలక పాత్ర పోషించనుంది
కంచ గచ్చిబౌలి భూములపై దుష్ప్రచారం
ఇప్పుడు మోదీ కూడా రంగంలోకి దిగారు
ఏఐ ప్రచారం నమ్మి అడవులపైకి తెలంగాణ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతోందన్నారు
సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు

12

జపాన్‌కు రేవంత్ బృందం

నేడు భారత రాయబారితో ఆతిథ్య సమావేశం
రేపు, ఎల్లుండి టోక్యోలో పలు కంపెనీలతో భేటీ
23న ఉదయం తిరిగి రాష్ట్రానికి రాక

ఇందిరమ్మ లబ్ధిదారులకు 20.19 కోట్లు
మధ్యవర్తులు లేకుండా నేరుగా ఖాతాల్లోకే
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

12

నోవాటెల్‌లో రేవంత్‌కు తప్పిన ప్రమాదం
ముఖ్యమంత్రి వెళ్తున్న లిఫ్ట్ మొరాయింపు





నేషనల్ హెరాల్డ్ కేసు..

A1 సోనియా.. A2 రాహుల్‌గాంధీ

చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. సామ్ పిట్రోడా, సుమన్ దూబేపైనా అభియోగాలు
విచారణార్హమా? కాదా?.. 25న కోర్టు నిర్ణయం
ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా
ఇది చట్టబద్ధ పాలన ముసుగులో ప్రభుత్వ దాడి
విపక్షంపై రాజకీయ ప్రతీకారం: కేసీ వేణుగోపాల్
నేడు దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: నేషనల్ హెరాల్డ్ కేసు మరోమారు జాతీయ స్థాయిలో రాజకీయంగా ఓ కుదుపు కుదిపింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం ఈ కేసులో రౌస్‌అవెన్యూ ప్రత్యేక కోర్టులో చార్జిషీటు(ప్రాసిక్యూషన్ కంప్లైంట్) దాఖలు చేశారు. ఆ అభియోగపత్రాల్లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని ఏ1గా, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఏ2గా పేర్కొంది. దీనిపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కేంద్రంలోని బీజేపీ సర్కారు దర్యాప్తు సంస్థలను రాజకీయ

మిగతా 2వ పేజీలో...

14

సిద్దరామయ్యకు బిగిసిన ఉచ్చు

ముడా కేసు దర్యాప్తును కొనసాగించండి
మే 7లోగా నివేదికివ్వండి
లోకాయుక్తకు ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

2

తెలంగాణ పోలీస్ దేశంలోనే నెంబర్ 1

ఉత్తమ న్యాయవ్యవస్థల్లో రెండో స్థానం రాష్ట్రానిదే
దక్షిణాది రాష్ట్రాల్లోనే సమర్థ పోలీసు, న్యాయవ్యవస్థలు
ఇండియా జస్టిస్ రిపోర్ట్

నైరుతిలో వానలే వానలు!

ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

దీర్ఘకాలిక సగటులో 105% నమోదు
ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య భారతంలో ఎక్కువగా వానలు పడే అవకాశం
జమ్మూకశ్మీర్, బిహార్, తమిళనాడు, ఈశాన్యంలో సాధారణం కంటే తక్కువ
భారత వాతావరణ శాఖ వెల్లడి



మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో వర్షానికి తడిసిన ధాన్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలోని కోట్లాది మంది రైతులకు భారత వాతావరణ శాఖ మంగళవారం తీపికబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో (జూన్-సెప్టెంబరు) సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. దీర్ఘకాలిక సగటులో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. వరుసగా రెండో ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 'దేశంలో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు మధ్య సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్ల వర్షపాతంతో

మిగతా 2వ పేజీలో...

ఉదయం భగ భగలు.. మధ్యాహ్నం జల్లులు

ఇందూరు, కరీంనగర్, మానుకోటలో 42 డిగ్రీలు.. వడదెబ్బతో ముగ్గురి మృతి
రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వానలు
నేడు, రేపూ పలు జిల్లాలకు వర్ష సూచన
వడదెబ్బ మృతులకు రూ.4 లక్షల పరిహారం
విపత్తు నిధి నుంచి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం

10



సర్కార్‌ను బద్నామ్ చేయడానికే..

సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు
భారత చట్టాలకు చిక్కకుండా ఉండేందుకే విదేశాల నుంచి పోస్టులు
25 మంది కీలకం.. వారికి భారీ నిధులు
వెనకున్న పెద్దలపై ప్రభుత్వానికి నివేదిక
ఆయా సైట్లకు త్వరలో నోటీసులు
హెచ్‌సీయూ భూ వివాదం.. ఫేక్ పోస్టులపై పోలీసుల నిశిత విశ్లేషణ!

12

అరెస్టు చేయరాదని ఉత్తర్వులిస్తే వారంలో వచ్చేస్తా

హైకోర్టును కోరిన ఫోన్‌ట్యాపింగ్ నిందితుడు ప్రభాకర్‌రావు

12

కళ్లముందే చంపాడు!

పాకిస్థాన్ జాతీయుడు తొలుత శ్రీనివాస్ ప్రాణాలు తీశాడు

తర్వాత నాపై కత్తి దూస్తే.. తృటిలో తప్పించుకున్నా
పక్కనే ఉన్న మా బావను దారుణంగా చంపేశాడు
అష్టపు ప్రేమ్‌సాగర్ బావమరిది దేగాం సాగర్ వెల్లడి
దుబాయ్‌లో జరిగిన కత్తిదాడిలో అతడికీ గాయాలు
తనను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి
మృతదేహాల తరలింపునకు సహకరించండి
విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కిషన్‌రెడ్డి అభ్యర్థన
దుబాయ్‌లో రంగంలోకి విదేశాంగ శాఖ అధికారులు
ప్రేమ్‌సాగర్ కుటుంబసభ్యులకు బండి పరామర్శ



దేగాం సాగర్



స్వర్గం శ్రీనివాస్ (ఫైల్)

సోన్/ఆర్మూర్ టౌన్, ధర్మపురి, హైదరాబాద్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తన కళ్ల ముందే తన బావను పాకిస్థాన్ జాతీయుడు దారుణంగా చంపేశాడని.. దుబాయ్‌లోని బేకరీలో హత్యకు గురైన అష్టపు ప్రేమ్‌సాగర్ బావమరిది దేగాం సాగర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సాగర్, ప్రేమ్‌సాగర్ ఒకే బేకరీలో పని చేస్తున్నారు. తమతోపాటే పనిచేస్తున్న పాకిస్థాన్ జాతీయుడు ఒకడు కిందటి శుక్రవారం.. బేకరీలో తొలుత ఒక వ్యక్తి(స్వర్గం శ్రీనివాస్)ని చంపేశాడని, తర్వాత అతడు తనపై దాడికి రాగా తృటిలో తప్పించుకున్నానని సాగర్ వెల్లడించాడు. దీంతో అతడు పక్కనే ఉన్న తన బావ అష్టపు ప్రేమ్‌సాగర్‌పై దాడి చేసి దారుణంగా ప్రాణాలు తీశాడని సాగర్ ఆవేదన వెలిబుచ్చాడు. దాంతో తాను తీవ్ర భయాందోళనలకు గురై అక్కడి నుంచి పరుగెత్తానని వివరించాడు. దుబాయ్ బేకరీలో జరిగిన ఈ హత్యల గురించి ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు సాగర్‌కు ఫోన్ చేయగా వారికి అతడు

మిగతా 10వ పేజీలో...

అక్రమమని తెలిసీ ప్రోత్సాహం

ఆ తర్వాత పథకాల పేరిట క్రమబద్ధీకరణ



అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ప్రోత్సహిస్తున్నాయి.. హైకోర్టు ఆగ్రహం
మణికొండలో అక్రమ కట్టడాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశం
లేదంటే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు వ్యక్తిగతంగా విచారణకు హాజరు రావాలి.. ధర్మాసనం హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధికారులు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో చెడు సంప్రదాయానికి తెరలేపుతున్నారని.. అక్రమ నిర్మాణాల పూర్తికి అవకాశం ఇచ్చి.. ఆ తర్వాత వివిధ పథకాల పేరుతో వాటిని క్రమబద్ధీకరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు అలాగే కొనసాగుతాయని.. ఈ విషయంలో ప్రభుత్వం, జీహెచ్ఎంసీ కొనసాగిస్తున్న విధానం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీర్‌లో 203 నుంచి210 వరకూ ఉన్న వివిధ సర్వే నంబర్లలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మణినగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. యథాతథ స్థితి (స్టేటస్ కో) విధించింది. 2023 మార్చి 14 నాటికి సదరు భూముల్లో నిర్మాణాల పరిస్థితిపై ఫొటోలు, వీడియోలు సమర్పించాలని

మిగతా 12వ పేజీలో...

స్వయంప్రతిపత్తిపై కమిటీ ఏర్పాటు

తమిళనాడు సర్కారు సంచలన నిర్ణయం
గవర్నర్‌తో విభేదాల నేపథ్యంలో రాష్ట్ర హక్కుల పరిరక్షణకు స్టాలిన్ ప్రభుత్వం చర్యలు
జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
వచ్చే జనవరి కల్లా మధ్యంతర నివేదిక
రెండేళ్లలో సమగ్రమైన నివేదిక రూపకల్పన



చెన్నై, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాలు తీవ్రమైన నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్వయం ప్రతిపత్తి విషయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర న్యాయమైన హక్కుల పరిరక్షణతోపాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలను పెంపొందించేలా కమిటీ సిఫారసులు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన శాసనసభలో 110వ నిబంధన కింద ఒక ప్రకటన చేశారు. కమిటీలో ఇండియన్ మారిటైమ్ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం.నాగనాథన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ 1971లో ఏర్పాటైన జస్టిస్ రాజమన్నార్ కమిటీ సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది జనవరిలో మధ్యంతర నివేదికను సమర్పిస్తుందని, రెండేళ్లలో సమగ్రమైన నివేదికను రూపొందిస్తుందని స్టాలిన్ వివరించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించివేస్తోందని,

మిగతా 2వ పేజీలో...



ట్రంప్‌కు చైనా షాక్!

అమెరికా నుంచి బోయింగ్ జెట్లు బంద్
వాటిని తీసుకోవద్దని తమ ఎయిర్‌లైన్స్‌కు ఆదేశం
విమానాల విడిభాగాల దిగుమతీ నిలిపివేత

బీజింగ్, ఏప్రిల్ 15: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటివరకు అమెరికా వస్తువులపై సుంకాలు భారీగా పెంచిన చైనా.. తాజాగా ఆ దేశం నుంచి బోయింగ్ జెట్ విమానాల దిగుమతినే నిలిపివేసింది. వాటి డెలివరీ తీసుకోవద్దని తన విమానయాన సంస్థ 'చైనా ఎయిర్‌లైన్స్'ను ఆదేశించినట్లు

మిగతా 2వ పేజీలో...

2

హార్వర్డ్ నిధులకు ట్రంప్ ఎసరు

220 కోట్ల డాలర్లు స్తంభింపజేసిన సర్కారు
ప్రభుత్వానికి తలొగ్గమన్న వర్సిటీ అధ్యక్షుడు

ఇచ్చిన చెక్కులనే మళ్లీ ఇస్తూ..

మహిళలను మోసం చేస్తున్న రేవంత్ సర్కారు
2 సార్లు ఇచ్చినా చెక్కులు చెల్లుబాటు కాలేదు
మహిళలకు వడ్డీలేని రుణాలపై భట్టి అబద్ధాలు
రైతుభరోసా ఇవ్వకుండా రైతులను ముంచారు
ఉపాధి సిబ్బందికి వేతనాలివ్వాలి: హరీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన చెక్కులే మళ్లీ ఇస్తూ మహిళలను రేవంత్ సర్కారు మోసం చేస్తోందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సంఘాలకు రెండుసార్లు అవే చెక్కులు ఇచ్చారని, అవి ఇప్పటికీ చెల్లుబాటు కాకపోవడం సిగ్గుచేటు అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 2024 నవంబరు 19న వరంగల్‌లో రుణబీమా, ప్రమాద బీమా చెక్కులను సీఎం అందజేశారని.. మళ్లీ అవే చెక్కులను ఈ ఏడాది మార్చి 8న హైదరాబాద్‌లో ఇందిరా మహిళాశక్తి పేరిట నిర్వహించిన సభలో సీఎం అందజేశారని, ఇప్పటివరకు అవి చెల్లుబాటు కాలేదన్నారు. మహిళలను కోటీశ్వరులను

మిగతా 3వ పేజీలో...

లా కమిషన్ చీఫ్‌గా జస్టిస్ దినేష్ మహేశ్వరి



» ప్రధాని మోదీ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి 23వ లా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని న్యాయ శాఖ మంగళవారం ఎక్స్ ద్వారా తెలిపింది. ఆయన నియామకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదించారని పేర్కొంది. పూర్తికాల సభ్యులుగా న్యాయవాది హితేష్ జైన్, ప్రొఫెసర్ డి.పి.వర్మ నియమితులయ్యారు. ప్రొఫెసర్ వర్మ గత లా కమిషన్‌లోనూ సభ్యుడిగా పనిచేశారు. వారు బాధ్యతలు స్వీకరించారని న్యాయ శాఖ తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను న్యాయ వ్యవహారాల విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

హజ్ పోర్టల్ తెరిచేందుకు సౌదీ అంగీకారం

» 10 వేల మంది యాత్రికులకు లభించనున్న అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వ జోక్యంతో సౌదీ హజ్ మంత్రిత్వ శాఖ హజ్ (నుసుక్) పోర్టల్‌ను తిరిగి తెరిచేందుకు అంగీకరించింది. దాంతో 10 వేల మంది భారతీయ యాత్రికులకు అవకాశం లభించనుందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. భారత్ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికుల కోటాను 70% హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చూస్తుండగా, మిగతా 30% కంబైన్డ్ హజ్ గ్రూప్ ఆర్గనైజర్లు చూస్తున్నారు. అయితే మీనాలో ఏర్పాటు చేయాల్సిన క్యాంప్‌లు, బస, రవాణాకు సంబంధించి ఇవ్వాల్సిన యాత్రికుల డేటాకు సంబంధించిన ప్రక్రియలను సౌదీ ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపల హజ్ గ్రూప్ ఆర్గనైజర్లు పూర్తి చేయలేకపోయారు. దాంతో దాదాపు 10వేల మంది యాత్రికుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కలగజేసుకుని మరో అవకాశం ఇవ్వాలని కోరడంతో హజ్ పోర్టల్‌ను తిరిగి తెరిచేందుకు సౌదీ ప్రభుత్వం అంగీకరించింది. కాగా, చంద్ర దర్శనానికి అనుగుణంగా ఈ ఏడాది జూన్ 4 నుంచి 9వ తేదీల మధ్య జరగనున్న హజ్ యాత్రకు భారత్ నుంచి 1,75,025మంది యాత్రికులకు సౌదీ అవకాశం కల్పించిందని కేంద్రం తెలిపింది.

కట్నం కేసులపై పార్లమెంటే చట్టం చేయాలి

» ఈ అంశంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: వరకట్న వేధింపులు, మెయింటెనెన్స్ చెల్లింపునకు సంబంధించిన చట్టాలు దుర్వినియోగం కాకుండా.. మహిళలు, పురుషులకు సమానంగా వర్తించేలా మార్గదర్శకాలు ఇవ్వాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. కోర్టులు చట్టాలు చేయలేవని, ఇది పార్లమెంటు బాధ్యత అని పేర్కొంది. జనశ్రుతి అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిల్‌పై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. చట్టంలో దుర్వినియోగం కాకుండా ఉన్న సెక్షన్లు ఏవో చెప్పండి అని స్వచ్ఛంద సంస్థ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. మహిళల సాధికారత కోసం ఐపీసీ 498ఏ (బీఎన్ఎస్ 84), సీఆర్‌పీసీ 125 సెక్షన్లను పొందుపర్చారని, కొన్ని ఘటనల్లో దుర్వినియోగం అయ్యాయన్న సాకుతో వాటి స్ఫూర్తిని దెబ్బతీయలేమని స్పష్టం చేసింది. ఈ సెక్షన్ల దుర్వినియోగంతో బాధితులుగా మారిన ఎవరైనా కోర్టులను ఆశ్రయించవచ్చని, ఆయా కేసుల్లో మెరిట్‌ను బట్టి న్యాయస్థానాలు నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. అయితే పురుషులు కూడా భార్యలపై మెయింటెనెన్స్ కోసం కేసులు వేసే అవకాశం ఉండాలని స్వచ్ఛంద సంస్థ తరఫు న్యాయవాది పేర్కొనగా.. కోర్టులు చట్టాలు చేయలేవని, పార్లమెంటు ఆ పని చేయాలని పేర్కొంది. ఈ మేరకు పిల్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

'వక్ఫ్' పిటిషన్లపై సుప్రీం విచారణ నేడే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేసిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం (ఏప్రిల్ 16న) విచారణ చేపట్టనుంది. కొత్త చట్టంలోని పలు సెక్షన్లు రాజ్యాంగానికి విరుద్ధమని, జాతీయ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ పిటిషన్ సహా ఇప్పటికే పది పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం విచారణ ప్రారంభించనుంది. మరోవైపు కొత్త వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఆ చట్టంలోని కొన్ని సెక్షన్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సీనియర్ న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. దీనిపై విచారణ చేపట్టే తేదీని త్వరలో ఖరారు చేస్తామని తెలిపింది.

మౌలిక వసతుల అభివృద్ధి దేశానికి ఎంతో కీలకం

» రోజుకు 100 కి.మీ చొప్పున హైవేల నిర్మాణం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: దేశానికి మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో కీలకమైనదని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని దేశంలో రోజుకు 100 కిలోమీటర్ల చొప్పున రహదారుల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) 10వ జాతీయ నాయకత్వ సదస్సులో మాట్లాడుతూ.. మరో 18 నెలల తర్వాత మన దేశంలో రోడ్లు అమెరికా కన్నా మెరుగ్గా ఉంటాయని చెప్పారు. మరి కొన్నేళ్లలో తన శాఖ ద్వారా 25,000 కి.మీ. రెండు వరుసల, నాలుగు వరుసల రహదారుల నిర్మాణం పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. అందుకు నిధుల కొరత లేదన్నారు.

బెంగాల్ అల్లర్ల వెనుక బంగ్లాదేశ్ దుండగులు

» మమత సర్కారు విఫలం.. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

కోల్‌కతా, ఏప్రిల్ 15: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుక బంగ్లాదేశ్ దుండగుల ప్రమేయం ఉన్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఈ విషయం కేంద్ర హోంశాఖ దృష్టికీ వెళ్లినట్టు తెలిపాయి. బంగ్లాదేశ్‌కు పొరుగున ఉన్న ముర్షీదాబాద్, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లోకి చొరబాటుదారులు రాకుండా అడ్డుకోవడంలో మమతా ప్రభుత్వం విఫలమైనట్టు కూడా ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

తమ్ముడి దొంగతనానికి అక్క బలి!

» సోదరి ఇంటికి వచ్చి బావ సెల్‌ఫోన్, నగదు చోరీ

» ఆగ్రహం వ్యక్తం చేసిన భర్త

» అవమానంతో ఇద్దరు పిల్లలతో సహా భార్య ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్క ఇంటికి వచ్చిన తమ్ముడు.. బావ దాచుకున్న నగదు, సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించాడు. ఆగ్రహించిన బావ.. బావమరిదికి ఫోన్ చేసి మందలించాడు. భార్యపై సైతం ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. ఇద్దరు పిల్లలతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన కర్నాటక రాష్ట్రం చామరాజనగర జిల్లా హనూరు తాలూకా కాడుగోళ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కాడుగోళ గ్రామంలో ఉంటున్న సుశీల ఇంటికి తమ్ముడు మాదేవ వెళ్లాడు. కాసేపటి తరువాత తన బావ మహేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయమై మహేశ్ తన బావమరిదికి ఫోన్ చేసి 'ఇంటికొచ్చి ఇలాంటి పనులు చేస్తారా..? కష్టపడి సొమ్ము దాచుకున్నాం. వెంటనే వచ్చి తిరిగి ఇచ్చెయ్' అని తీవ్రస్థాయిలో మందలించాడు. ఈ క్రమంలో బావబావమరుదుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత మహేశ్, తన భార్య సుశీలతోనూ గొడవపడ్డాడు. 'మీ తమ్ముడు ఇలాంటి పనులు చేస్తాడా..?' అని దూషించాడు. ఈ అవమానాన్ని జీర్ణించుకోలేని సుశీల, ఆదివారం రాత్రి ఇంటి నుంచి పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. పుట్టింటికి వెళ్లి ఉంటుందని మహేశ్ భావించాడు. కానీ సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని ఓ బావి వద్ద సుశీల చెప్పులు, తాళిబొట్టు, ఇతర వస్తువులను గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహదేశ్వర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో గాలించి సుశీల (30), పిల్లలు దివ్య (11), చంద్రు(8) మృతదేహాలను వెలికి తీశారు.

కంప్యూటర్ చిప్స్, ఫార్మాపై సుంకాల దిశగా..

అమెరికా పరిశోధన షురూ


ఆయా ఉత్పత్తులకు ఒకే దేశంపై ఆధారపడడం తమ జాతీయ భద్రతకు ముప్పనే అభిప్రాయం

» దేశీయంగా తయారీపై పరిశీలన

» ప్రజాభిప్రాయాలకు 3వారాల గడువు

» త్వరలోనే ఫార్మాపై సుంకాలు: ట్రంప్

» దేశీయ తయారీని ప్రోత్సహించడానికేనని వెల్లడి





బ్యాంకాక్, ఏప్రిల్ 15: కంప్యూటర్ చిప్స్, చిప్ మేకింగ్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ (ఔషధాలు)పై సుంకాల విధింపునకు సంబంధించి ట్రంప్ సర్కారు తదుపరి చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో భాగంగా.. కార్లు, రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వాడే కంప్యూటర్ చిప్‌లు, వాటిని తయారుచేసే పరికరాలను దిగుమతి చేసుకోవడం దేశ భద్రతపై చూపే ప్రభావాన్ని తెలుసుకునేందుకు పరిశోధన ప్రారంభించినట్టు అమెరికా కామర్స్ విభాగం ప్రకటించింది. దీనిపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలపడానికి మూడువారాల గడువు ఇచ్చింది. నిజానికి ఈ ఇన్వెస్టిగేషన్‌ను ట్రంప్ యంత్రాంగం ఏప్రిల్ 1నే ప్రారంభించినట్టు సమాచారం. అందులో వెల్లడైన సమాచారం ఆధారంగానే.. చైనా సహా అన్ని దేశాల నుంచి అమెరికాకు దిగుమతి చేసుకుంటున్న స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలపై 10శాతం మూల సుంకాన్ని కూడా మినహాయిస్తున్నట్టు కిందటివారం ప్రకటించింది. ఈ పరిశోధనలో భాగంగా.. అమెరికా డిమాండ్‌కు తగ్గట్టు కంప్యూటర్ చిప్‌లు, వాటి తయారీ పరికరాలను తమ దేశంలోనే ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలను ట్రంప్ సర్కారు పరిశీలించనుంది. వాటిపై పలు దేశాలు తమ ఉత్పత్తిదారులకు ఇస్తున్న రాయితీల కారణంగా అమెరికన్ కంపెనీలపై పడే ప్రభావాన్ని కూడా పరిశీలిస్తోంది. కాగా.. ఔషధాలపై సుంకాలు త్వరలోనే వేస్తామని ట్రంప్ సోమవారం పునరుద్ఘాటించారు. తమ దేశంలోనే ఔషధాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. అమెరికాలో తయారయ్యే ఔషధాలకు అవసరమయ్యే ముడిపదార్థాల్లో (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రీడియెంట్స్) 70 శాతానికి పైగా చైనా, ఇండియా, యూరప్ దేశాల నుంచి దిగుమతి అయ్యేవే. ఇక.. సెమీకండక్టర్ల విషయానికి వస్తే అమెరికా ఎక్కువగా తైవాన్, దక్షిణ కొరియాపై ఆధారపడుతోంది. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, వాటి తయారీకి అవసరమయ్యే కాంపోనెంట్లకు సంబంధించి అమెరికా ఎక్కువగా చైనాపై ఆధారపడుతోంది. నిరుడు చైనా నుంచి.. అమెరికా దిగుమతి చేసుకున్న ఈ ఉత్పత్తుల విలువ ఏకంగా 174 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్లు) దాకా ఉంది. ఏప్రిల్ 2న విధించిన ప్రతీకార సుంకాల కన్నా ముందు.. ఫెంటానిల్ అక్రమరవాణాను నిరోధించడంలో విఫలమైందంటూ చైనాపై ట్రంప్ విధించిన 20% సుంకం కొనసాగుతుందని చెప్పింది ఈ ఉత్పత్తులపైనే. ఈ ఉత్పత్తుల కోసం ఒకే దేశంపై లేదా కొన్ని దేశాలపై ఎక్కువగా ఆధారపడడం అమెరికా భద్రతకే ముప్పు అని ట్రంప్ ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

హార్వర్డ్ నిధులకు ట్రంప్ ఎసరు

220 కోట్ల డాలర్లు స్తంభింపజేసిన సర్కారు

న్యూయార్క్, ఏప్రిల్ 15: అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ వర్సిటీకి 220 కోట్ల డాలర్ల ఫెడరల్ నిధులను ట్రంప్ ప్రభుత్వం స్తంభింపజేసింది. క్యాంపస్‌లో యూదు వ్యతిరేక నిరసనలను కట్టడి చేయడంలో భాగంగా వైట్‌హౌస్ నిర్దేశించిన పలు నిబంధనలను అమలు చేయడానికి తిరస్కరించడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వర్సిటీ పరిపాలనా విధానాలతో పాటు ప్రవేశాలు, నియామకాల ప్రక్రియల్లో మార్పులు చేయాలని, విదేశీ విద్యార్థుల స్క్రీనింగ్ విషయంలో ఇమిగ్రేషన్ అధికారులతో సహకరించాలని ఈనెల 3న హార్వర్డ్ వర్గాలకు ఆదేశాలు అందాయి. అయితే తమ స్వతంత్రత, రాజ్యాంగ హక్కులపై వర్సిటీ ఎలాంటి చర్చలు జరపబోదని, ప్రభుత్వ విధానాలకు లొంగబోమని వర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి రాసిన బహిరంగ లేఖలో హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ గార్బెర్ స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం హార్వర్డ్ వర్సిటీకి 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లతో పాటు ఫెడరల్ కాంట్రాక్టుల కింద మరో 60 మిలియన్ డాలర్లు స్తంభింపజేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. అంతేకాదు, హార్వర్డ్‌ను రాజకీయ సంస్థగా ప్రకటిస్తామని, పన్ను మినహాయింపును రద్దు చేస్తామనీ ట్రంప్ హెచ్చరించారు. కాగా, ట్రంప్ డిమాండ్లను తిరస్కరించడం ద్వారా హార్వర్డ్ వర్సిటీ మిగిలిన ఉన్నత విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచిందని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పేర్కొన్నారు. మిగిలిన సంస్థలూ ఇదే బాటలో పయనిస్తాయని 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఆయన ఆకాంక్షించారు.

ట్రంప్‌కు చైనా షాక్!

(మొదటి పేజీ తరువాయి)

'బ్లూమ్‌బెర్గ్ న్యూస్' మంగళవారం వెల్లడించింది. అలాగే అమెరికన్ కంపెనీల నుంచి విమానాల విడిభాగాలు, పరికరాల కొనుగోలును కూడా ఆపేయాలని నిర్దేశించింది. అమెరికా నుంచి దిగుమతులపై చైనా టారిఫ్‌లు పెంచడంతో అక్కడి నుంచి విమానాలు, విడిభాగాలు తీసుకురావడానికి వ్యయం తడిసిమోపెడవుతోంది. దీంతో బోయింగ్ విమానాలను లీజుకు తీసుకునే చైనా విమానయాన సంస్థలకు ఆర్థికంగా ఊతమివ్వాలని చైనా యోచిస్తోంది. గత జనవరిలో ట్రంప్ రెండో సారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మిత్రులు, ప్రత్యర్థులు అనే తేడా లేకుండా.. ప్రతి దేశం తమకు చేసే ఎగుమతులపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్నారు. చైనా దిగుమతులపై ఏకంగా 145 శాతం వరకు సుంకాలు ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా అమెరికా నుంచి దిగుమతులపై 125 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా వెల్లడించింది. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఏకంగా బోయింగ్ విమానాలనే ఆపేసింది. బోయింగ్ అమెరికాకు చెందిన అతిపెద్ద విమానతయారీ సంస్థ అయిన సంగతి తెలిసిందే. బోయింగ్ విమానాల్లో 30 శాతం వరకూ చైనాయే కొంటోంది. చైనా నిర్ణయంతో మంగళవారం బోయింగ్ కంపెనీ షేర్లు పతనమయ్యాయి.

లోకం తీరు



సిద్ధరామయ్యకు బిగిసిన ఉచ్చు

ముడా కేసు దర్యాప్తు కొనసాగించండి

ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ప్రజాప్రతినిధుల కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో ఉచ్చు బిగిసింది. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కేసు దర్యాప్తును కొనసాగించాలని లోకాయుక్తను ప్రజాప్రతినిధుల కేసుల కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన కుటుంబసభ్యుల తప్పిదం లేదని లోకాయుక్త ప్రాథమిక చార్జ్‌షీట్(బి-రిపోర్ట్)లో పేర్కొంది. దీన్ని వ్యతిరేకించిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. లోకాయుక్త దర్యాప్తు సరిగా లేదని అభ్యంతరం తెలిపారు. దర్యాప్తులో వదిలేసిన అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. లోకాయుక్త బి-రిపోర్టును అంగీకరించవద్దని విన్నవించారు. దీనిపై విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయాధికారి సంతోష్ గజానన్ భట్ ముడా కేసులో విచారణ కొనసాగించాలని మంగళవారం లోకాయుక్తను ఆదేశించారు. ప్రాథమిక చార్జిషీట్ ఆధారంగా నిర్ణయం తీసుకోలేమని, సమగ్ర నివేదికతో చార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈడీ అభ్యంతరాల పిటిషన్ దాఖలు చేయవచ్చునని సూచించారు. మే 7లోగా సమగ్ర దర్యాప్తు నివేదికను సమర్పించాలని లోకాయుక్తకు సూచించారు. అప్పటివరకు ఈడీ తనిఖీలపై స్టే ఉంటుందని తెలిపారు. దీంతో బి-రిపోర్టు ఆధారంగా ప్రజాప్రతినిధుల కోర్టులో ఉపశమనం పొందవచ్చునని భావించిన సీఎం సిద్ధరామయ్యకు షాక్ తగిలింది.

స్వయంప్రతిపత్తిపై

కమిటీ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల జాబితాలోని వైద్య, న్యాయ, ఆర్థిక శాఖలను ఉమ్మడి జాబితాలోకి మార్చే ప్రయత్నాలను వేగవంతం చేసిందని స్టాలిన్ ఆరోపించారు. ఐదు దశాబ్దాలకు మునుపే 1969లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్ర, రాష్ట్రాల నడుమ సంబంధాలను సమీక్షించడానికి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పీవీ రాజమన్నార్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కేంద్ర-రాష్ట్రాల సంబంధాలపై సమీక్ష జరిపి సమగ్రమైన నివేదికను తయారు చేసి ఆ కమిటీ 1971లో నివేదికను సమర్పించిందన్నారు. ఆ కమిటీ నివేదికను 1974 ఏప్రిల్ 16న శాసనసభలో కరుణానిధి ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని చెప్పారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం 1983లో నియమించిన సర్కారియా కమిటీ చేసిన సిఫారసులతోనూ పెద్దగా ఫలితం లేకపోయిందని స్టాలిన్ వివరించారు. 'కేవలం తమిళనాడు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మేం అధికార వికేంద్రీకరణ, నిధుల కోసం ఒత్తిడి తేవడం లేదు.. గుజరాత్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు, కశ్మీర్ నుంచి కేరళ వరకే దేశ ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఒత్తిడి తెస్తున్నాం. రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై గళం విప్పుతున్న తొలి రాష్ట్రం తమిళనాడు' అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఆధారంగా పనిచేస్తున్న భారతదేశంలోని అన్ని రాష్ట్రాల హక్కులను పరిరక్షించడమే కమిటీ ఏర్పాటు ఉద్దేశమని స్టాలిన్ చెప్పారు. మణిపూర్, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఆచారాలను కూడా గౌరవించాలనేది తమ అభ్యర్థన అన్నారు. 'మా మాతృభాష తమిళం పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. అదే సమయంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లో మాతృభాషలు తమ స్వభావాన్ని కోల్పోతుండటంపైనా అంతే ఆందోళన చెందుతున్నాం' అని స్టాలిన్ పేర్కొన్నారు.

నైరుతిలో వానలే వానలు!

(మొదటి పేజీ తరువాయి)

పోల్చుకుంటే.. 105% ఎక్కువగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నాం" అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర చెప్పారు. రుతుపవన వేగాన్ని ప్రభావితం చేసే ఎల్‌నినో పరిస్థితులు ఈ దఫా తక్కువగానే ఉంటాయని తెలిపారు. దేశంలో సుమారు 43 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటారు. మొత్తం వ్యవసాయ కమతాలలో 52 శాతం వర్షాలపైనే ఆధారపడి ఉన్నాయి. అధిక వర్షపాతం నమోదు అంచనాల నేపథ్యంలో వ్యవసాయం, దానిపై ఆధారపడిన ఆర్థిక రంగాలు పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఆధారిత స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) 18 శాతంగా ఉన్న నేపథ్యంలో ఇది మరింత పెరగడం లేదా స్థిరంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇదిలావుంటే, సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసినా.. దేశంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా ఉండే అవకాశం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కాగా, గత ఏడాది 106% వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణశాఖ అంచనా వేయగా, 108% నమోదు కావడం గమనార్హం.

ఈసారి ఏపీలో మంచి వర్షాలు

వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు కురవనున్నాయి. గత ఏడాది కోస్తాలో శ్రీకాకుళం, ప్రకాశం, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో వర్షాభావం కొనసాగింది. ఈ ఏడాది మాత్రం ఉత్తర కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అత్యంత ఎక్కువగా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయని, రాయలసీమ ల్లోని అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానున్నదని ఐఎండీ వెల్లడించింది.

మెజార్టీలో ప్రాంతాల్లో అధిక వానలే

నాలుగు నెలల నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి భారత వాతావరణ శాఖ ఈ తొలిదశ దీర్ఘకాలిక అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం దేశంలో దక్షిణ, మధ్య, పశ్చిమ, ఉత్తర భారతాల్లోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయి. కోర్ మాన్‌సూన్ ప్రాంతంగా పిలిచే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌తోపాటు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదు కానున్నది. అయితే దక్షిణాదిలో తమిళనాడు, ఉత్తరాదిలో జమ్మూకశ్మీర్, తూర్పు భారతంలో బిహార్, ఈశాన్య భారతంలోని అనేక రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కాగా తాజా నివేదికపై సవరించిన బులెటిన్‌ను వచ్చే నెల చివరి వారంలో విడుదల చేయనున్నది.

నైరుతికి పరిస్థితులు సానుకూలం

ఇదిలా ఉండగా, భూమధ్యరేఖకు ఆనుకుని ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసే వరకు ఈ పరిస్థితులు కొనసాగనున్నాయి. హిందూ మహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) రుతుపవనాల సీజన్ ముగిసే వరకూ కొనసాగనున్నాయి. గత మూడు నెలల కాలంలో ఉత్తరార్థ గోళంలో మంచు కవచం సాధారణం కంటే తక్కువగా కురిసింది. ఉత్తరార్థ గోళం, యురేషియాపై మంచు కవచం తక్కువగా ఉండడం వంటివి నైరుతి రుతుపవనాల సీజన్‌కు సానుకూలమని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని (103 శాతం) ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ఐదు రోజుల క్రితమే అంచనా వేసింది.

నేషనల్ హెరాల్డ్ కేసు..

ఏ1 సోనియా, ఏ2 రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)



ప్రతీకారాలకు వాడుకుంటోందని మండిపడ్డాయి. బుధవారం దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చాయి. సోనియా, రాహుల్‌పై ఏదైనా కేసులో చార్జిషీట్ దాఖలవ్వడం ఇదే మొదటిసారి. ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను స్వీకరించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి విశాల్‌గోగ్నే.. ఈనెల 25న అభియోగ పత్రాలపై విచారణ చేపడతామని వ్యాఖ్యానించారు. ఈ చార్జిషీట్ విచారణార్హమా? కాదా? అన్న దానిపైనా ఈనెల 25న నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి ఈడీ శుక్రవారం అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు చెందిన రూ.700 కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేయనున్నట్లు నోటీసులు జారీ చేసిన నాలుగు రోజుల్లోనే.. చార్జిషీట్ దాఖలు కావడం గమనార్హం..! నేషనల్ హెరాల్డ్‌ను యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తుండగా.. ఇందులో చెరో 38% చొప్పున షేర్లతో సోనియా, రాహుల్ మెజారిటీ వాటాదారులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్‌కు ఢిల్లీలోని బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లోని ఐకానిక్ హెరాల్డ్ హౌస్‌తోపాటు.. ముంబై, లఖ్‌నవూల్లో ఆస్తులున్నాయి. నిజానికి భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో ఏజేఎల్‌ను స్థాపించి, నేషనల్ హెరాల్డ్‌ను ప్రారంభించారు. యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సోనియా, రాహుల్‌గాంధీలకు చెందినది. అయితే.. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన ఆస్తులను సోనియా, రాహుల్ గాంధీ రూ.50 లక్షలకు యంగ్ ఇండియా కంపెనీకి బదిలీ చేశారు. ఆ ఆస్తుల వాస్తవ విలువ రూ.2 వేల కోట్లుగా ఉంటుంది. బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్యన్ స్వామి దీనిపై 2012లో పటియాలా హౌస్ కోర్టులో ఫిర్యాదు చేశారు. తొలుత ఐపీసీలోని సెక్షన్ల కింద కేసు నమోదైంది. 2021లో మనీల్యాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈడీ కంప్లైంట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. 2022లో రాహుల్ గాంధీ, సోనియాలకు సమన్లు జారీచేసి, విచారణను కొనసాగించింది. మంగళవారం కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో సోనియాగాంధీని ఏ1గా, రాహుల్‌గాంధీని ఏ2గా పేర్కొంది. కాంగ్రెస్ నేత సామ్ పిట్రోడా, జర్నలిస్టు సుమన్ దూబే, యంగ్ ఇండియా కంపెనీని నిందితుల జాబితాలో చేర్చింది.

విచారణకు హాజరైన వాద్రా

హరియాణాలో జరిగిన భూఒప్పందంపై మనీల్యాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ నుంచి సమన్లు రావడంతో.. రాబర్ట్‌వాద్రా మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఈడీ ఆయనను దాదాపు 6 గంటల పాటు విచారించి, తిరిగి బుధవారం రావాలని ఆదేశించింది. ఈ సందర్భంగా వాద్రా మద్దతుదారులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈడీ విచారణకు ముందు వాద్రా మీడియాతో మాట్లాడుతూ.. 2008 భూలావాదేవీకి సంబంధించి ఎలాంటి అక్రమాలు లేవన్నారు.

నేడు దేశవ్యాప్త ఆందోళనలు

కేంద్రంలోని బీజేపీ.. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు సీనియర్ నేత జైరాంరమేశ్ సహా.. పలువురు మంగళవారం ఎక్స్‌లో స్పందించగా.. బుధవారం దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనను విడుదల చేశారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్‌ను దాఖలు చేయడాన్ని భారత జాతీయ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ముక్తకంఠంతో ఖండిస్తోందని కేసీ వేణుగోపాల్ అన్నారు. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన ఆస్తులను ఏకపక్షంగా, అన్యాయంగా సీజ్ చేయడాన్ని ఖండించారు. "ఇది(తాము లేవనెత్తుతున్న అంశం) న్యాయ విధానానికి సంబంధించిన అంశం కాదు. ఈ చర్య చట్టబద్ధ పాలన(రూల్ ఆఫ్ లా)ను మునుగుగా ధరించి, చేస్తున్న ప్రభుత్వ-ప్రాయోజిత నేరం. సోనియా, రాహుల్, ఇతర అగ్రనేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేయడమే" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ చర్య.. ప్రజాస్వామ్యబద్ధమైన విపక్ష పార్టీపై దాడి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఈ చర్యలను చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని ఆయన అన్ని పీసీసీలను ఆదేశించారు. అన్ని రాష్ట్రాల్లోని ఈడీ ఆఫీసులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంధ్రా టు ఆంధ్రా వయా తెలంగాణ!

» విశాఖ నుంచి విజయవాడ వెళ్లాలంటే..
రెండు విమానాలు మారాల్సి వస్తోంది
» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన



విశాఖపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం నుంచి పరిపాలనా రాజధాని అమరావతికి విమానంలో వెళ్లాలంటే.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి వస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎదురైన అనుభవాన్ని ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడలో సీఎం చంద్రబాబుతో సమావేశం కావడానికి తాను ఉదయం 8 గంటలకు విశాఖలో బయలుదేరి హైదరాబాద్ చేరుకొని, అక్కడి నుంచి గన్నవరం విమానాశ్రయంలో దిగే సరికి మధ్యాహ్నం ఒంటిగంట అయిందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీఐఐ, ఫిక్కీ తదితర సంస్థలకు చెందిన వ్యాపారవేత్తలు కూడా తనలాగే విశాఖ నుంచి హైదరాబాద్ వచ్చి, అక్కడి నుంచి విజయవాడ చేరుకున్నారని వివరించారు. మంగళవారం వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారాల్సి వచ్చిందన్నారు. విశాఖలో విమాన ప్రయాణికులకు ఎందుకు ఈ దుస్థితి వచ్చిందో ఆలోచన చేసి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. తన ట్వీట్‌ను సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి లోకేశ్‌కు ట్యాగ్ చేశారు. దాంతో పాటు తాను రెండు విమానాల్లో ప్రయాణించేందుకు తీసుకున్న టికెట్లను సైతం గంటా షేర్ చేశారు.

ఉపాధ్యాయురాలు మందలించిందని.. కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

» మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో ఘటన

కోయిలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు మందలించిందని మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఓ 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన సోమవారం జరిగింది. విద్యార్థిని మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో తిరుగుతుండగా లోపలికి రావాలని, మాట వినకపోతే టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తామని ఉపాధ్యాయురాలు గట్టిగా హెచ్చరించింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని దగ్గు మందుతో పాటు ఫినాయిల్, ఓ చుక్క యాసిడ్‌ను కలుపుకొని తాగింది. వాసన రావడంతో తోటి విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు బాలికను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మెరుగుపడటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసి, తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఓ తెలిపారు. ఘటనపై తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ విచారణ నిర్వహించారు.

ఏసీబీ వలలో బయో డైవర్సిటీ విభాగం డీడీ

గచ్చిబౌలి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టరు నుంచి రూ.70వేలు లంచం తీసుకున్న శేరిలింగంపల్లి అర్బన్ బయో డైవర్సిటీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌ను మంగళవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. శ్రీనివాస్ చాంద్రాయణగుట్ట సర్కిల్ అర్బన్ బయో డైవర్సిటీ విభాగం ఇన్‌చార్జిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో మొక్కల పెంపకం, పార్కు అభివృద్ధి పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.44 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఆయన శ్రీనివాస్‌ను సంప్రదించగా ఫైల్‌పై సంతకం చేయాలంటే రూ. 2.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగీకరించిన ఆ కాంట్రాక్టర్ రూ. లక్ష చెల్లించాడు. మరో రూ. 50 వేలు తన స్నేహితుడి ఫోన్ పే ద్వారా చెల్లించాడు. మిగతా రూ.70 వేలు తీసుకుని మంగళవారం శేరిలింగంపల్లి కార్యాలయానికి రావాలని శ్రీనివాస్ చెప్పాడు. దాంతో ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అయన నుంచి శ్రీనివాస్ డబ్బులు తీసుకోగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

21న ఇంటర్ ఫలితాలు!

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలను మరో వారం రోజుల్లో విడుదల చేయాలని ఇంటర్ బోర్డు అధికారులు భావిస్తున్నారు. ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఇప్పటికే పూర్తవగా, ఫెయిలైన విద్యార్థులకు సంబంధించి తొలిసారి చేపట్టిన రీవాల్యుయేషన్ ప్రక్రియ కూడా దాదాపు పూర్తయింది. ఫలితాలను ఈ నెల 21న విడుదల చేసే అవకాశాలున్నాయి. గత నెల 5 నుంచి 25 వరకు జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రభుత్వాన్ని కూలిస్తే మాకేం వస్తుంది?

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ.. అధికారం ఖాయం.. త్వరలోనే రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం

» జాతీయ అధ్యక్ష పదవికి నా పేరు ప్రతిపాదన లేదు
» కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బిగ్‌బాస్ అసదుద్దీన్ ఒవైసీ
» భూ ఆక్రమణదారులే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ వ్యతిరేకులు..
» మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలిస్తే తమకేం వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే స్పష్టం చేశామని, ఆ మాటకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో కిషన్‌రెడ్డి చిట్‌చాట్‌లో మాట్లాడారు. గుజరాత్ వ్యాపారులతో కలిసి బీజేపీ తమ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర చేస్తోందంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణపై స్పందించారు. "ఇక్కడ ప్రభుత్వాన్ని కూలగొడితే మాకేం వస్తుంది? గుజరాత్ వ్యాపారులకు అక్కడేం పనిలేదా? అక్కడ వారు వ్యాపారాలు చేసుకోరా?" అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌కు ఘోర పరాజయం తప్పదన్నారు. భూములను అమ్మడం ద్వారానే ప్రభుత్వాన్ని నడిపే పద్ధతి తెలంగాణాలో మాత్రమే ఉందని విమర్శించారు. భూములు, మద్యం అమ్మకం, అప్పులు తీసుకురావడం ద్వారానే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, గతంలో బీఆర్‌ఎస్ కూడా ఇలాగే చేసిందని అన్నారు. మద్యం అమ్మకాల్లో దేశంలోనే మొదటిస్థానంలో తెలంగాణ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ చట్టాలను ఉల్లంఘించి కంచ గచ్చిబౌలిలో చెట్లను నరికివేయించిందని ఆరోపించారు. అర్ధరాత్రి బుల్డోజర్లు పెట్టి చెట్లు నరికివేసిన ప్రభుత్వం తెలంగాణాలో తప్ప ఎక్కడా లేదని విమర్శించారు. తనది యంగ్ ఇండియా బ్రాండ్ అన్న సీఎం రేవంత్ ప్రకటనపై కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. ఆయనది ఏ బ్రాండో వచ్చే ఎన్నికల్లో తెలుస్తుందన్నారు. తన బ్రాండ్ మాత్రం నేషనలిజమేనన్నారు. తమిళనాడులో ఎన్డీఏ కూటమి పునరుద్ధరణే తప్ప.. కొత్త పొత్తు కాదని స్పష్టం చేశారు.

త్వరలోనే కొత్త అధ్యక్షుడు..

రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం త్వరలోనే జరిగే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. దక్షిణాదిన తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల నియామకం జరిగిందని, ఇంకా తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక, పుదుచ్చేరిలకు జరగాల్సి ఉందని పేర్కొన్నారు. జాతీయ పార్టీకి కూడా కొత్త అధ్యక్షుడు రానున్నారని, అయితే.. ఈ పదవికి తన పేరు మాత్రం ప్రతిపాదనలో లేదని చెప్పారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీచేసి అధికారంలోకి వస్తామని ప్రకటించారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా పొత్తులపై ఎలాంటి చర్చ జరగలేదని, ఈ ఎన్నికల్లో బీజేపీకి, మజ్లి‌స్‌కు మధ్యే పోటీ అని అన్నారు. మోదీ ప్రభుత్వం పేదలకు 5 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే దీనికి అదనంగా సన్నబియ్యం ఇవ్వాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే సింగరేణి కార్మికుల ఆదాయ పన్నును రీయింబర్స్‌మెంట్ చేస్తామని చెప్పారు.

ఆందోళనలు చేస్తున్నది భూ ఆక్రమణదారులే

భూ బకాసురులు, భూ ఆక్రమణదారులే వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. భూ ఆక్రమణదారులతోనే మజ్లిస్ పార్టీ దర్నాలు చేయిస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డుతో ఒక్క పేద ముస్లిం కుటుంబానికైనా న్యాయం చేశారా? అని మజ్లిస్ నేతలను నిలదీశారు. వక్ఫ్ బోర్డు పేరుతో భూ దందాలు చేసేవారే ఇప్పుడు ఆందోళనలు చేస్తున్నారన్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బిగ్‌బాస్ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అని, ఆ రెండు పార్టీలను ఆయనే కంట్రోల్ చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణాలో మజ్లిస్ విస్తరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశమంతా ఒకవిధంగా, తెలంగాణాలో మరో విధంగా మజ్లిస్ వైఖరి ఉంటోందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ ఎందుకు పోటీ చేయదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని రెండు జాతీయ పార్టీల్లో ఒకటి మూటలు మోసేది అని, మరోటి చెప్పులు మోసేది అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్ దారుస్సలాం అడుగులకు మడుగులొత్తుతున్నారని అన్నారు.

కనబడుట లేదు



పై ఫోటో లోని వ్యక్తి పేరు పట్టికూటి ఆశిష్ చౌదరి, వయస్సు 27 సంవత్సరాలు, ఎత్తు 5' 11". సోమవారం ఉదయం 7:30 నుండి ఇతను కనిపించుటలేదు. సోమవారం ఉదయం గుంటూరు పట్టాభిపురం సమీపంలో చివరిసారిగా కనిపించినప్పుడు అతను నల్ల చొక్కా మరియు నల్ల టోపీ ధరించాడు. అతను తన మొబైల్ కానీ పర్స్ కానీ తీసుకెళ్లలే దు. ఎవరైనా అతన్ని చూసినా లేదా అతని ఆచూకీ గురించి ఏదైనా సమాచారం ఉంటే, దయచేసి వెంటనే ఈ క్రింది నంబర్‌కు మమ్మల్ని సంప్రదించండి. 919949595534

తండ్రి నుండి వ్యక్తిగత సందేశం:
ఆశిష్, జీవితంలో మనకు సమస్యలు వచ్చినట్లే మనందరికీ అవకాశాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. మనమందరం కలిసి కట్టుగా చేసిన తప్పులనుండి నేర్చుకుంటూ, మరల ఆ తప్పులు పునరావృతం చేయకుండ, వెతుక్కుంటూ ఎదురు వచ్చే అవకాశాలను నీతో కలిసి అందిపుచ్చుకోవాలని ఆశతో నీకోసం ఎదురు చూస్తున్న
మీ నాన్న, అమ్మ, చెల్లి

లా, పీజీఎల్ సెట్‌లకు గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : లాసెట్, పీజీఎల్ సెట్-2025 దరఖాస్తులకు గడువు పెంచుతున్నట్లు కన్వీనర్ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వినతి మేరకు గడువును పెంచుతున్నామని వివరించారు.

ఇచ్చిన చెక్కులనే మళ్లీ ఇస్తూ..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, వారిని కనీసం లక్షాధికారులుగా కూడా చేయలేకపోయారని విమర్శించారు. ఎస్‌హెచ్‌జీలకు రుణాలిచ్చే స్త్రీనిధి నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం దురదృష్టకరమని, మొత్తం రుణాలలో 40శాతం వాటా నిరర్థక ఆస్తుల రూపంలో ఉండటం ఆ సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. మహిళలకు రూ.21వేలకోట్ల వడ్డీలేని రుణాలను ఇచ్చామంటూ మంచిర్యాలలలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మరోసారి అబద్ధాలాడారని విమర్శించారు. కేవలం బ్యాంకు లింకేజీ కల్పించి.. తామే రుణాలిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని, ప్రభుత్వం ఎప్పటిలాగే రూ.5లక్షలవరకే వడ్డీలేని రుణాలిస్తున్నమాట వాస్తవం కాదా? అని భట్టిని ప్రశ్నించారు. రూ.20 లక్షలు రుణం తీసుకుంటే.. అందులో రూ.15లక్షలకు మహిళలే వడ్డీలు కడుతున్నారని, కాంగ్రెస్ సర్కారు ఈ వాస్తవాన్ని విస్మరించి అసెంబ్లీసాక్షిగా, బహిరంగ సభల్లో అబద్ధాలు చెప్పి మహిళలను మోసగిస్తోందని పేర్కొన్నారు.

తడిసిన ప్రతి గింజా కొనాలి



'రైతుభరోసా ఇవ్వకుండా, సాగునీరు ఇవ్వకుండా, విద్యుత్తు సక్రమంగా సరఫరా చేయకుండా రాష్ట్రంలోని రైతన్నలను కాంగ్రెస్ సర్కారు నట్టేట ముంచింది" అని హరీశ్ విమర్శించారు. ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన రైతు దంపతులు బొల్లం రామయ్య, చంద్రకళ ఆవేదన చూస్తే కడుపు తరుక్కుపోతోందని.. వారు కౌలుకుతీసుకున్న 18ఎకరాల్లో వరి సాగుచేశారని, పండించిన పంటను ప్రభుత్వం కొనకపోవడం, అకాలవర్షం వల్ల తడి సిన ధాన్యం కుప్ప వద్ద వారు కన్నీరుపెట్టుకోవడం తనను కలచివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవటం లేదని చెప్పేందుకు ఈ రైతుల కన్నీటి దృశ్యమే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. తడిసిన ప్రతిగింజను కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ పేరిట అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు రాకపోవడం ఇబ్బందిగా మారిందని, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలకు, సీవోలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. జీతాలు పెండింగ్‌లో పెట్టి రొటేషన్ చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఉపాధి సిబ్బంది జీతాలను ఎవరి ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం తక్షణం స్పందించి ఉపాధి సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆసరా శూన్యమై.. చావే నయమై..

» అండగా నిలిచేవారెవరూ లేరని వృద్ధురాలి దిగులు
» దివ్యాంగుడైన కుమారుడితో కలిసి ఆత్మహత్య



బుడిగెం వీరమ్మ, నాగేశ్వరరావు(ఫైల్)

చిలుకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తనకేమో వయసు మీద పడిపోయింది. పనిచేసే శక్తి లేదు. కుమారుడేమో దివ్యాంగుడు. మాట్లాడలేడు.. ఎవ్వరి సాయం లేకుండా బతకనూ లేడు! తాను లేకపోతే కొడుకును ఎవరు చూసుకుంటారని ఆందోళన చెందిన ఆ వృద్ధురాలు, అతడితో కలిసి ఆత్మహత్య చేసుకుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కొత్తతండాపురంలో ఈ ఘటన జరిగింది. చిలుకూరు మండల పరిధిలోని పాత కొండాపురం గ్రామానికి చెందిన బుడిగెం వీరమ్మ (65), బిక్షమయ్య దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. బిక్షమయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. మొదటి కుమారుడికి పెళ్లయి విడిగా ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండో కుమారుడు వీరబాబు ఇటీవల మృతిచెందాడు. మూడో కుమారుడు నాగేశ్వరరావు (43) దివ్యాంగుడు. కొండంత భరోసాగా ఉన్న తమ్ముడు ఇటీవల చనిపోవడంతో తనకేమైనా జరిగితే దివ్యాంగుడైన కుమారుడు దిక్కులేని వాడవుతాడని భావించింది. సోమవారం రాత్రి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు కుమారుడిని తీసుకువెళ్లి అతడిని నీళ్లలోకి తోసేసింది. అనంతరం తానూ దూకేసింది. బావిలో మంగళవారం ఇద్దరి మృతదేహాలు తేలాయి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఏపీ మద్యం స్కామ్‌లో సాయిరెడ్డికి పిలుపు

» 18న విచారణకు రావాలంటూ సిట్ నోటీసు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మరో అడుగు ముందుకేసింది. తాడేపల్లి బాస్ చీకటి గుట్టుమట్లు తెలిసిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి నోటీసు జారీ చేసింది. 18న సిట్ ఆఫీసుకు రావాలని దర్యాప్తు అధికారి పేరుతో ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. అయితే, ఆ రోజు తనకు వేరే పనులు ఉన్నాయని, 17వ తేదీ అయితే రాగలనని సాయిరెడ్డి తెలిపారు. ఇందుకు సిట్ అధికారులు అంగీకరించారు.

కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం

» ప్రభుత్వం ఈ మొక్కలను నరికితే సుప్రీంకు వెళ్తాం
» పర్యావరణ వేత్తలు, ప్రముఖ వృక్ష శాస్త్రవేత్తలు

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రయోజనాలను అందిస్తున్న కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందామని పర్యావరణవేత్తలు, ప్రముఖ వృక్షశాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కోనోకార్పస్ (దుబాయ్) మొక్కలను రక్షించుకుందాం' అనే అంశంపై జరిగిన సమావేశంలో శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు. ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, యోగివేమన వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో పరిశోధనలు జరిపిన ప్రొఫెసర్ ఏఆర్ రెడ్డి మాట్లాడుతూ... మొక్కలన్నింటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తున్న మొక్క కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రజలు అపోహలను నమ్మి మంచి ప్రయోజనాలు గల కోనోకార్పస్ మొక్కలను నరక వద్దని కోరారు. సీసీఎంబీ మాజీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. కోనోకార్పస్ చెట్లు అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు కోనోకార్పస్ మొక్క ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తుందని పేర్కొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోనోకార్పస్ చెట్లను నరికే కార్యక్రమాన్ని కొనసాగిస్తే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ బీ.ఎస్.రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ, వీ.ఎస్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్లను గౌరవించరా? కాంగ్రెస్‌లో నా స్థానమేంటి?

» మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వంపై సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్లను గౌరవించరా? అని ప్రశ్నించారు. 'పార్టీలో నా స్థానం ఏమిటి? సీనియారిటీకి గౌరవం పొందలేని పరిస్థితులున్నాయి. ఇది నాకు అసంతృప్తిగా ఉంది' అని ఆయన మంగళవారం జగిత్యాలలో మీడియా తో అన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హన్మంత్‌రావు (వీహెచ్) తర్వాత నేనే సీనియర్ని.. జానారెడ్డి కూడా నా తర్వాత నాలుగేళ్లకు సభ్యత్వం తీసుకున్నారు' అని చెప్పారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, శాసనసభాపక్ష నేతగా భట్టి విక్రమార్క స్థాయిలోనే తానూ శాసనమండలిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఒంటరిపోరాటం చేశానన్నారు. 4 దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని చెప్పారు. సీనియర్ నేతలు ప్రేమ్‌సాగర్‌రావు, రాజ్‌గోపాల్‌రెడ్డి పదవులు ఆశించడం తప్పుగా భావించొద్దన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దశాబ్దాల అన్యాయానికి దిద్దుబాటు!

దశాబ్దాలుగా తమకు తీరని అన్యాయం జరుగుతోందని బలంగా వాదిస్తున్న ఒక వర్గాన్ని సంతృప్తిపరచటం చాలా కష్టమైన పని. దాన్ని అధిగమించి లక్ష్యాన్ని సాధించటం అరుదు. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలును నిస్సందేహంగా దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎస్సీలకు గంపగుత్తగా అమలవుతున్న రిజర్వేషన్లను వెనుకబాటుతనం ప్రాతిపదికగా వర్గీకరించే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు కిందటి ఏడాది ఆగస్టు 1న ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును అమలుపరచటానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ప్రకటన, ఆ తర్వాత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, తదనంతరం జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్‌ను నియమించటంలోనూ ఆ వేగం కనపడింది.

షమీమ్ అక్తర్ కమిషన్ విస్తృతంగానే అభిప్రాయసేకరణ జరిపింది. వర్గీకరణకు వ్యతిరేక, అనుకూల వాదనలను పరిగణనలోకి తీసుకుని నివేదికను ఇచ్చింది. ఎస్సీల్లోని సంపన్న శ్రేణికి రిజర్వేషన్లను వర్తింపచేయకూడదన్న కీలక సిఫార్సు మినహా మిగతా వాటిని తెలంగాణ మంత్రివర్గం యథాతథంగా ఆమోదించిందనే భావించొచ్చు. మొత్తంగా ఎస్సీలను మూడు సమూహాలుగా విభజించి రిజర్వేషన్ల శాతాలను (9శాతం, 5శాతం, 1శాతం) కమిషన్ ప్రతిపాదించింది. ఆ శాతాల్లో మార్పులు చేయాలని ఒత్తిడి వచ్చినా ప్రభుత్వం కమిషన్ సిఫార్సులకే కట్టుబడింది. అంబేడ్కర్ జయంతి రోజునే వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి తను అనుకున్న దాన్ని సాధించగలిగింది.

మొత్తంగా చూస్తే దశాబ్దాల నుంచి వర్గీకరణను గట్టిగా కోరుతున్న వర్గం నుంచి గరిష్ఠ సంతృప్తి వ్యక్తమైందనే చెప్పుకోవచ్చు. శాతాల విషయంలో అసంతృప్తులు ఉన్నా అవేమీ ప్రభుత్వంపై ఆగ్రహం పెట్టుకునే స్థాయిలో లేవు. వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో అసంతృప్తి, ఆగ్రహం ఉండటం సహజం. సంఖ్యాపరంగా తక్కువ ఉన్న కులాల్లో తమకు మరింత ఎక్కువ శాతం రిజర్వేషన్లు ఉండాలని కోరుకోవటాన్ని కూడా న్యాయబద్ధంగానే భావించొచ్చు. సామాజిక సామరస్యం దృష్ట్యా వీటిని కూడా ప్రభుత్వం పట్టించుకుని పరిష్కారమార్గాలు ఆలోచించాలి. ఒక నిర్ణయంతో జన సమూహాలు శత్రు శిబిరాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యతా ప్రభుత్వంపై ఉంటుంది.

కులాల జనసంఖ్య ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదని వర్గీకరణ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. విద్య, ఉద్యోగాల్లో వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించాలనీ చెప్పింది. అట్లాకాకుండా రాజకీయ లాభనష్టాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే న్యాయస్థానాల తలుపులు తట్టవచ్చని కూడా ఖచ్చితంగానే ప్రకటించింది. షమీమ్ అక్తర్ కమిషన్ కూడా వీటిని పరిగణనలోకి తీసుకునే సిఫార్సులు చేసిందని కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో చెప్పారు. వివిధ కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి ఖచ్చితమైన సమాచారం లభిస్తే కొన్ని అపోహలు తొలగిపోతాయి. ఎవరు ఎక్కడున్నారో స్పష్టమవుతుంది. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనంత సమగ్రంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే నిర్వహించామని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటోంది. సర్వేని నిర్వహించి తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని రాహుల్ గాంధీ ప్రకటిస్తూనే ఉన్నారు. కానీ సర్వేలో తేలిన అసలు నిజాలు ఇంకా వెలుగులోకి రాలేదు. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల జనాభా శాతాలను మాత్రమే ఇప్పటివరకూ ప్రభుత్వం ప్రకటించింది. కనీసం ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ఎవరు ఎక్కడున్నారో తెలిపే గణాంకాలను సైతం బయటపెట్టలేదు. నిజానికి స్థూల శాతాలతో తెలిసిన కొత్త విషయం ఏదీ లేదు. ఏ రాష్ట్రంలోనైనా ఏడెనిమిది కులాలు మినహా మిగతావన్నీ రిజర్వేషన్ల కేటగిరీలోనే ఉంటాయి. సహజంగానే తెలంగాణలో వెల్లడైన శాతాల చిత్రమే అన్ని చోట్లా కనపడుతుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల్లో ప్రాతినిధ్యం చుట్టూనే వర్గీకరణ ఉద్యమం ప్రధానంగా తిరిగింది కాబట్టి ఆ విషయంలో షమీమ్ అక్తర్ కమిషన్ తేల్చిన నిజాలు సంపూర్ణంగా వెల్లడైతే అసంతృప్తులు చల్లారే అవకాశం ఉంది. మాల, మాదిగ వర్గాలు చేస్తున్న వాదనల్లో సహేతుకత ఎంతో తెలుస్తుంది. ఏ ఉద్యమమైనా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటానికి అసలు విషయాలకు అతిశయోక్తులను జోడిస్తుంది. దీన్ని తప్పుపట్టలేం! ప్రపంచవ్యాప్తంగా ఇది జరిగింది. ఇంకా జరుగుతోంది కూడా! కానీ, ఎప్పుడో ఒకప్పుడు నిజాలు వెల్లడి కావాలి. వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చింది కాబట్టి ఇప్పటికైనా షమీమ్ అక్తర్ నివేదికను ప్రజల ముందుంచటం పారదర్శకత దృష్ట్యా అత్యవసరం. గట్టి గణాంకాల ఆధారంగా వర్గీకరణ జరిగి, సామాజిక న్యాయం సంపూర్ణతను సంతరించుకుంటే దాన్నుంచి మరెందరో ప్రేరణపొందే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ అజెండా అదే కదా!

ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా వర్గీకరణకు మార్గం సుగమమైంది. ఎస్సీ రిజర్వేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అమలుచేయటానికి మంగళవారం మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. వర్గీకరణకు ఉమ్మడి రాష్ట్రంలో మూడు దశాబ్దాల ఆందోళనకు రెండు తెలుగు రాష్ట్రాలు సముచిత రీతిలో స్పందించి మార్గదర్శకంగా నిలిచాయి.

కులాల్లో అంతర్గతంగానే గాక విభిన్న కులాల మధ్య నెలకొంటున్న ఆర్థిక అంతరాలు ఏ సమస్యనీ ఒకే దృక్పథంతో చూడనివ్వటం లేదు. ఇదొక సంక్లిష్ట పరిస్థితి. నిరంతరం మారిపోయే పరిస్థితి అని కూడా చెప్పుకోవాలి. రిజర్వేషన్లు బాగా అందుకున్న కులాలు... అలా అందుకోలేని కులాల మధ్య ఆర్థిక అంతరాలు స్పష్టంగా కనపడుతున్నాయి. వర్గీకరణతో ప్రస్తుతానికి పరిష్కారం లభించినా కొత్త డిమాండ్లు ఈ అంతరాల ఆధారంగా ఇకపై రావని భావించలేం. అందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాల్సిందే! సంపన్నశ్రేణి సమస్యను ఎల్లకాలమూ వాయిదావేసే పరిస్థితీ ఉండకపోవచ్చు!

తన చమురు, సహజ వాయువును భారత్ తదితర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా కసరత్తు చేస్తోంది. అగ్రరాజ్యం నుంచి చమురు దిగుమమతులను పెంచుకోవాలంటే సంప్రదాయ చమురు ఉత్పత్తి దేశాల నుంచి దిగుమతులు తగ్గించుకోవాలి. మన ప్రవాస కార్మికుల ఉపాధి, ఇతర వాణిజ్య అవసరాలు దృష్ట్యా గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవడం అంత సులువు కాదు.

ట్రంప్ తెచ్చిన సుంకాల సంకటం

అమెరికా నూతన సుంకాల విధానం బలవంతుడు, బలహీనుడు అనే సహేతుకత లేకుండా కొనసాగుతుండగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్ళకు గురవుతోంది. ఇది ఒక రకంగా అగ్రరాజ్యం ప్రారంభించిన వాణిజ్య యుద్ధం. కొన్ని దేశాలు ప్రతీకార సుంకాలతో ఎదురుదాడి చేస్తుండగా మరికొన్ని దేశాలు అనిశ్చిత స్థితిలో ఉన్నాయి. భారత్ మాత్రం బహిరంగ ఆవేశానికి లోనుకాకుండ వ్యూహాత్మక మౌనంతో వ్యవహరిస్తూ స్వీయ ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవడానికి ప్రయత్నిస్తోంది.

అమెరికాలో నూతన సుంకాలు అమలులోకి వచ్చిన రోజు వ్యూహాత్మకంగా పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా సుంకాల ప్రస్తావన బహిరంగ చర్చ కాకుండా కేంద్రం కట్టడి చేసింది. అమెరికాతో చర్చల సారాంశం ఎక్కడా వెల్లడవకుండా జాగ్రత్త పడుతున్నారు.

అమెరికా సుంకాల నేపథ్యంలో ప్రపంచ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. భారత్‌లో చమురు, వ్యవసాయ రంగాలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై వాటి ప్రభావం ఉంటుంది. భారత్‌తో సహా వివిధ

గల్ఫ్ లేఖ

దేశాలతో తన వాణిజ్యలోటును భర్తీ చేసుకోవడం అమెరికా లక్ష్యం. ఇందుకు తన వద్ద ఉన్న చమురు, సహజ వాయువును భారత్‌తో సహా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా కసరత్తు చేస్తోంది. అగ్రరాజ్యం నుంచి చమురు దిగుమతులను పెంచుకోవాలంటే సంప్రదాయ చమురు ఉత్పత్తి దేశాల నుంచి దిగుమతులు తగ్గించుకోవాలి. అయితే మన ప్రవాస కార్మికుల ఉపాధి, ఇతర వాణిజ్య అవసరాలు దృష్ట్యా గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవడం అంత సులువు కాదు. ఇప్పటికే భారత్‌లో తమ ఎగుమతులను పెంచుకోవడానికి గల్ఫ్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపాదిత రిఫైనరీ నిల్వ సామర్థ్యానికి మూడింతలు ఎక్కువగా తమకు చమురు వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఇస్తే పెట్టుబడులు పెడుతామని గల్ఫ్ దేశాలు షరతు విధిస్తున్నట్లు సమాచారం. ఇదిలా వుండగా భారత చమురు విపణిలో తమకు మరింత వాటా కావాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది.

నేరుగా ఒక్క అమెరికా ఎగుమతులపైనే కాకుండ అమెరికా సుంకాల వలన ప్రభావితమయ్యే ఇతర దేశాలకు జరిగే భారతీయ ఎగుమతులపై కూడా సుంకాల తాకిడి ఉంటుంది. ఇది ఎంత అనేది ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయడం కష్టం. భారత వ్యవసాయ రంగంపై 26 శాతం పన్నుల విధింపును అమెరికా తాత్కాలికంగా వాయిదా వేసుకున్నది. దీనివల్ల పరస్పర చర్చలకు దారి సుగమమయింది. అమెరికాతో బుజ్జగింపు చర్యలలో భాగంగా కొన్ని రంగాలను కాపాడుకోవడానికి మరికొన్నింటిని అనివార్యంగా బలిపీఠం ఎక్కించవల్సి వస్తుంది. అమెరికా మద్యం లేదా మోటర్



సైకిళ్ళు మొదలైన విలాస వస్తువులపై సుంకాలు తగ్గించడం వల్ల సామాన్యులకు సమస్య ఉండదు. అయితే కీలకమైన ఆహార ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయిక ఉత్పత్తుల విక్రయ రంగంలో అడుగుపెట్టడానికి అమెరికా దశాబ్దాలుగా కలలు కంటోంది. భారతీయ విపణిలో ప్రవేశానికి నిరంతరం ప్రయత్నిస్తోంది. సువిశాల భారతీయ వ్యవసాయక రంగంపై అమెరికా ఏనాటి నుంచో కన్నేసి ఉన్నది. అయితే పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలన్నీ కీలకమైన వ్యవసాయరంగం, దాని అనుబంధ మత్స్య, కోళ్ళ పరిశ్రమ రంగాలను కాపాడుకుంటూ వస్తున్నాయి. అమెరికా వ్యవసాయిక ఉత్పత్తులపై మనం 39 నుండి 65 శాతం సుంకాలు విధిస్తుండగా అదే అమెరికా మన దేశ దిగుమతులపై 4–5 శాతం మాత్రమే సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు పరిస్థితి మార్పు తథ్యమనిపిస్తోంది. దౌత్యపరమైన ఇచ్చిపుచ్చుకునే విధానంలో కొన్నిసార్లు మినహాయింపులు ఇవ్వడం జరుగుతోంది. భారీ భూకమతాలు, జన్యుమార్పిడితో అధిక దిగుబడులు సాధించే అమెరికాతో, వాతావరణాన్ని విశ్వసించి వ్యవసాయం చేస్తూ జీవనోపాధి కల్పించే ఇతర దేశాలు పోటీపడడం అంత సులువు ఏమీ కాదు. కీలకమైన వ్యవసాయ రంగంలో రైతులను విస్మరించి కార్పొరేటీకరణ కేంద్రీకృత వ్యవసాయ విధానం అమలు చేయాలని చూస్తే జరిగేదేమిటి? ప్రస్తుతం బియ్యం పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. పండించే రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అలాగని అధిక ధరలు, తరుచుగా మారుతున్న వంగడాల వలన వినియోగదారులకు ఇబ్బంది ఎదురవుతోంది. పౌల్ట్రీ రంగంలోనూ అమెరికా అగ్రగామే. దాని ధాటికి ఇతర దేశాలు తట్టుకోవడం కష్టం. భారతీయ పౌల్ట్రీ రంగంలో అమెరికా అడుగు పెట్టకుండా ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చాల కాలంగా కృషి చేసి అమెరికాను నిలువరించగలిగారు. అయినా చివరకు అమెరికా కోడి కాళ్ళ దిగుమతులను అడ్డుకోలేకపోయారు. భారతీయ కోళ్ళ పరిశ్రమలో దేశంలోని అగ్ర రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉందనే విషయాన్ని విస్మరించరాదు.

కోడి కాళ్ళు కాకుండ మొత్తం కోడిని భారత్‌కు ఎగుమతి చేయడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ విషయంలో అమెరికా సఫలీకృతమైతే భారతీయ పౌల్ట్రీ రంగం మనుగడ కష్టమవుతుంది. ఇప్పుడు సుంకాల చర్చలలో అమెరికాను చల్లబర్చడానికి పౌల్ట్రీ రంగంలో అగ్రరాజ్యాన్ని తక్కువ సుంకాలతో అనుమతించే అవకాశాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇక మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల విషయానికి వస్తే, రొయ్యలు అగ్రగామి. వీటిపై అమెరికా హెచ్చించిన సుంకాలు తాత్కాలికంగా వాయిదా వేసింది కానీ పూర్తిగా రద్దు చేయలేదు. మన దేశం నుంచి అమెరికాతో పాటు విదేశాలకు రొయ్యల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. అమెరికా సుంకాలతో ఆంధ్ర రొయ్యల సేద్యంపై ప్రతికూల ప్రభావం పడే ఆవకాశాలున్నాయి. మరో మూడు నెలలు కాదు కానీ ఒక సంవత్సరం తర్వాత ట్రంప్ సుంకాల ప్రభావం ఒక్కొక్కటిగా భారత్‌తో పాటు యావత్తు ప్రపంచానికి తెలిసి వస్తుంది. అయితే అప్పటికి చాలా నష్టం సంభవించడం ఖాయం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వ్యవస్థీకృతమైన పోలీసు హింస



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'దేశంలో జైళ్లు 5.70 లక్షలమంది ఖైదీలతో నిండిపోయాయి. గత దశాబ్దంలో ఖైదీల సంఖ్య 50శాతం కంటే పెరిగిపోగా, అనేక రాష్ట్రాల్లో ఉండాల్సిన దాని కంటే 200 శాతం ఎక్కువగా ఖైదీలు జైళ్లలో మగ్గిపోతున్నారు. నిద్రపోయేందుకు సరైన స్థలం కూడా దాదాపు 31శాతం ఖైదీలకు లభించడం లేదు. మొత్తంగా 20శాతానికి పైగా ఖైదీలు మూడేళ్లకు పైగా విచారణ లేకుండా మగ్గిపోతున్నారు. జైళ్లలో 30శాతం పైగా సిబ్బంది పోస్టులు ఖాళీలు ఉన్నాయి.' మంగళవారంనాడు ఢిల్లీలో విడుదలైన 'ఇండియా జస్టిస్' రిపోర్ట్ సారాంశమిది. మాజీ న్యాయమూర్తులు, న్యాయనిపుణులు, పలు పౌర సంస్థలు కలిసి రూపొందించిన నివేదిక ఇది. దేశంలో నేర న్యాయవ్యవస్థ తీరుతెన్నులను అది వెల్లడించింది. రూల్ ఆఫ్ లా అమలు చేయడంలో భారతదేశం 142 దేశాల్లో 77వ స్థానంలో ఉన్నది! నేర న్యాయవ్యవస్థను అమలు చేయడంలో 89వ స్థానంలో ఉన్నది!!

భారతదేశంలో నేరాలను అదుపు చేయడంలో ఫోరెన్సిక్ సైన్స్ కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీలను సమర్థంగా ఉపయోగిస్తున్నామని, ప్రజలకు న్యాయాన్ని సకాలంలో సంతృప్తికరంగా అందించేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం నాడు అఖిల భారత ఫోరెన్సిక్ సైన్స్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ అన్నారు. కేంద్ర హోంమంత్రి మాటలకూ, ఆచరణలో కనిపిస్తున్న దానికీ పొంతన లేదు. తాను మాట్లాడిన ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలోనే 50శాతానికి పైగా ఖాళీలు ఉన్న విషయం ఆయనకు తెలియనిది కాదు.

జైళ్లు నిండిపోకుండా ఉండాలంటే, ప్రజలకు సకాలంలో న్యాయం అందాలంటే న్యాయ వ్యవస్థ సరిగా పనిచేయాలి. కాని దేశంలో హై కోర్టులు, జిల్లా కోర్టుల్లో 5.1 కోట్ల మేరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సగటున మూడేళ్లకు పైగా 61 శాతం కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. 1987లో లా కమిషన్ దేశంలో ప్రతి పదిలక్షల మందికి కనీసం 50 మంది న్యాయమూర్తులు ఉండాలని తెలిపింది. కాని ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదు. ప్రతి పదిలక్షల మందికీ కేవలం 15 మంది న్యాయమూర్తులే ఉన్నారు. జిల్లా కోర్టుల్లో ప్రతి జడ్జిపైనా 2200 కేసుల భారం ఉంది. ఈ పరిస్థితి మూలంగా క్రింది కోర్టుల్లో మూడేళ్లకు మించిన పెండింగ్ కేసులు 25 నుంచి 45 శాతానికి పెరిగిపోయాయి. బిహార్‌లో అయితే క్రింది కోర్టుల్లో 71 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టుల్లో ఈ పరిస్థితి ఇంతకంటే ఘోరంగా ఉన్నది. దేశంలోని 25 హైకోర్టుల్లో అయిదేళ్లకు మించి పెండింగ్‌లో ఉన్న కేసులు 51 శాతానికి పై మాటే. సుప్రీంకోర్టులో అయితే 81వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

దేశం అత్యాధునిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందాలంటే నేర న్యాయవ్యవస్థ, రూల్ ఆఫ్ లా సక్రమంగా ఉండడం ముఖ్యం. ఒక దేశం అభివృద్ధి చెందిందని చెప్పేందుకు కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కొలమానం కాదు. సామాజిక శాంతి, అందరికీ సమాన న్యాయం కూడా అభివృద్ధికి కొలమానాలే. కాని ఇక్కడ ప్రజలకు సకాలంలో న్యాయం అందడం అనేది ఒక సుదూర స్వప్నంగా మిగిలిపోయింది. న్యాయం ఆలస్యం కావడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే అన్నది ఒక నానుడి. కాని మన నేతలు ఎంత టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నా, కోర్టులు, పోలీసు స్టేషన్లకు వెళ్లిన వారికి మనం ఎన్ని దశాబ్దాలు వెనుకగా ఉన్నామో అర్థమవుతోంది. ప్రజలకు న్యాయం అందడమే కష్టమైనప్పుడు దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు అన్న తేడా లేకుండా సమాన న్యాయం అందడానికి మనకు ఎంత కాలం పట్టాలి? దేశంలో పేరుకుపోయిన కేసులన్నీ పరిష్కారం కావాలంటే 324 సంవత్సరాలు పడుతుందని నీతీ ఆయోగ్ ఒక నివేదికలో పేర్కొంది. న్యాయవ్యవస్థలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, బీసీల శాతం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల్లో కేవలం 14 శాతం మంది ఎస్సీలు కాగా హైకోర్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు అయిదు శాతం మంది మాత్రమే ఉన్నారు. బీసీలు కేవలం 25.6 శాతం మంది మాత్రమే.

న్యాయవ్యవస్థ వేగంగా న్యాయం అందించకపోవడానికి న్యాయమూర్తుల సంఖ్య, మౌలిక సదుపాయాలు లేకపోవడం కారణమైతే, ప్రజలు చట్టం, న్యాయం పట్ల నమ్మకం కోల్పోవడానికి పోలీసు వ్యవస్థ కూడా కారణం. భారతదేశంలో పోలీసింగ్ పరిస్థితిపై కామన్ కాజ్, లోక్‌నీతి -సీఎస్‌డీఎస్ వారం రోజుల క్రితం విడుదల చేసిన నివేదిక అనేక పచ్చి నిజాలను వెలికితీసింది. దేశంలోని 8వేల మంది పోలీసులను ఈ సంస్థలు ప్రశ్నించి నివేదికను రూపొందించాయి. దేశంలో నేరాలను పరిష్కరించాలంటే చట్టవ్యతిరేకంగా బలప్రయోగం చేయడమే సరైనదని పోలీసుల్లో అత్యధికులు భావిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. వారికి రూల్ ఆఫ్ లా అన్నా, నిబంధనలు పాటించడమన్నా లెక్కలేదని తెలిపింది. సమాచారం రాబట్టాలంటే హింస తప్పదని సగానికి పైగా పోలీసులు చెప్పారని వెల్లడించింది. వ్యవస్థ నేరస్థులను రక్షిస్తుందని ఈ నివేదిక తెలిపింది. ప్రజల్లో భయం ఉండాలంటే బలప్రయోగం తప్పదని 55 శాతం మంది పోలీసులు చెప్పారని, సీరియస్ కేసుల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించాల్సిందేనని 30శాతం మంది సమర్థించుకున్నారని, చిన్ననేరాలకు కూడా హింసించకపోతే నిజాలు బయటకురావని 9శాతం మంది పోలీసులు చెప్పారని తెలిపింది. అరెస్టుకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలంటే ప్రతిసారీ సాధ్యం కాదని 24శాతం మంది పోలీసులు అంగీకరించారని తెలిపింది. పోలీసుల ప్రతాపానికి గురైన వారిలో అత్యధికులు దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, మురికివాడల్లో నివసించేవారే కావడం గమనార్హం. దీంతో చట్టాలు ఎవరికి అనుకూలంగా పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. ఎలాంటి ఫోరెన్సిక్ నైపుణ్యం లేకుండానే డాక్టర్లు వైద్యపరీక్షలు చేయడం, మెజిస్ట్రేట్లు తరుచూ మౌన ప్రేక్షకులుగా ఉండిపోవడం సహజ పరిణామం. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారమే 2011–2022ల మధ్య పోలీసు కస్టడీలో 1107 మంది మరణించారు. కాని ఒక్క పోలీసు అధికారికి కూడా శిక్షపడలేదు అసలు భారత న్యాయవ్యవస్థనే పోలీసు హింస కమ్మి వేసిందని, టెక్నాలజీ, ఏఐ గురించి ఎంత



సమాజంలో అన్ని వర్గాలకూ చట్టం సమరీతిలో వర్తించాలంటే పోలీసులు వృత్తి నైపుణ్యంతో వ్యవహరించాలి. అంతర్జాతీయ ఒడంబడికల స్ఫూర్తితో హింసాకాండకు వ్యతిరేకంగా అనేక దేశాలు చట్టాలు చేసినప్పటికీ మన దేశం మాత్రం ఈ విషయంలో పెద్ద పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది! హింస, చట్టవ్యతిరేక హత్యలకు రాజకీయ వ్యవస్థలు ప్రోద్బలం కలిగించడమే ఇందుకు కారణం.

మాట్లాడుకున్నా ఒక రకంగా పోలీసు హింస అనేది దేశంలో వ్యవస్థీకృతంగా మారిందని వ్యాఖ్యానించింది.

భారత రాజ్యాంగం పోలీసు కస్టడీలో హింసాకాండను పూర్తిగా నిషేధించింది. నాగరిక సమాజంలో న్యాయం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలు ప్రధానం. హింస అనేది ఆటవిక సంస్కృతిని ప్రతిబింబించడమే కాదు, మానవ సంబంధాలను హరించివేస్తుంది. సమాజంలో అన్ని వర్గాలకు చట్టం సమరీతిలో వర్తించాలంటే పోలీసులు వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. హింసాకాండకు వ్యతిరేకంగా అనేక దేశాలు అంతర్జాతీయ ఒడంబడికలకు అనుగుణంగా చట్టాలు చేసినప్పటికీ మన దేశం మాత్రం ఈ విషయంలో పెద్ద పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. హింస, చట్టవ్యతిరేక హత్యలకు రాజకీయ వ్యవస్థలు ప్రోద్బలం కలిగించడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో మానవ హక్కుల సంఘాలు కూడా కోరలు లేని నామమాత్ర సంస్థలుగా మిగిలిపోయాయి.

1997లో డికె బసు వర్సెస్ ఆఫ్ స్టేట్ ఆఫ్ బెంగాల్ కేసులో సుప్రీంకోర్టు పోలీసు కస్టడీలో హింసాకాండ, మరణాలు పెరిగిపోతున్నాయని పేర్కొంది. పోలీసు కస్టడీలో హింసాకాండ మానవ హక్కులను పూర్తిగా హరించి వేసి మనిషి ఉనికికే ముప్పుగా మారిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.

దాదాపు 19 సంవత్సరాల క్రితం సుప్రీంకోర్టు పోలీసు సంస్కరణలపై సమగ్రమైన తీర్పు నిచ్చింది. కాని ఇంత వరకూ ఈ సంస్కరణలపై ఏ ప్రభుత్వమూ దృష్టి సారించ లేదు. ఈ సంస్కరణలు కావాలని సుప్రీంకోర్టులో పోరాడిన ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ ప్రకాశ్‌సింగ్ పోలీసులు, రాజకీయ నాయకులు పరస్పరం ఆధారపడడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. పోలీసులు లేకుండా రాజ్యం కోరలు లేనిదవుతుందని అన్నారు. రాజకీయ నాయకులు పోలీసులు తమ అడుగులకు మడుగులొత్తాలని, తమ రాజకీయ ఎజెండా అమలు చేయాలని అనుకుంటారని, పోలీసులపై రాజకీయనేతల పెత్తనం లేకుండా కొంత స్వతంత్రత ఏర్పర్చడం అవసరమని అన్నారు.

పోలీసుల శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతల నుంచి దర్యాప్తు బాధ్యతలను వేరు చేయాలని చెప్పిన సుప్రీంకోర్టు, వారు జవాబుదారీగా వ్యవహరించేందుకు అనేక ప్రతిపాదనలూ చేసింది. డీజీపీలను తాత్కాలికంగా నియమించకుండా యూపీఎస్‌సీ ద్వారా నియమించాలని తెలిపింది. డీజీపీలకు నిర్దిష్టంగా రెండేళ్ల కాలపరిమితిని విధించి రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, బదిలీలు, పోస్టింగులు పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డుకు అప్పగించాలని, పోలీసులపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్ర స్థాయిలో జాతీయ సెక్యూరిటీ కమిషన్ నియమించి నియామకాల బాధ్యతలు అప్పగించాలని తెలిపింది. ఈ సూచనలేవీ ప్రభుత్వాలు పాటించడం లేదని, అనేక రాష్ట్రాల్లో నిబంధలను ఉల్లంఘించి పోలీసులను నియమిస్తున్నారని, ఈ నియామకాల్లో తీవ్రమైన అవినీతి జరుగుతోందని ఇటీవల ప్రముఖ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, దుష్యంత్ దవే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తాము మే నెలలో పోలీసు సంస్కరణలపై దృష్టి సారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చెప్పారు. అప్పటికి ఆయన పదవీవిరమణ చేస్తారు. ఆ తర్వాత కొత్త సీజే ఈ తీర్పులపై దృష్టిసారిస్తారో కాలగర్భంలో కలిపివేస్తారో చెప్పలేం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో కనీసం మూడో స్థానానికి చేరాలనుకుంటున్న భారతదేశం ఆ దేశాల్లో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా న్యాయ, భద్రతా వ్యవస్థలను సంస్కరించుకోకపోతే అభివృద్ధికి అర్థం లేనట్లే.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

జానపదుల రారాజు రామరాజు

దక్షిణ భారతదేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటిలోను తొలుదొలుత శాస్త్రీయంగా, పండితులకు అంటరానిదైన జానపద సాహిత్యంపై పరిశోధనకు శ్రీకారం చుట్టింది డా.బిరుదురాజు రామరాజు. 'జానపద గేయసాహిత్యం' అనే అంశంపై 1952లో రిజిస్టర్ చేసి పరిశోధన ప్రారంభించి రవాణా సౌకర్యాలు లేని, రికార్డు చేసుకునే వసతులు లేని ఆ గడ్డు కాలంలో, క్షేత్రస్థాయిలో కాలికి బలపం కట్టుకొని తెలంగాణ ప్రాంతంలోని జిల్లాలు తిరిగారు. గ్రామీణుల చేత వేలాది పాటలు పాడించుకొని వాటిని శ్రద్ధగా రాసుకొని, తెలంగాణేతర తెలుగు ప్రాంతాలలో, ఆనాటి మద్రాసు ప్రాంతంలోని గ్రంథాలయాలలో విషయ సేకరణ చేసి, తాను రాసే సిద్ధాంత వ్యాసానికి, తానే స్వయంగా ఒక పద్ధతి ఏర్పాటు చేసుకొని దాన్ని రచించారు. ఆ సిద్ధాంత వ్యాసానికి 1955లోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుండి మొట్టమొదట పిహెచ్.డి పట్టా పొందిన మహా పరిశోధకుడు, పథనిర్దేశకుడు బిరుదురాజు రామరాజు. ఈవేళ విశ్వవిద్యాలయాలన్నింటిలోను జానపద సాహిత్యానికి సముచిత స్థానం లభించి వందలాదిమంది జానపద రంగంలోని పలు అంశాలు తీసుకొని పిహెచ్.డి సిద్ధాంత వ్యాసాలు రాసారంటే చాలావరకు అవి రామరాజు సిద్ధాంత వ్యాసాన్ని మూలంగా తీసుకొని రాసినవే.

డా. రామరాజు కేవలం జానపద సాహిత్యరంగానికే పరిమితమైన పండితుడు కాడు, ప్రాచీన తెలుగు సాహిత్యమంతా వారికి కరతలామలకం. తాను సేకరించిన వందలాది ప్రాచీన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలలో 15 గ్రంథాలను పరిష్కరించి వారు వెలుగులోకి తెచ్చారు. శ్రీనాథ మహాకవి అసమగ్ర కావ్యం 'శివరాత్రి మహత్యం'ను పూర్తిగా సేకరించి సంపూర్ణ గ్రంథాన్ని వెలువరించారు. డా. రామరాజు తెలుగు భాషలో ఎంత గొప్ప పరిశోధకుడో, పండితుడో సంస్కృత భాషలోనూ అదేస్థాయిలో పరిశోధన చేసారు, గ్రంథాలు ప్రచురించారు. ఇంగ్లీషు భాషలోను సమాన ప్రతిభగల డా. రామరాజు జాతీయ, అంతర్జాతీయ పరిశోధకుల కోసం, పాఠకుల నిమిత్తం ఇంగ్లీషులోను పలురచనలు చేసి పలు అంతర్జాతీయ విజ్ఞాన సర్వస్వాలకు తన రచనలు అందించి ఎన్నో అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రాలు సమర్పించి – జానపద సాహిత్యాన్ని జగమంతా మెచ్చేలా సహజంగా, సశాస్త్రీయంగా ప్రచారం చేసారు.

డా. బి. రామరాజు అనగానే జానపద సాహిత్యం, ప్రాచీన సంస్కృతాంధ్ర సాహిత్యాలు, గ్రంథపరిష్కరణలు, తాళపత్ర గ్రంథాలు, తెలుగునేలలో 'మరుగుపడిన మాణిక్యాలు', 'చరిత్రకెక్కని చరితార్థులు', 'సాహిత్యోద్ధారకులు', 'సంస్కృత సాహిత్యానికి తెలుగువారి సేవ' ఇత్యాది అంశాలలో – విశేషమైన, విశిష్టమైన సేవ చేసిన ఒక మహాపరిశోధకుడు కళ్ళముందు కనబడతాడు. ఇంతటి మహామహోపాధ్యాయుడి, జాతీయ ఆచార్యుడి శత జయంతి నేడు. ఈ మహానుభావుడు పదిహేనేళ్ళ క్రితం వరకు మనమధ్యలోనే ఉండి, 'ఆంధ్రయోగులు'పై ఇంతవరకు జరగని పరిశోధనలు చేసి, 317మంది యోగుల విశేష జీవిత వివరాలు సేకరించి, ఏడు గొలుసు గ్రంథాలు వెలువరించిన పట్టువిడువని పండిత శ్రేష్ఠుడు. 2011 ఫిబ్రవరి 8న తన 85వ ఏట కన్ను మూసే దాకా నిరంతరం కృషిచేసారు.

కొందరేమో శిష్యవర్గం ప్రచారంతో, మరికొందరేమో అభిమానుల ఆదరంతో, ఇంకా కొందరేమో అధికార ప్రాభవంతో గొప్పవారు అవుతున్న రోజులలో కేవలం తన పరిశోధనల వలన, వాటి ఫలితమైన రచనల వల్లనే గుర్తింపు పొందారు ఆయన. తెలుగు ప్రొఫెసర్‌గా పదవీవిరమణ చేసిన పుష్కర కాలానికి గాని, డా. రామరాజు లాగా జాతీయ ఆచార్యుడిగా అవకాశం రాదు. తనకు గాడ్‌ఫాదర్ లేడు కాబట్టే, కేవలం గాడ్ మీదనే ఆధారపడినందున అంత ఆలస్యం జరిగిందేమో అనే వారు రామరాజు మాస్టారు.

రామరాజు తొలినాళ్ళలో చక్కని కవి. వీరిలోని పరిశోధన పాటవాన్ని గమనించిన సుప్రసిద్ధ సంపాదకులు ప్రతాపరెడ్డి సలహా మేరకు కవిత్వం రాయడం మానివేసి జీవితం సమస్తం పరిశోధనా రంగానికే అంకితం చేసిన నిత్యకృషీవలుడు. యం.ఏ.లో ఉన్నప్పుడు, అప్పుడు బి.ఏ. చదువుతున్న సి.నారాయణరెడ్డితో కలిసి 'రామనారాయణకవులు'గా రామరాజు జంటకవిత్వం రాసారు. సినారె స్థాయిలో కవిత్వం చెప్పగలిగిన రామరాజు కవిత్వం జోలికి పోకుండా తన జీవితాన్ని పరిశోధనకు, విమర్శకు అంకితం చేయడం వెనుక ఎంత పట్టుదల, పరిశ్రమ ఉందో వేరుగా చెప్పనవసరంలేదు.

రామరాజు దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడుగా సేవలందించి ఎంతోమందిని ఉత్తమ ఆచార్యులుగా తీర్చిదిద్దారు. పేర్వారం జగన్నాథం, రవ్వా శ్రీహరి లాంటి వీరి శిష్యులు వైస్ ఛాన్సలర్లు అయ్యారు. ఆచార్య రామకోటి శాస్త్రి, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య యం. వీరభద్రశాస్త్రి, వై. రఘుమన్న లాంటి ఎందరో వారి శిష్యులు, ప్రశిష్యులు వివిధ విశ్వవిద్యాలయాల్లో తెలుగుశాఖలో కీలకస్థానాల్లో ఉన్నా ఎందుచేతనోగానీ ఒకే ఒక్క విదుషీమణి శ్రీమతి కంచి విజయలక్ష్మి మాత్రమే 'డా.రామరాజు జీవితం – రచనలు' అంశంపై రెండున్నర దశాబ్దాల క్రితం పరిశోధన చేసారు.



ఈవేళ విశ్వవిద్యాలయాలన్నింటిలోను జానపద సాహిత్యానికి సముచితస్థానం లభించి వందలాదిమంది ఆ రంగంలోని పలు అంశాలు తీసుకొని సిద్ధాంత వ్యాసాలు రూపొందించారంటే చాలావరకు అవి రామరాజు సిద్ధాంత వ్యాసాన్ని మూలంగా తీసుకొన్నవే.

ఊరూ పేరూ తెలియని ఎందరో అనామకులపై పరిశోధనలు చేయించే విశ్వవిద్యాలయ ఆచార్యులకు డా. రామరాజు పరిశీలించి, పరిష్కరించి వెలుగులోకి తెచ్చిన సంస్కృతాంధ్ర గ్రంథాలయాలపై వేరుగా పరిశోధనలు చేయించవచ్చునని, తాళపత్ర గ్రంథాలను ప్రపంచానికి తెలియజేసిన వారి వ్యాసావళిపైనే ప్రత్యేక పరిశోధన చేయించవచ్చని తెలియకపోదు. సంస్కృత భాషాసాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవల గురించి, ఇంకా వీరు ఇంగ్లీషులో రచించిన పలు పరిశోధన వ్యాసాలపైన పరిశోధన చేయించవచ్చు. అంత దాకా ఎందుకు 'ఆంధ్రయోగులు' గొలుసు గ్రంథాలపై పరిశోధన చేయించవచ్చు. జరిగిన ఆలస్యం ఏలాగు జరిగిపోయింది. బిరుదురాజు రామరాజు శతజయంతి జరుగుతున్న ఈ సందర్భంలోనైన ఈ అంశాలలో కొన్నింటిపైనైనా పరిశోధనకు తెలుగు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలు శ్రీకారం చుడితే సంతోషం.

■ టి. ఉడయవర్లు

(నేడు బిరుదురాజు రామరాజు శతజయంతి. కేంద్ర సాహిత్య అకాడమీ– శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో శతజయంతి సభ)


'బిరుదురాజు' శత జయంతి సదస్సు

తెలుగు జానపద విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసిన ఆచార్య బిరుదురాజు రామరాజు పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా సుప్రసిద్ధుడు. ఆయన శతజయంతి సందర్భంగా 'ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సదస్సు'ను తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఏప్రిల్ 16న ఖమ్మం ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నది. ఇందులో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, ఆచార్య బన్న అయిలయ్య, డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, డా. యాకూబ్, డా. బి. రాములు, కపిల భారతి, డా. మంథని శంకర్, డా. వాహెద్, డా. మొహ్మద్ జాకీరుల్లా, డా. సీతారాం తదితరులు పాల్గొంటారు. ఈ సదస్సులో పరిశోధనా పత్రాల సమర్పణ, రామరాజు సాహిత్యసేవపై ప్రసంగాలు ఉంటాయి.

– డా. పి. రవికుమార్
సదస్సు కన్వీనర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com





'భూ భారతి'పై ఎన్నెన్నో ఆశలు

పైలెట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లా వెంకటాపూర్ ఎంపిక

- గ్రామాల్లోకి రెవెన్యూ అధికారులు
- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కార్యాచరణ
- మే 31లోపు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటాపూర్/ ములుగు/ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం భూ భారతిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఇప్పటికైనా పరిష్కారమవుతాయన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు. అయితే భూభారతి చట్టం అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలను ఎంపిక చేయగా.. ఆ జాబితాలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ములుగు జిల్లా వెంకటాపూర్‌కు స్థానం దక్కింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ధరణితో అనేక అవస్థలు ఎదుర్కొన్న రైతులు కొత్తచట్టంతో తమ భూ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలన్నీ కొత్త చట్టంతో రూపుమాపు తాయని భావిస్తున్నారు. ప్రజలు తమ భూముల స్థితిని ధ్రువీకరించడాని కి, కొత్త పోర్టల్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధ్యయనం చేయడానికి, రైతు లు లేవనెత్తిన ఫిర్యాదులను పరిష్కరించడానికి భూభారతి చట్టం ఉప యోగపడుతుందని తెలుస్తోంది.

గ్రామాలకు వెళ్లి ఫిర్యాదుల స్వీకరణ..

రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించనున్నారు. ధరణిలోని లోపాల వల్ల ప్రభావితమైన ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అతర్వాత సంబంధిత అధికారులు ఫిర్యాదులు, విజ్ఞాపన పత్రాల ఆధారంగా క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సక్రమంగా ఉంటే భూభారతి

మిగతా 7వ పేజీలో...

చట్టం పరిధిలోకి వచ్చే భూ విస్తీర్ణం

వెంకటాపూర్ మండలంలో 25 గ్రామపంచాయతీలున్నాయి. పది రెవెన్యూ గ్రామాల్లో 13,533 మంది రైతులు భూభారతిని సద్వినియోగం చేసుకోనున్నారు. మండలంలోని 74,667ఎకరాల విస్తీర్ణం గల భూమి భూభారతి చట్టం పరిధిలోకి రానుంది.





ఉద్యమ బంధంతో పురుడు పోసుకున్న బీఆర్‌ఎస్‌కు కీలకమైన అనుబంధ సంఘాలు క్రమంగా దూరమవుతున్నాయి. అధికారంలో ఉన్న పదేళ్లు తమను పట్టించుకోలేదన్న కారణంతో ఒక్కొక్కటిగా గులాబీకి బైబై చెబుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అప్పటి టీఆర్‌ఎస్ అడుగులో అడుగై నడిచిన ఆర్టీసీ, విద్యుత్, సింగరేణిలో కార్మిక సంఘాలు ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు దూరం జరిగాయి. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులు, పట్టభద్రులు కూడా పక్కచూపులు చూశారనే టాక్ ఉంది. బీఆర్‌ఎస్ 25ఏళ్ల వేడుకలను ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో పార్టీకి దూరమైన అనుబంధ సంఘాలను బీఆర్‌ఎస్ మళ్లీ చేరదీస్తుందా? పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందా? అనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

'అనుబంధాలు' కలిసొచ్చేనా?

బీఆర్‌ఎస్‌కు దూరమైన కార్మిక, ఉద్యోగ సంఘాలు

- గతంలోనే గుడ్‌బై చెప్పిన సింగరేణి సంఘం టీబీజీకేఎస్, విద్యుత్ శాఖలోని టీఆర్‌వీకేఎస్
- ఎన్నికలకు ముందే తెగదెంపులు చేసుకున్న టీఎంయూ
- ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంతో మరింత ప్రభావం
- నాటి ప్రత్యేక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన సంఘాలు
- రజతోత్సవాల వేళ వాటిని దగ్గరకు చేర్చుకునే ప్రణాళిక లేదనే చర్చ

కార్మిక శక్తి, ఉద్యోగుల బలంతో టీఆర్‌ఎస్ తెలంగాణలో బలమైన పార్టీగా ఆవిర్భవించింది. ఇక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సింగరేణి ఏరియా విస్తరించి ఉండగా.. వేలాది మంది కార్మికులు ఆ సంస్థలో పని చేస్తున్నారు. 2003 జనవరి 27న నాటి టీఆర్‌ఎస్‌కు అనుబంధంగా గోదావరిఖనిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆవిర్భవించింది. ఈ సంఘానికి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగారు. 2012, 2017లో విజయం సాధించి రెండు పర్యాయాలుగా 11ఏళ్లకుపైగా సింగరేణి గుర్తింపు సంఘంగా కొనసాగింది. అయితే 2023 డిసెంబరు 27వ తేదీన జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం వెనుకడుగు వేసింది. పోటీ చేయాలంటూ టీబీజీకేఎస్ నేతలు ఎంత ఒత్తిడి తెచ్చినా గులాబీ నాయకత్వం పోటీకి ససేమిరా అనడంతో కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్టీ మద్దతు లేకున్నా బరిలో నిలిచినప్పటికి కొన్ని చోట్ల గట్టి పోటీ ఇచ్చింది. దీంతో బీఆర్‌ఎస్ వైఖరిపై టీబీజీకేఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గులాబీ జెండాతో ఉన్న 21ఏళ్ల అనుబంధాన్ని 2024 మార్చి 23న పెద్దపల్లిలో జరిగిన సభతో తెగదెంపులు చేసుకుంది. ఆ తరువాత కొత్త కమిటీలను నిర్మాణం చేసుకుని టీబీజీకేఎస్ స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. ఇదే తరహాలో విద్యుత్ రంగంలో కీలకంగా వ్యహరించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) కూడా బీఆర్‌ఎస్‌తో తెగదెంపులు చేసుకుంది.

2004 నుంచి బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న ఈ సంఘానికి కూడా ఎమ్మెల్సీ కవిత గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగారు. అయితే గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదంటూ ఆ సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గతేడాది జూలై 3న బీఆర్‌ఎస్‌తో ఉన్న తమకున్న అనుబంధాన్ని రద్దు చేసుకుంటున్నట్లుగా ప్రకటించారు. ఇక తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికుల కీలకమైందిగా చెబుతారు. తెలంగాణ ఉద్యమానికి అండగా తెలంగాణ మజ్దూర్ సంఘం (టీఎంయూ) ఏర్పడింది. హరీశ్‌రావు టీఎంయూ గౌరవాధ్యక్షుడిగా కొనసాగారు. 2019లో ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మెబాట పట్టారు. సుమారు 38మంది ఉద్యోగులు ఈ ఉద్యమంలో మృతి చెందారు. అయినప్పటికి ప్రభుత్వం దిగిరాలేదు. చివరికి కార్మిక సంఘాలే దిగివచ్చాయి. ప్రగతిభవన్‌లో అప్పటి సీఎం కేసీఆర్ కొందరు కార్మికులను పిలిచి భోజనం పెట్టించారు. ఇక యూనియన్ల గోల వద్దని చెప్పడంతో ఆర్టీసీలో బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా కొనసాగిన టీఎంయూతో పాటు అనేక కార్మిక సంఘాల ఉనికి ప్రశ్నార్థకమైంది. చివరకు గత అసెంబ్లీ ఎన్నికల్లో

మిగతా 7వ పేజీలో...



ఉద్యమ శక్తులన్నీ ఏకమవుతున్నాయి..

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు

ఉద్యమం సమయంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన కార్మిక సంఘాలు కొన్ని కారణాలతో దూరమయ్యింది వాస్తవమే. కాంగ్రెస్ పాలన, ప్రజలను హామీల పేరుతో చేసిన మోసాన్ని గమనించిన సంఘాలు.. తిరిగి కేసీఆర్‌తో కలిసి నడిచి ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే దూరమైన కార్మిక సంఘాలను దగ్గరికి చేర్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాం. పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలన్ని కూడా కేసీఆర్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజల అకాంక్ష మేరకు కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయటమే లక్ష్యంగా ఉద్యమ శక్తులన్నీ ఏకమవుతున్నాయి.

మాదకద్రవ్యాల రవాణా ముఠా గుట్టురట్టు

గంజాయి, హాశీష్ ఆయిల్‌తో పట్టుబడ్డ ముగ్గురు

10 కిలోల ఎండు గంజాయి, 2కిలోల హాశీష్ ఆయిల్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా



నిందితులను అరెస్టు చేసి చూపుతున్న డీసీపీ షేక్ సలీమా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, హాశీష్ ఆయిల్‌ను రవాణా చేస్తూ పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. డీసీపీ కథనం ప్రకారం.. హనుమకొండ పీఎస్ పరిధిలోని రెడ్డికాలనీలో బుధవారం ఎస్సై పరశురాములు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుధానగర్‌కు చెందిన కోటగిరి సాయి, ములుగు జిల్లా అన్నంపెల్లి తండాకు చెందిన లావుడ్య రవీందర్, తొర్రూరు మండలం అమర్‌సింగ్ తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్ ఎస్సైని చూసి ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

2023లో కోటగిరి సాయి తన స్నేహితుడు వరుణ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లికి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా డొంకరాయి పోలీసులకు పట్టుబడి రాజమండ్రి జైలుకు వెళ్లాడు. జైలులో ములుగు జిల్లాకు చెందిన లావుడ్య రవీందర్ పరిచయం కాగా, తాను గంజాయి విక్రయిస్తుంటానని సాయికి తన ఫోన్‌నెంబర్ ఇచ్చాడు. ఇదిలా వుండగా, హనుమకొండ పోలీసు స్టేషన్‌లో గతంలో సాయిపై హత్యాయత్నం కేసు నమోదు కాగా, ఖమ్మం సెంట్రల్ జైలుకు వెళ్లిన క్రమంలో హరి, కబీర్‌సింగ్ పరిచయమయ్యారు. అక్కడ సాయి నెంబర్ తీసుకున్నారు. మూడు వారాల కిందట సాయికి హరి ఫోన్ చేసి తన దగ్గర గంజాయి నుంచి తీసిన హాశీష్ ఆయిల్ ఉందని, దీనిని సిగరెట్‌కు పూసి తాగితే కిక్కు వస్తుందని, కిలోకు రూ.12 లక్షల 50 వేల ధర ఉంటుందని చెప్పి.. తన అన్న రామూర్తితో వరంగల్ రైల్వేస్టేషన్‌కు పంపించి సాయికి అప్పగించగా ఇంట్లో దాచిపెట్టాడు.

అలాగే లావుడ్య రవీందర్, గుగులోత్ హరిసింగ్‌లు 12 కిలోల ఎండు గంజాయిని సాయికి అప్పగించగా, దానిలో 2 కిలోల గంజాయిని కుశాల్, జైసింహ హరీష్‌లకు విక్రయించి మిగతాది ఇంట్లో దాచిపెట్టాడు. కొద్ది రోజుల తర్వాత లావుడ్య రవీందర్‌కు సాయి ఫోన్ చేసి తన దగ్గర హాశీష్ ఆయిల్ ఉందని, ఎవరికైనా విక్రయిద్దామని చెప్పగా ఇంటికొచ్చిన రవీందర్, గుగులోత్ హరిసింగ్‌కు స్టీల్ డబ్బాలో ఆయిల్ పోసి ఇవ్వగా ఆటోలో పెట్టుకున్నారు. తన దగ్గర ఉన్న 10కిలోల ఎండు గంజాయిని సాయి రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిల్‌పై పెట్టుకొని హైదరాబాద్‌కు రవాణా చేయడానికి ప్రయత్నిస్తుండగా ఎస్సైకి పట్టుబడ్డారు. నిందితుల నుంచి 10 కిలోల ఎండు గంజాయితో పాటు రూ.25లక్షల విలువ చేసే 2 కిలోల హాశీష్ ఆయిల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సైకిల్ మోటారు, బజాజ్ ఆటోను సీజ్ చేశామని డీసీపీ చెప్పారు. కాగా, ఈ కేసులో కబీర్ సింగ్, హరి, రామూర్తి, కుశాల్, హరీష్, జైసింహ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని జనం ఛీకొడుతున్నారు

- రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ పాలన
- మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్



ఎల్కతుర్తిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ప్రజలు ఛీకొడుతున్నారని మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఈనెల 27న ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవిందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశ చరిత్రలో కేవలం 15 నెలల్లో ప్రజల్లో అభాసుపాలైన ఏకైక ప్రభుత్వం రేవంత్ సర్కార్ అని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చారని ఘనుడని కొనియాడారు. ఉద్యమ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధిస్తే మాయలోడి చేతిలో తెలంగాణ ప్రస్తుతం బందీ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయన్నారు. లబ్ధిపొందిన ప్రతీ కుటుంబం కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్‌కు ఉన్న తపన మరే నాయకుడికి ఉండదన్నారు. 25 ఏళ్లు నిండిన పార్టీగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వేడుకలకు సిద్ధమైందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయని వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ సభా వేదికపై కేసీఆర్ సూచనల మేరకు 500 మంది ప్రముఖులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణంతో పాటు పార్కింగ్ కోసం ఇప్పటికే 1200 ఎకరాలు సేకరించామన్నారు. వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్‌ల నుంచి వచ్చే వాహనాలకు ఆయా రూట్లలో పార్కింగ్ స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మహేందర్, కడారి రాజు, స్వామి, నగేష్, రాజ్‌కుమార్, స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.



- 42డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- ఉక్కపోతతో జనం విలవిల
- ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో ముగ్గురి మృతి
- మానుకోట జిల్లాలో ఇద్దరు కన్నుమూత
- కాళేశ్వరాలయంలో పెద్దపల్లి జిల్లా వృద్ధుడు

రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత

7

భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి..

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్లతో సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం జిల్లాలో అమలులోకి వచ్చిందని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం భూభారతి చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలపై జిల్లాలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్‌లు, రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టంలో కల్పించిన హక్కులు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్, సాదాబైనామాల క్రమబద్ధీకరణ, అప్పీల్ వ్యవస్థ, అధికారాలు, న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డులు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరకాల, హనుమకొండ ఆర్డీవోలు వివరించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భూభారతి చట్టం గెజిట్ ప్రతులు, జీవో నెంబర్ పత్రాలు ప్రతి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రతీ మండలంలో అమలులోకి వచ్చిన భూభారతి చట్టానికి సంబంధించిన అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాలలో నిర్వహించే సదస్సులకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు భూమి హక్కులకు సంబంధించి అవగాహన ఉన్న వ్యక్తులను, మీ సేవా కేంద్రాల ఆపరేటర్లను సదస్సులకు ఆహ్వానించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. మొదటి దశలో సొంత స్థలం ఉన్న అత్యంత నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి మండలంలోని ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మొదలైందని, మిగిలిన గ్రామాలలో గృహ నిర్మాణ లబ్ధిదారుల పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ద్వారా వచ్చిన లబ్ధిదారుల ప్రతిపాదనలు క్షుణ్ణంగా పరిశీలిచి తదుపరి మంజూరుకు ప్రతిపాదిస్తారని అన్నారు. మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.



పీపీలతో పాటు పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

అధికారులకు డీసీపీ సత్కారం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ పీఎస్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచారం కేసులో పోక్సో నిందితుడికి జీవితఖైదు పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో పాటు పోలీస్ అధికారులను ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ మంగళవారం తన కార్యాలయంలో సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవికిరణ్, మర్రి వాసుదేవారెడ్డి, భరోసా లీగల్ అడ్వైజర్ నీరజ, మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుగొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కానిస్టేబుళ్లు విజేందర్, శ్రావణ్, యుగేందర్ ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెంది ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన బికాష్ దెబనాథ్ (33) కాజీపేట ప్రగతినగర్‌లో కొంతకాలంగా ఉంటూ ఓ టెంట్‌హౌస్‌లో పని చేస్తున్నాడు. ఇతడికి భార్యతో గొడవల కారణంగా ఆమె అతడి వద్దనుంచి కొన్ని నెలల కిందట వెళ్లి పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం టెంట్‌హౌస్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి స్నేహితుడు కౌషిక్‌లావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

హెడ్ కానిస్టేబుల్‌కు భారత్ సేవారత్న అవార్డు



మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చక్రవర్తి నుంచి అవార్డు అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్

మడికొండ, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న గుండబత్తిన జయరాజ్‌ను మరో అరుదైన అవార్డు వరించింది. జయరాజ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన మనం ఫౌండేషన్ సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో జయరాజ్‌ను భారత్ సేవారత్న నేషనల్ అవార్డుతో సత్కరించింది. మనం ఫౌండేషన్ వ్యవస్థాకులు డాక్టర్ కె.చక్రవర్తి జయరాజ్‌ను శాలువాతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జయరాజ్‌ను పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

యథావిధిగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల సెమిస్టర్ పరీక్షలన్నీ షెడ్యూల్ మేరకు ఏప్రిల్ 21 నుంచి యథావిధిగా నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ నాన్ ప్రొఫెషనల్ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించామని వెల్లడించారు. వర్సిటీకి చెందిన ఫీజులు చెల్లించిన కళాశాల విద్యార్థులకే పరీక్షల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్ https://kakatiya.ac.in/లో సంప్రదించాలని కోరారు.

19 నుంచి కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల నిరవధిక సమ్మె



కేయూలో నిరసన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు



సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన కొనసాగుతోంది. మంగళవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు యథావిధిగా నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిసి సమ్మె నోటీస్ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేసిన తర్వాతనే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని అన్నారు. 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈనెల 16, 17వ తేదీల్లో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతామని పేర్కొన్నారు. ధర్నాకు అన్ని పార్టీల నేతలను ఆహ్వానిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, కనుకయ్య, జూల సత్య, సాదు రాజేశ్, సతీశ్, ఫిరోజ్, ఆశీర్వాదం, సంకినేని వెంకట్, సూర్యం, కృష్ణయ్య, నాగయ్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, వినీత, శ్రీదేవి, వీణ, సునిత, సుచరిత పాల్, సుజాత, శ్రీలత, సంగీత్‌కుమార్, భాగ్య, ఉషాకిరణ్, వాణిశ్రీ, ప్రసాద్ సదాశివ, తూర్పాటి వెంకటేశ్, సాహితీ, చందూలాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈనెల 17న తలపెట్టిన చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు కేయూ క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన పార్టుటైమ్ అధ్యాపకుల సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జీవో 21ని రద్దుచేసి, పార్టుటైమ్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, అడ్వైజర్ ఎంకే సుమంత్, ఓ.మోహన్, శ్రీకాంత్ యాదవ్, చారి, మమత, రజిత, విష్ణు, రవి, రామజ్యోతి, వాణిశ్రీ, రజనికుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి..

రాష్ట్రవ్యాప్తంగా 12 వర్సిటీల్లో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యల పరిష్కరించాలని ఏప్రిల్ 17న చేపట్టిన చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. మంగళవారం కేయూ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు వై.రాంబాబు, నరేంద్ర నాయక్, తిరుణహరి శేషు, వినోదలు చలో సెక్రటేరియట్ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తమకు టైంస్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 21లో మార్పులు చేయాలన్నారు. తమ సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో దేవోజీనాయక్, సురేశ్, రమేశ్, రాజన్న, శ్రీధర్, ప్రభాకర్, భాగ్యమ్మ, శంకర్, కిరణ్, సంజీవ్, విజయ్‌కుమార్, జ్యోత్స్న, వాణిదేవి, ప్రశాంత్, నవీన్, మౌనిక, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను ప్రేమించమని, లేదంటే చంపుతానని బెదిరించిన కేసులో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి మంగళవారం తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి నష్టపరిహారం రూ.25వేలు చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. రోజూ స్కూల్ బస్సులో వస్తున్న మైనర్ బాలికను ప్రేమించమని ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ పసునూరి రఘు వేధిస్తున్నాడు. 2023 జనవరి 19న పాఠశాలకు వెళ్లకుండా మైనర్ బాలిక ఏడుస్తూ తన ఇంట్లో ఉండగా తన తండ్రి విషయం తెలుసుకోగా తనను బస్సు డ్రైవర్ లైంగికంగా వేధిస్తున్నాడని తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయవాది తీర్పు నిచ్చారు. కోర్టు పీసీ వి.రాజేష్, లైజన్ అధికారి పరమేశ్వరి సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎస్సై నర్సింహరావు వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

నీతి అయోగ్‌లో గంగారం ప్రథమ స్థానం

మానుకోట కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గంగారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన మండలాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్రప్రభుత్వం నీతి అయోగ్‌లో ఎంపిక చేసిన గంగారం మండలానికి ప్రగతిలో ప్రథమ స్థానం దక్కిందని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం డెల్టా ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా నుంచి గంగారం ఎంపిక కావటంపట్ల రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క మండల అధికారులను అభినందించారు. సామాజిక ఫలితాలు అభివృద్ధిని పెంపొందించటంలో జిల్లా అధికారుల తో మమన్వయమైన మండలంలోని శాఖల అధికా రులు కలిసి పనిచేయటంతోనే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు.



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో సెక్రెటరీ వెంకయ్య, శేషాల కుమార్, ఇతర పీడీలు

హోరాహోరీగా మహిళల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున వర్సిటీలో జరిగే ఆల్ ఇండియా మహిళ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక ప్రక్రియను వర్సిటీ కేయూ స్పోర్ట్స్ బోర్డు నేతృత్వంలో చేపట్టారు. కేయూ క్రీడామైదానంలో ఏప్రిల్ 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఎంపిక పోటీలకు వర్సిటీ పరిధిలోని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన 70 కళాశాలల నుంచి మహిళ క్రీడాకారులు సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు హాజరయ్యారు. పోటీలకు హాజరైన మహిళ క్రీడాకారులు హోరాహోరీగా ఎంపిక ప్రక్రియలో పాల్గొని తమ ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో అత్యున్నత ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆల్ ఇండియా వర్సిటీ మహిళ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక చేసి ప్రకటిస్తారు.

ఈ సందర్భంగా పోటీలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, కేయూ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శేషాల కుమార్ హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. క్రీడాకారుల సాఫ్ట్‌బాల్ క్రీడలో అత్యున్నత ప్రతిభ చూపి వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ఎంపికల్లో ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ సునిల్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చాక్లెట్ కోసం దుకాణానికి వెళ్తుండగా..

టిప్పర్ ఢీకొని విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన అనిల్ (ఫైల్)

చెన్నారావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుకాణంలో చాక్‌లెట్ కొనుక్కోవడానికి వెళ్తున్న విద్యార్థిని టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మండలంలోని పుల్లయ్యబోడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన భూక్య జ్యోతి- వెంకన్న దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె నాగేశ్వరి గుడూరులోని జ్యోతిబా పూలే గురుకులంలో 5వ తరగతి చదువుతోంది. కుమారుడు అనిల్ (8) మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అయోధ్యపురంలోని ప్రభుత్వ పాఠశాలలలో 2వ తరగతి చదువుతున్నాడు. అనిల్ షాప్‌నకు వెళ్తుండగా గూడూరు నుంచి నెక్కొండకు వెళ్తున్న టిప్పర్ అనిల్ మీదుగా దూసుకెళ్లడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని తండావాసులు డ్రైవర్‌ను చితకబాదారు. లారీ అద్దాలను ధ్వంసం చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజేష్‌రెడ్డి, నెక్కొండ ఎస్సై మహేందర్ సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్ డ్రైవర్‌ను 108లో చికిత్స కోసం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

ఓపెన్ స్కూల్ కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

విద్యార్థుల పరీక్షల ఫీజులు కాజేశాడని డైరెక్టరేట్‌కు ఫిర్యాదు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఈవో కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ అవినాష్‌ను తొలగించాలని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన రూ.32వేల పరీక్ష ఫీజును కంప్యూటర్ ఆపరేటర్‌గా అవినాష్ తన సొంతానికి వాడుకున్నాడు. పరీక్ష ఫీజు చెల్లించకపోవడంతో విషయం తెలుసుకున్న సదరు అధ్యయన కేంద్రం నిర్వాహకులు హైదరాబాద్‌లోని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరికి నేరుగా ఫిర్యాదు చేశారు. దీంతో ఫీజు చెల్లించకుండా అక్రమానికి పాల్పడ్డ అవినాష్‌ను విధుల నుంచి వెంటనే తొలగించాల్సిందిగా హనుమకొండ డీఈవో వాసంతికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

వృద్ధుడి బలవన్మరణం కేసులో కొడుకు, కోడలికి రిమాండ్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడారిగూడెం గ్రామంలో వృద్ధుడు నాంపెల్లి మల్లేషం బలవన్మరణం కేసులో ఆస్తి కోసం వేధించిన ఆయన కొడుకు, కోడలిని పోలీసులు రిమాండ్ చేశారు. మంగళవారం పోలీసులు గ్రామంలో మరోసారి విచారణ చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు స్థానికులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధుడి మరణానికి కారకులైన కొడుకు, కోడలు నాంపెల్లి కోటేశ్వర్, ఎలేంద్రను వరంగల్ జిల్లా కోర్టులోని రెండో అదనపు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు తెలుస్తోంది. వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



నర్సింగ్ హాస్టళ్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

నర్సింగ్ హాస్టళ్లో డ్రెయినేజీ కంపు

అవస్థల్లో విద్యార్థినులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి అనుబంధంగా ఉన్న నర్సింగ్ హాస్టల్‌లో డ్రెయినేజీ కంపు కొడుతోంది. హాస్టల్‌లోని మరుగుదొడ్లకు సంబంధించి అవుట్‌లెట్ పైపు పగిలిపోవడం వల్ల వ్యర్థాలన్నీ హాస్టల్ ఆవరణలో నిండిపోయాయి. మూడు నెలలుగా నిండిపోవడంతో నర్సింగ్ హాస్టల్‌లోని గదులన్నీ కంపు కొడుతున్నాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ హాస్టల్‌ను ఆనుకొని ఉన్న ఉప్పలవాడవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంజీఎం నుంచి పాఠక్ మహేల మీదుగా వెళ్లే వాహనదారులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కాలనీవాసులు కూడా ఎంజీఎం అధికారులకు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ విద్యార్థులు కూడా తమ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు డ్రెయినేజీ పైపులకు మరమ్మతులు చేసి వ్యర్థాలు సెప్టిక్ ట్యాంక్‌లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరుగుతున్న పత్తి ధర

మార్కెట్‌లో క్వింటా రూ.7450

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మంగళవారం పత్తి ధర క్వింటాకు రూ.7450లు పలికింది. గత మార్చి నెలలో రూ.7000లకు కొంత అటుఇటుగా పలికింది. ప్రస్తుతం నెమ్మదిగా ధర పెరుగుతుండడంతో రైతుల్లో ఆశ మొదలైంది. తమ వద్ద ఉన్న పత్తిని మరిన్ని రోజులయ్యాక, ధర పెరిగాక అమ్ముకుందామనుకుంటున్నారు. దీంతో మార్కెట్లో పత్తి అమ్మకాలు తగ్గిపో



విద్యార్థిని తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందిస్తున్న రాజ్‌కుమార్

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం

గీసుగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని నమిండ్ల సుష్మాస్వరాజ్‌కు నారాయణపేట మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. మొదటి సంవత్సరం చదువుతున్న ఆమెకు కళాశాల ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతోంది. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.50వేలను పంపించగా మంగళవారం స్థానిక నాయకుడు వీరగోని రాజ్‌కుమార్ అందజేశారు. సుష్మాస్వరాజ్ ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు మొత్తం ఖర్చును కిశోర్‌రెడ్డి అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, దౌడు బాబు, డోలి చిన్న నాయకులు మంద రమేష్, మర్రి రాజలింగం, వీరభద్రం, మహేందర్, భాస్కర్, రవి, బస్వరాజ్యం, శ్రీకాంత్, యుగేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊకల్ నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు



నాగేంద్రుడికి పూజలు చేస్తున్న శ్రీరామచందర్ తదితరులు

గీసుగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వసంత మాస పూజలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి పుట్టలో పాలు పోసి, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వరంగల్ జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) అధ్యక్షుడు శ్రీరామచందర్, జర్నలిస్టులు పిన్న శివకుమార్, కొడ్ల రవి, కార్యవర్గ సభ్యులు పులి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, రాజేందర్ భక్తులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7450	5300
మక్కలు (బిల్టీ రకం)	2290	1521
కందులు	6422	3022
పెసళ్లు	7301	3022
పల్లికాయ (సూక)	6800	5200
పల్లికాయ (పచ్చిది)	3950	4575
పసుపు (కాడి)	13909	10534
పసుపు (గోల)	13126	9700
తేజ మిర్చి	13100	9500
వండర్‌హాట్	13400	10000
యూఎస్341	11500	9000
దీపిక	12000	10000
దేశీ	26000	18000
సింగిల్ పట్టి	21000	20000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం



హనుమకొండ గోపాల్‌పూర్ శివారులో పశువులను మేపేందుకు వచ్చిన మహిళ గొడుగును ఆశ్రయించిన దృశ్యం

భానుడి భగభగ

రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత

- 42డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- ఉక్కపోతతో జనం విలవిల
- ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో ముగ్గురి మృతి

హనుమకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగభగ మంటున్నాడు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మంగళవారం గరిష్ఠంగా 42.2డిగ్రీలు, కనిష్ఠంగా 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. జనం వడగాలులు, ఉక్కపోతకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడదెబ్బ మరణాలు మొదలయ్యాయి. మంగళవారం ఒక్క రోజే ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా మరొకరు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన వారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలం గుడితండాలో వ్యవసాయ కూలీకి వెళ్లిన బాదంపూడి సుశీల (57), కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామంలో బాసాని మల్లమ్మ (65) వడదెబ్బకు గురై మృతి చెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం వద్ద వృద్ధురాలు కాంపెల్లి కనకమ్మ (70) వడదెబ్బకు గురై చనిపోయింది. అలాగే ఉమ్మడి జిల్లాలో కొందరు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలైనట్టు తెలుస్తోంది. వడదెబ్బతో అస్వస్థతకు లోనైవారికి తక్షణం వైద్యసహాయం అందించేందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా పడకలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. వడదెబ్బ బాధితుల కోసం అన్ని పీహెచ్‌సీల్లో ఆర్‌ఎస్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు.

ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 42డిగ్రీలు దాటింది. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో జిల్లాలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో 41.7డిగ్రీలు, జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కూనూరులో 41.3 డిగ్రీలు, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గొర్రెకుంటలో 41.22 డిగ్రీలు, హనుమకొండ జిల్లా కాజీపేటలో 40.8 డిగ్రీలు, ములుగు జిల్లా మల్లంపల్లిలో 40.8 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ సుర్రుమంటుండగా మధ్యాహ్నం రోడ్లపైకి వచ్చేందుకు జనం జంకుతున్నారు. దీంతో చిరువ్యాపారాలు తగ్గిపోయాయి. ప్రజలు కూడా ఎండవేడిమి నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. అలాగే శీతల పానీయాలు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది.



ఎండదెబ్బ నుంచి రక్షణకు ఇలా..

ఎండదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ప్రతీ ఒక్కరు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ల సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లుతిరగడం, వాంతులు చేసుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలినట్టుగా గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు. ప్రాథమిక చికిత్సలో భాగంగా నీటిలో ఓఆర్ఎస్ పొడిని కలిపి తాగాలని సలహా ఇస్తున్నారు. వీలైనంత మేరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో ఎక్కువ సమయం తిరగకుండా, ఇళ్లు, లేదా చల్లని గాలివీచే ప్రాంతాల్లో సేదతీరితే మంచిందని చెబుతున్నారు. ప్రతీ ఒక్కరు 5 నుంచి 6లీటర్ల వరకు నీటిని తాగాలని, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయొద్దని, తప్పనిసరి పరిస్థితులో వెళ్లాల్సివస్తే గొడుగు, వస్త్రాలను కప్పుకోవాలని సూచిస్తున్నారు. ఎవరైనా వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళితే ఆ వ్యక్తికి నీరు తాగించకుండా వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలని, వడదెబ్బ నుంచి కోలుకునే వరకు వైద్యుల సలహా మేరకు నడుచుకోవాలని సూచిస్తున్నారు.

ముక్తీశ్వరుడి దర్శనానికి వచ్చి..

వడదెబ్బతో కాళేశ్వరాలయంలో వృద్ధుడి మృతి



కనకయ్య (ఫైల్)

మహదేవపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ముక్తీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయంలో మంగళవారం జరిగింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కాంపెల్లి కనకయ్య(72), అతడి భార్య, భూమక్క, కొడుకు శ్రీనివాస్ మంగళవారం ఉదయం కాళేశ్వరానికి వచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. కనకయ్య కుమారుడు శ్రీనివాస్, భార్య భూమక్క రాహు కేతు పూజల కోసం ఆలయంలోకి వెళ్లగా అతడు మాత్రం పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లాడు. టీ తాగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హోటల్ నిర్వాహకులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా పూజలు మధ్యలోనే వదిలేసి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కనకయ్యను మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దాంతో కుటుంబసభ్యులు అతడి మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.

ఆలయంలో సంప్రోక్షణ

పూజలు చేస్తుండగా వృద్ధుడు చనిపోవడంతో వెంటనే అర్చకులు ఆలయాన్ని మూసి శుద్ధి చేశారు. సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు.

మానుకోట జిల్లాలో ఇద్దరు మహిళల మృతి



బాదంపుడి సుశీల, బాసాని మల్లమ్మ (ఫైల్)

గార్ల/కొత్తగూడ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని వేర్వేరు మండలాల్లో వడదెబ్బకు గురై మంగళవారం ఇద్దరు మృతి చెందారు. గార్ల మండలం గండితండాలో గార్లకు చెందిన వ్యవసాయ కూలీ బాదంపుడి సుశీల (57) మృతి చెందారు. గార్లకు చెందిన సుశీల వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మంగళవారం ఉదయం మిర్చితోట ఏరేందుకు గండితండాకు వెళ్లగా.. మధ్యాహ్నం సమయంలో కూలీలందరితో కలిసి భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వడదెబ్బకు గురై అస్వస్థతతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే కొత్తగూడ మండలం వేలుబెల్లిలో వడదెబ్బతో వృద్ధురాలు బాసాని మల్లమ్మ (65) మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఇంటివద్దనే ఉంటున్న మల్లమ్మ ఎండల తీవ్రతకు వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతతో మృతి చెందింది. మల్లమ్మకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు.

అనుబంధాలు కలిసొచ్చేనా?

5వ పేజీ తరువాయి

టీఎంయూలోని ఒక వర్గం బీఆర్ఎస్‌తో అను బంధాన్ని తెంపుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. ఇలా కార్మిక సంఘాల్లో కీలకమైన ఆర్టీసీ, విద్యుత్, సింగరేణిలో బీఆర్ఎస్‌కు అనుబంధ సంఘాలు ఒక్కొక్కటిగా దూరమవుతు వస్తున్నాయి.

ఆ వర్గాలపై ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం..

బీఆర్ఎస్‌కు బలం, బలగం యువతనే. ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారు. అయితే గత వరుస ఎన్నికల్లో యువత గులాబీ పార్టీకి దూరమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. 2014 జూలైలో జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ ఓటమి క్యాడర్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఈ స్థానం నుంచి మూడు పర్యాయాలు బీఆర్ఎస్ గెలిచింది. అప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న గులాబీ శ్రేణులకు, ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓటమితో మరింత డీలా పడ్డారు. తాజాగా జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండతో పాటు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీకి దిగకపోవటం, కనీసం ఏ అభ్యర్థికో మద్దతు ఇవ్వకపోవటంతో బీఆర్ఎస్‌తో అనుబంధంగా కొనసాగిన ఉపాధ్యాయులు తమదారి తాము చూసుకున్నారనే చర్చ జరుగుతోంది.

'అనుబంధాల'తో చర్చలేవీ?

పార్టీ రజతోత్సవాల వేళ ఊరూరా గులాబీ పండుగను ఘనంగా జరుపుకొంటామని పార్టీ నేతలు ప్రకటిస్తున్నారు. అయితే ఇప్పటికే పార్టీకి దూరమైన సింగరేణి, విద్యుత్, ఆర్టీసీ కార్మిక సంఘాలను దగ్గరికి తీసుకునేందుకు ప్రణాళిక లేకపోవడంపై పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భూపాలపల్లి, పరకాల, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మంథని పరిధిలోని కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలో సింగరేణి కార్మిక కుటుంబాలు ఉన్నాయి. అలాగే భూపాలపల్లి కేటీపీపీతో పాటు ఎన్‌పీడీసీఎల్ పరిధిలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీసీలో వేలాది మంది కార్మికులున్నారు. రజతోత్సవాల వేళ ఈ కార్మిక లోకాన్ని కదిలించే ప్రయత్నం జరగటం లేదనే టాక్ వినబడుతుంది. అంతేకాకుండా పార్టీ యువజన విభాగాన్ని క్రియాశీలకం చేయాలనే చర్చ జరుగుతోంది. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోనే సమీక్షలు, సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారని, దూరమైన వర్గాలను దగ్గరికి చేర్చే కార్యాచరణ ఏదనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. అయితే భారీ బహిరంగ సభను నిర్వహించి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు కసరత్తు చేస్తున్న పార్టీ.. ఉద్యమానికి బలమైన పునాదులుగా నిలిచిన కార్మిక సంఘాలను, ఇతర వర్గాలను తిరిగి గులాబీ గూటికి చేర్చే ప్రయత్నాలు జరగటం లేదని చర్చ జరుగుతుంది.



వెంకటాపూర్ తహసీల్దార్ కార్యాలయం

భూ భారతిపై ఎన్నెన్నో ఆశలు

5వ పేజీ తరువాయి

పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పత్రాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. కొత్త సాఫ్ట్‌వేర్ సామర్థ్యాన్ని గుర్తించడానికి కొత్త పోర్టల్‌లో ఏమైనా కార్యాచరణ సమస్యలు ఉన్నాయో చూడడానికి పైలట్ ప్రాజెక్టుగా మండలంలో అమలు పరచనున్నారు. మూడు నెలలపాటు మండలంలో ఈ చట్టాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆతర్వాత ఫలితాలను బట్టి పూర్తిస్థాయిలో పనిచేస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న కలెక్టర్

భూభారతికి వెంకటాపూర్ మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవగా.. గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సును నిర్వహించేందుకు కలెక్టర్ టీఎస్.దివాకర కార్యాచరణ రూపొందిస్తున్నారు. బుధవారం ఆయన షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు సదస్సులను నిర్వహించి రైతుల నుంచి స్వీకరించే వినతులను పరిశీలించి వచ్చే నెల 31లోపు వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారు. మే 31లోగా ప్రతి సమస్యకూ పరిష్కారం చూపి రికార్డులను సరి చేయడం ద్వారా జూన్ 2న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో వెంకటాపూర్ మండలం నుంచి వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

రేపటి నుంచి గ్రామాలకు రెవెన్యూ బృందాలు

గురువారం నుంచి రెవెన్యూ బృందాలు గ్రామాల్లో సందర్శిస్తాయి. భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన అనంతరం పైలట్ ప్రాజెక్టుగా మొదటిసారి ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలోని భూనిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బందికి ప్రతి ఒక్కరూ భూములకు సంబంధించిన దస్తావేజులు, డాక్యుమెంట్లు చూపాల్సి ఉంటుంది. వాటిని అందుబాటులో ఉంచుకోవాలి. గురువారం నుంచి జరిగే ఈ ప్రక్రియలో ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులపై సదస్సులు నిర్వహించి, భూభారతి చట్టాన్ని అమలు చేస్తాం.

- టీఎస్. దివాకర, ములుగు కలెక్టర్

కేయూలో 75 వసంతాల సందడి

- 22 ఏళ్ల తర్వాత వర్సిటీలో క్రీడా సంబురాలు
- హాజరుకానున్న మిట్టపెల్లి సురేందర్, కబడ్డీ కోచ్ శ్రీనివాసరెడ్డి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 75 వసంతాల వేళ క్రీడా సంబురాల సందడి కనిపిస్తోంది. 1976 ఆగస్టు 19న ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. తొలుత ఉస్మానియా వర్సిటీ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్‌గా ఉండగా.. తర్వాత ఉత్తర తెలంగాణ ప్రాంత విద్య అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ వర్సిటీకి పునాది వేయగా.. యూజీ, పీజీ కోర్సులతో పాటు ప్రొఫెషనల్ కోర్సులు, పీహెచ్‌డీ, ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్ కోర్సులతో ఏటేటా వెయ్యిమంది విద్యార్థులను అక్కున చేర్చుకుంటోంది. కాకతీయరాజుల పేరుతో కాకతీయ యూనివర్సిటీని స్థాపించడంతో పాటు కాకతీయుల విద్యా మంత్రి, సంస్కృత పండితుడు విద్యారణ్యుడి పేరు మీదుగా వర్సిటీ ప్రాంతానికి విద్యారణ్యపురిగా నామకరణం చేశారు. 672 ఎకరాల విస్తీర్ణంలో 29డిపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రధానంగా ఆర్ట్స్, లైఫ్‌సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులున్నాయి. కేయూకు 19 అనుబంధ కళాశాలలు మరో 473 అఫిలియేటెడ్ కళాశాలలున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉంది.

క్యాంపస్ స్టూడెంట్లకు తీపి గుర్తు

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో పీజీ కోర్సుల్లో రెండేళ్లపాటు, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ఐదేళ్లపాటు విద్యార్థులు విద్యనభ్యసిస్తారు. రెండేళ్ల తీపి గుర్తుల్లో కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవంతో పాటు సాంస్కృతిక సంబురాలలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తారు. క్రీడల్లో జట్టుగా విజయం సాధిస్తే విద్యార్థి జీవితంలో మురుపురాని జ్ఞాపకంగా నిలిచిపోతోంది.



కేయూ ఆడిటోరియం



అధ్యాపకులతో కమిటీల ఏర్పాటు

ఈ ఏడాది 75వసంతాలు కావడంతో వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రూపు సాంగ్‌లు, కల్చరల్ ఈవెంట్లను సెనెట్ హాల్‌లో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

22 ఏళ్ల తర్వాత వార్షికోత్సవ సంబురాలు

కాకతీయ యూనివర్సిటీలో అనివార్య పరిస్థితుల వల్ల ఏటేటా నిర్వహించాల్సిన వార్షికోత్సవ సంబురాలు, క్రీడా దినోత్సవాలు నిర్వహించలేదు. అయితే కేయూ వీసీగా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యార్థులకు కోరిక మేరకు ఈ ఏడాది 75వ వార్షిక సంబురాలను నిర్వహిస్తున్నారు. 22 ఏళ్ల తర్వాత వర్సిటీ క్యాంపస్ కళాశాలలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కేయూ క్రీడా మైదానంలో వర్సిటీనిలోని 29 విభాగాలకు చెందిన మొదటి, రెండో ఏడాది విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి క్రీడాపోటీలను నిర్వహించారు. అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు హోరాహోరీగా క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారు. బహుమతులను గెలుచుకున్నారు. క్రీడాపోటీలను కేయూ వ్యాయామ విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శేషాల కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు.

రేపు ఆడిటోరియంలో సంబురాలు

కాకతీయ యూనివర్సిటీ 75వ వార్షికోత్సవ వేళ.. క్రీడోత్సవ, సాంస్కృతిక సంబురాలకు కేయూ ఆడిటోరియాన్ని వేదికగా చేశారు. 17న గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం ఉంటుంది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రముఖ కవి, తెలంగాణ వాగ్గేయకారుడు మిట్టపల్లి సురేందర్, ఇండియన్ కబడ్డీ జట్టు కోచ్ లింగపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేస్తారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తారు. కేయూ ప్రొఫెసర్లు వెంకటయ్య, ఫిజికల్ డైరెక్టర్ శేషాల కుమారస్వామి, ముంజం శ్రీనివాస్‌లతోపాటు క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్, వార్షికోత్సవాల కో కన్వీనర్ మమత కార్యక్రమాలకు నేతృత్వం వహిస్తున్నారు.



క్యాంపస్ కళాశాల బోర్డు

కూల్‌కూల్.. కూలర్స్

- సామాన్యులకు అందుబాటులో రకరకాల కూలర్లు
- జోరందుకున్న విక్రయాలు



నగరంలోని ఓ షాపులో విక్రయించేందుకు అందుబాటులో ఉన్న కూలర్లు.

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భానుడు భగభగల నుంచి ఉపశమనం కోసం సామాన్య ప్రజలు కూలర్లను కొనుగోలు చేసేందుకు షాపులకు పరుగు పెడుతున్నారు. తమ బడ్జెట్‌లో వచ్చే కూలర్లను కొనేందుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారులు కూడా వివిధ మోడళ్లలో అందుబాటులోకి తెచ్చారు. పేద, మధ్యతరగతి వారి ఇళ్లకు, గదులకు అనుగుణంగా వివిధ సైజుల్లో కూలర్లు లభ్యమవుతున్నాయి. ఇక కొందరేమో పాతకూలర్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. అలా వేసవికాలాన్ని కూల్‌కూల్‌గా కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రజలు తాపత్రయపడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం సైజును బట్టి రూ.3వేల నుంచి రూ. 9వేల వరకు ధరల్లో కూలర్లు లభిస్తున్నాయి.

ధర ఆధారంగా కూలర్లకు 1, 2 ఏళ్ల గ్యారంటీ, వారంటీ ఇస్తున్నామని నగరంలోని పలువురు కూలర్ల షాపు యజమానులు చెపుతున్నారు. అయితే వేసవి ప్రారంభం నాటికి ఇప్పటికి కూలర్ల ధరలు భారీగా పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. పలు ప్రముఖ కంపెనీలు కూడా బ్రాండెడ్ పేర్లతో కూలర్లను అందుబాటులోకి తేగా.. అసెంబుల్డ్ కూలర్లు కూడా బాగానే అమ్ముడవుతున్నాయి. ఇవి ప్లాస్టిక్, ఐరన్ బాడీలతో పలు పేర్లతో లభ్యమవుతున్నాయి.

ఎండలతో పాటే గిరాకీ పెరిగింది..



వేసవికాలం ప్రారంభం నుంచే ఎండలతో పాటు కూలర్ల అమ్మకాలకు గిరాకీ పెరిగింది. ఈ ఏడు నగర వాసులతో పాటు వివిధ మండల కేంద్రాల నుంచి కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు కూలర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సామాన్యుడికి అందుబాటు ధరల్లో కొత్త కొత్త మోడళ్లు.. అల్యూమినియం, ప్లాస్టిక్ బాడీలతో అందిస్తున్నాం. ఈ ఏడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతం కన్నా ఇంకా ఎక్కువ కూలర్లను విక్రయించే అవకాశం ఉంది.

- వర్ల గోపాల్‌రెడ్డి, కూలర్లషాపు యజమాని, హనుమకొండ చౌరస్తా

గంటలో 1,046 వీడియోలు అప్‌లోడ్

గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం



గిన్నీస్ బుక్ మెడల్ అందుకుంటున్న సుభాష్‌చంద్రబోస్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సంగీత ప్రదర్శనకు సంబంధించిన 1,046 వీడియోలను గంట వ్యవధిలో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఓ ఔత్సాహికుడు గిన్నిస్ బుక్ రికార్డును సాధించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) యు.సుభాష్‌చంద్రబోస్ సంగీత కళాకారుడు కూడా. గతేడాది డిసెంబరులో జరిగిన ప్రపంచ స్థాయి మ్యూజిక్ ప్రదర్శనలో కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం సరళి స్వరాల్ 1,046 వీడియోలను గంటల వ్యవధిలోనే అప్‌లోడ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల చేతుల మీదుగా సుభాష్‌చంద్రబోస్ మెడల్‌తోపాటు సర్టిఫికెట్‌ను సొంతం చేసుకున్నారు. సంగీతంలో కీబోర్డు ద్వారా హల్లెల్ మ్యూజిక్ స్కూలు బృందంతో డైరెక్టర్ ఆగస్టిన్ ప్రోత్సాహంతో ఈ రికార్డు సాధించినట్లు సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై స్వచ్ఛభారత్

హసన్‌పర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువు కట్ట మెట్లపై చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈసందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్లు మేకల హరిశంకర్, దాసరి రాజు, తాళ్ళ శ్యాం, సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రావు, దాది మధుసూదన్, గంట సత్యం, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్ పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

గుడిసెవాసుల తాగునీటి తండ్లాట

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని పలు కాలనీలలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జితేందర్‌సింగ్, అంబేద్కర్ నగర్ గుడిసెవాసులకు నల్లాలు లేకపోవడ ంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారు. అయితే పది రోజులుగా నీళ్ల ట్యాంకులు రాక తాగునీటి కోసం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అల్లాడిపోతున్నారు. ఉండడానికి నిలువ నీడ లేక ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తు న్న గుడిసెవాసులకు తాటి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వాసులు బిందెలతో, క్యాన్లల్లో, సైకిళ్లపై పబ్లిక్ గార్డెన్ నుంచి, నక్కలగుట్ట నుంచి తాగునీటిని తీసుకెళ్తున్నారు. 10 రోజులుగా ట్యాంకర్లు రాకపోవడంతో స్నానాలకు, ఇతర అవసరాలకు ఎంతో ఇబ్బందులు పడుతున్నామని గుడిసెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎండలు దంచికొడుతుండడంతోపాటు మరో వైపు తాగునీరు లేక తండ్లాడుతున్నట్లు , గుడిసెవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టించుకోని అధికారులు

అంబేద్కర్ నగర్, జితేందర్ సింగ్ నగర్ గుడిసెవాసులకు తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. వాటర్ ట్యాంకులను పంపించా లని కోరినప్పటికీ అధికారులు పంపించకపో వడంతో తాగునీటికి తండ్లాడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ట్యాంకర్ల ద్వారా అందించి శాశ్వత తాగునీటి పరిష్కారానికి కృషి చేయాలని గుడిసెవాసులు వేడుకుంటున్నారు.

తాగునీటి కోసం గుడివాసుల ఆందోళన

తాగునీరు ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని హనుమ కొండ బాలసముద్రంలోని అంబేద్కర్ నగర్ జితేందర్ సింగ్‌కాలనీ గుడిసె వాసులు మంగళవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. పది రోజుల నుంచి తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు వాపో యారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



తాగునీటికి ఇబ్బంది పడుతున్నామంటూ ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని హరితహోటల్ ఏరియా, ఏకశిల పార్కు రోడ్డు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియా, మెయిన్‌రోడ్డు డీపీఎస్ స్కూల్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, పెద్దమ్మగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలో కృష్ణకాలనీ, యాదవనగర్ పెట్రోల్‌పంపు, గౌతమినగర్, ఏఏఆర్ గార్డెన్ ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, కేఎస్ఆర్ గార్డెన్ హనుమాన్‌జంక్షన్ ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు, కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూకాలనీ, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, సుబేదారి ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఐస్‌క్రీమ్ పార్లర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదాలత్ జంక్షన్‌లోని ఇగ్లూ ఐస్‌క్రీమ్ పార్లర్‌లో నిబంధనలు ఉల్లంఘించి గడువు తేదీలు, తయారీ తేదీలు ముద్రించకుండా, లైసెన్స్‌లు తీసుకోకుండా విక్రయిస్తుండటంతో పక్కా సమాచారం మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి సుమారు రూ.1,13,525 విలువ 4 రకాల ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని ఫుడ్‌సేఫ్టీ అధికారి పి.వేణుగోపాల్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమమే ఎజెండా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమమే తమ ఎజెండా అని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. హనుమకొండలోని టీఎన్జీఓస్ భవనంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా ఎ.రాజేందర్, కన్వీనర్‌గా మురళీధర్‌రెడ్డి, కోకన్వీనర్‌గా తిరుపతిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా జగన్‌మోహన్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల మస్యల సాధన కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ పని చేస్తోందని, ఉద్యోగులకు ఎల్లవేళ్లలా అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బైరి సోమయ్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పనికెల రాజేష్, పుల్లూరు వేణు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మాక్ డ్రిల్‌పై అవగాహన సదస్సు



మాక్ డ్రిల్ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బస్టాండ్‌లో మాక్‌డ్రిల్‌పై ప్రయాణికులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలకు ప్రజలు ఫైర్ సిబ్బందికి సమాచారం అందిస్తే ఫైర్ ఇంజన్ ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు అగ్ని ప్రమాదాలు జరుగకుండాజాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించాలి

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మే నెల 1నుంచి 31వరకు నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీవైఎస్‌వో అశోక్‌కుమార్ కోరారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రం ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో వివిధ క్రీడాంశాలకు చెందిన కోచ్‌లతో నిర్వహించిన సమావేశంలో అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించడానికి నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కోచ్‌లు వెళ్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులను వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనేలా చూడాలని కోచ్‌లకు సూచించారు. అదే విధంగా ఒక్కో కోచ్ నగరంలోని 10 పాఠశాలలు, 10 కాలేజీలకు వెళ్లి విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు సహకరించాలిని కోరారు. నెలపాటు జేఎన్ఎస్ వేదికగా పలు క్రీడాంశాల్లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు తమ దరఖాస్తులను బాలసముద్రంలోని ఇండోర్ స్టేడియంలో అందజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఓడపల్లి శ్రీనివాస్, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమాన్. రాయబారపు నవీన్, కొత్త ప్రశాంత్, కూరపాటి రమేష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.డి. అఫ్జల్, రాజారపు రమేష్, జీవన్‌గౌడ్, ఓనపాకల శంకర్, విష్ణు, రాజు, డీఎస్ సిబ్బంది కిశోర్, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

విఘ్నేశ్వర సంక్షేమ సంఘం ఏర్పాటు

కాజీపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట భవానీనగర్ 47వ డివిజన్‌లో మంగళవారం నూ తనంగా విఘ్నేశ్వర సంక్షే మ సంఘాన్ని ఏర్పా టు చేశారు. అధ్యక్షుడిగా ఎడ్ల భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేగుల వీరస్వామి, జనరల్ సెక్రటరీగా బోళ్ల రమేశ్, జాయింట్ సెక్రటరీలుగా రాజిడి నవీన్‌రెడ్డి, బావండ్లపల్లి మురళీకృష్ణ, ట్రెజరర్‌గా ఎల్. ఈశ్వర్, సలహాదారులుగా చల్ల ఇంద్ర సేనారెడ్డి, ఈసీ మెంబర్లుగా జానపట్ల శ్రీనివాస్, గుంటి మేఘరాజు, కామారపు సుమన్, వక్కల కుమారస్వామి, కౌకుంట్ల రవి ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాలనీ అభివృద్ధితో పాటు సంక్షేమానికి పాటుపడుతుందని నూతన కమిటీకి చెప్పారు.

వరంగల్ జిల్లా బార్ అధ్యక్షుడికి సన్మానం

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యో తి): ఇటీవల వరంగల్ జిల్లా బార్ అసోసి యేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన వలుస సుధీర్‌ను పొపా కార్యవర్గం సన్మాని ంచింది. మంగళ వారం జిల్లా కోర్టులోని అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొపా రాష్ట్ర అధ్యక్షుడు శ్యామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పొపా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, రాష్ట్రప్రతినిధులు గోసికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవింద్, పాము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు వలుస సుధీర్‌ను సన్మానిస్తున్న పొపా ప్రతినిధులు

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

వడ్డెపల్లి: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పులి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొత్త రవి, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలుస సుధీర్, ప్రధాన కార్యదర్శిగా దండాపంతుల రమాకాంత్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వీరికి మంగళవారం హనుమకొండలోని బాలసముద్రం ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు పీఆర్‌సీని వెంటనే అమలు చేయడంతో పాటు రావాల్సిన ఐదు డీఏలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని జిల్లా పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో ఇబ్బందులు కలుగకుండా ట్రెజరీ నుంచి బిల్లులను విడుదల చేయించాలని కోరారు. ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో 30 శాతం రాయితీని తమకు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా, మండల శాఖలకు భవన నిర్మాణాల కోసం స్థలాన్ని ప్రభుత్వమే ఇప్పించి భవనాలను నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.డి. ఖాజా నయామొద్దీన్, కోశాధికారి పి. విద్యాసాగర్, ఉపాధ్యక్షులు పి.నారాయణ, పగడాల సరళ, హనుమకొండ నగర శాఖ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుందూరు గోపాల్‌రెడ్డి

పేద ప్రజల అజెండా ఎర్రజెండా



మడికొండ ఆర్ఎన్ఆర్ కాలనీలో మాట్లాడుతున్న జ్యోతి

మడికొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అజెండానే ఎర్రజెండా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. మడికొండలోని రావినారాయణరెడ్డి కాలనీలో మంగళవారం గుగులోత్ రమేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక, మైనార్టీ వ్యతిరేక చట్టాలను తీసుకువస్తూ దేశాన్ని విడగొట్టే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మద్దెల ఎల్లేష్, రాజౌలి, వేల్పుల సారంగపాణి, మునిగాల భిక్షపతి, శంకర్, రాసమల్ల దీన, దొమ్మాటి ప్రవీణ్, మంద సుమన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడికొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి స్థానిక కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఏవో సంతోష్, ఏఈవో రజిత, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్యాల యాదవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పుల్యాల సంపత్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. బషీర్, మలిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా న్యాయవాదుల కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక



పీసరి రాము

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పీసరి రాము, గంధం సురేష్ ఎన్నిక య్యారు. 2025-26 సంవత్సరానికి సొసైటీ కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పు కృష్ణారావు, కోశాధికారిగా నాంసాని చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. న్యాయవాదులు ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ రామక్రిష్ణకు దళితరత్న అవార్డు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): హనుమకొ ండకు చెందిన జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ రామక్రిష్ణ దళిత రత్న అవార్డు అందుకున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరి యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జయం తి కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన దళితరత్న అవార్డుల ప్రదానం లో డాక్టర్ రామక్రిష్ణ అవార్డును అందుకున్నారు.



దళితరత్న అవార్డు అందుకుంటున్న రామక్రిష్ణ

ఐపీఎస్ ప్లే స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని ఐపీఎస్ ప్లే స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డైరెక్టర్లు

ఈ సందర్భంగా ఐపీఎస్ విద్యాసంస్థల చైర్మన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గౌడ్ చిన్నారులతో పాటు తల్లిదండ్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని తన సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ తీగల సరితాదేవి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో ఆఫీస్‌లో దండకు నోచుకొని అంబేద్కర్ విగ్రహం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్లక్ష్యం చేసినట్లు ఆరోప ణలు వెల్లువెత్తుతున్నా యి. సోమవారం అంబేద్కర్ జయ ంతిని పెద్దఎత్తున జరుపుకుని ఆయనకు ఘననివా ళిని అర్పించారు. అయితే హనుమకొండ డీఈవో కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం మాత్రం కనీసం ఒక్క పూల మాలకు నోచుకోలేదు. సెలవు దినం అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో అంబేద్కర్ జయంతిని నిర్వహించగా డీఈవో కార్యాలయంలో మాత్రం మహనీయుడి విగ్రహానికి అపచారం జరిగిందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎడ్ల ఉపేందర్ తీవ్రంగా ఆక్షేపించారు. అంబేద్కర్ విగ్రహాన్ని అగౌరవపరిచిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



హనుమకొండ డీఈవో ఆఫీస్‌లో పూలమాలలు లేకుండా బోసిగా ఉన్న అంబేద్కర్ విగ్రహం

20న టీపీఎఫ్ మహా సభలు

వడ్డెపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) 4వ హనుమకొండ, వరంగల్ జిల్లాల మహా సభలు జరుగుతాయని టీపీఎఫ్ హనుమకొండ జిల్లా కన్వీనర్ జనగాం కుమారస్వామి అన్నారు. మంగళ వారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంత ంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీఎఫ్ మహా సభలకు సంబంధించిన కరపత్రా లను ఆవిష్కరించారు. టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ బి.రమాదేవి, రాష్ట్ర, జిల్లా బాధ్యులు గొల్లూరి ప్రవీణ్‌కుమార్, వెంగళరెడ్డి, కర్రు సుధీర్‌బాబు, పాపయ్య, రఘుశర్మ, గాదరి ఉప్పలయ్య, సందీప్, జ్యోతి రమణి పాల్గొన్నారు.

సుందరీమణులు పాల్గొనే కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ఈనెల 14వ తేదీన వరంగల్ పర్యటనకు వస్తున్నారని, వీరి పర్యటనలో పాల్గొనే కార్యక్రమాలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం సుందరీమణుల పర్యటనపై సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ దేశాలకు చెందిన సుందరీమణులకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం దగ్గర చేయాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమాలు, పాల్గొనే వీజీపీలు, ఎంపిక చేయాల్సిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు, బతుకమ్మ ఆటపాట, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మే14వ తేదీన 30మంది సుందరీమణులు వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అధికారు లు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రపంచానికి వరంగల్ చారిత్రక, వారసత్వ విశేషాలను తెలియజేసేందుకు లభించిన ఈ అవకాశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఖజానా అధికారి ఆకవరం శ్రీనివాస్‌కుమార్, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ శివాజీ, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సమ సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

ఐ అండ్ క్యాడ్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ జనార్దన్

హసన్‌పర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సమసమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని ఐ అండ్ క్యాడ్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆర్.జనార్దన్ అన్నారు. మండలంలోని చింతగట్టు క్యాంపు అతిథి గృహం ఆవరణలో మంగళవారం ప్రముఖ లెజెండరీ ఇంజనీర్ గుర్రం కోటిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పూర్వకాలంలో ఇంజనీరింగ్ వ్యవస్థ నిర్మాణాత్మకమైన, ప్రణాళికాబద్ధమైన ప్రజాప్రయోజనమైన ప్రాజెక్టులకు ప్రాధాన్యత నిస్తూ సమాజ శ్రేయస్సు కోసం నిర్విరామ కృషి చేసేవారని అన్నారు. ఇంజనీరింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా నేటి యువఇంజనీర్లు సమాజంలో అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధమైన నిర్ణయాలతో ముందుకు సాగితే ప్రపంచంలోనే గొప్ప దేశంగా భారతదేశాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, ఐ అండ్ క్యాడ్ వరంగల్ చీఫ్ ఇంజనీర్ గోలి అశోక్‌కుమార్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు గుండమీది రవీందర్, విశ్రాంత అధికారులు, కోటిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఇంజనీరింగ్ అధికారులు

అన్ని సన్‌గ్లాసెస్ ఒకటి కావు





ఫ్యాషన్

సన్ గ్లాసెస్ ఎందుకంటే...

- కంటి చుట్టూరా ఉండే చర్మానికి రక్షణ దక్కుతుంది
- అతినీలలోహిత వెలుగు కళ్లలోకి చొరబడకుండా ఉంటుంది

పోలరైజ్‌డ్ లెన్స్‌లు

ప్రతిఫలించే కాంతి మెరుపును తగ్గించడానికి సహాయపడతాయి. సముద్రతీరాలు సందర్శించే సమయంలో నీటి మీద ప్రతిఫలించే ఎండ వెలుగు నుంచి కళ్లకు రక్షణ దక్కుతుంది.

నాన్ పోలరైజ్‌డ్ లెన్స్‌లు

తీవ్రమైన వెలుగును అడ్డుకుంటాయి. ఆరుబయట ఎండ వెలుగుకు కంటిచూపు స్పష్టత కోల్పోకుండా సహాయపడతాయి

యువి బ్లాకర్స్

అతినీలలోహిత కిరణాల నుంచి కళ్లకు రక్షణ కల్పిస్తాయి. రోజంతా ఎండలో తిరిగే సమయంలో ఈ కళ్లజోడు పెట్టుకోవాలి

కూలింగ్ గ్లాసెస్ కొనేటప్పుడు...

- లెన్స్‌లో యువి ఫిల్టర్స్ ఉన్నాయని సూచించే లేబుళ్లను కలిగిన సన్ గ్లాసెస్ ఎంచుకోవాలి
- అవసరాలకు తగిన సన్‌గ్లాసెస్ ఎంచుకోవాలి
- కంటి చుట్టూరా చర్మాన్ని కప్పే ఫ్రేమ్ కలిగిన సన్‌గ్లాసెస్ ఎంచుకోవాలి



యువి వెలుగు హానికరం. ఎందుకంటే...

- కంటిచుట్టూరా ఉండే చర్మం దెబ్బతింటుంది. ముడతలు ఏర్పడి, చర్మపు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది
- కంటి శుక్లాలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి
- రంగులనూ, సూక్ష్మ వివరాలనూ కనిపెట్టే కంట్లోని మాక్యులా దెబ్బతింటుంది



గ్రామీణ మహిళల ప్రస్తావన వచ్చినప్పుడు చాలామంది వారు పొలం పనులకే పరిమితం అనుకుంటారు. కానీ అవకాశాలు లభిస్తే వారు కూడా ఎవరికీ తీసిపోరు. దీనికి ఉదాహరణ మహబూబ్‌నగర్ దివిటిపల్లిలో ఉన్న అమర్‌రాజా గిగా ప్లాంట్‌లో పని చేసే మహిళలు. అక్కడ సుమారు 430మంది సిబ్బంది ఉంటే వారిలో 350 మంది గ్రామీణ యువతులే! వారిలో కొందరిని 'నవ్య' పలకరించింది.

అక్కడ సిబ్బంది అందరూ మహిళలే!

మన గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించే పెద్ద పరిశ్రమలు తక్కువ. పరిశ్రమలు తక్కువ కావటం వల్ల ఇంటర్ దాకా చదువుకున్న అమ్మాయిలు కూడా కూలి పనులకే వెళ్తూ ఉంటారు. కూలి పనికి వెళ్లటం వల్ల ఆదాయం తక్కువగానే వస్తుంది. వారు కుటుంబానికి చేసే సాయం కూడా తక్కువే.. పైగా వారికి పెళ్లి అయి పిల్లలు పుడితే మరిన్ని సమస్యలు పెరుగుతాయి. ఇదంతా ఒక విషవలయంలా తయారవుతుంది. దీని నుంచి వీలైనంత మందిని బయటపడేయాలనే ఉద్దేశంతో అమర్‌రాజా సంస్థ పేదరికం ఎక్కువగా ఉండే మహబూబ్‌నగర్‌లో విడిభాగాలను బిగించి.. బ్యాటరీలను తయారుచేసే గిగా ప్లాంట్‌ను నెలకొల్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా ప్లాంట్‌లను నెలకొల్పినప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. "మేము ఈ ప్లాంట్‌ను ప్రారంభించినప్పుడు- చుట్టుపక్కల ప్రాంతాలలో చదువుకున్న యువతులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించుకున్నాం. అందులో ఎక్కువ మంది పదోక్లాసు, ఇంటర్ దాకా చదువుకున్నవారే. వారికి సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉండదు. ముందు వారికి శిక్షణ ఇచ్చాం.." అని కంపెనీ ప్రతినిధి వివరించారు. ఈ శిక్షణ ఇవ్వటానికి కూడా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందంటారు ఆమె. "మొదట్లో ఇక్కడ ఉన్న కుటుంబాలలో అనేక అనుమానాలు ఉండేవి. కంపెనీకి పంపించటానికి సంశయించేవారు. ముందు కొద్ది మంది చేరారు. ఆ తర్వాత వారిని చూసి ఇతరులు వచ్చారు. మా దగ్గర చాలా సురక్షితమైన వాతావరణం ఉంటుందనే విషయాన్ని తెలియజేయటానికి వీరందరినీ చిత్తూరులో ఉన్న మా ప్లాంట్‌కు తీసుకువెళ్లాం. అక్కడ కూడా అందరూ మహిళలే పనిచేస్తూ ఉంటారు. దానితో వీరందరికీ నమ్మకం వచ్చింది. ఇప్పుడు కంపెనీపై పూర్తి భరోసా వచ్చింది" అంటారు ఆ ప్రతినిధి.



> బ్యాటరీలు బిగించేటప్పుడు చేతులతో చేసే పనులు కొన్ని ఉంటాయి. కొన్ని యంత్రాలు మాత్రమే చేయగలుగుతాయి. ఈ పనులు మగవాళ్లే కాదు. మహిళలు కూడా సులభంగా చేయవచ్చు.
> - శైలజ



జీవన ప్రమాణాలు మెరుగ్గా..

సాధారణంగా పెళ్లి అయ్యి.. పిల్లలు పుట్టిన తర్వాత ఖర్చులు పెరుగుతాయి. ఈ సమయంలో అదనపు సంపాదన మార్గాల కోసం అన్వేషిస్తూ ఉంటారు. ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న సౌజన్యది కూడా ఇదే కథ. "నేను ఇంటర్ దాకా చదివా. తర్వాత పెళ్లి అయిపోయింది. నేను గృహిణి పాత్రకు పరిమితయిపోయా. ఇంటర్ దాకా చదువుకున్నా మంచి ఉద్యోగాలు ఏమి రాలేదు. పొలం పనికి వెళ్తే రోజుకు మూడొందలే వచ్చేది. పైగా అన్ని సీజన్లలోను పని దొరకదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను ప్లాంట్‌లో చేరా. ప్రస్తుతం స్థిరమైన ఆదాయం వస్తోంది. పిల్లల చదువుకు భరోసా వచ్చింది.." అంటారు ఆమె. ప్లాంట్‌లో చేరి ఆదాయం పెరిగిన తర్వాత కూడా రకరకాల అపోహలు వెంటాడుతూ ఉంటాయి. ఇవి తప్పని ఎవరో ఒకరు ఉదాహరణగా నిలిస్తే మిగిలిన వారిలో స్థైర్యం పెరుగుతుంది. ఈ ప్లాంట్‌లో పనిచేసే మల్లీశ్వరి అలాంటి ఉదాహరణే. "సాధారణంగా బ్యాటరీలు తయారీ ప్లాంట్ అంటే కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయనే అపోహలు ఉండేది. నేను ఉద్యోగంలో చేరటానికి చాలా భయపడ్డా. చేరిన తర్వాత ముడిపదార్థాల నాణ్యతను పరిశీలించి ప్లాంట్‌కు ఇచ్చే బాధ్యతను నాకు అప్పగించారు. పైగా షిఫ్టులు కూడా ఉంటాయి. మొదట్లో ఇబ్బంది అనిపించేది. కానీ నా కుటుంబ సభ్యులు సహకరిస్తూ ఉండటంతో ఇబ్బంది లేకుండా సాఫీగా సాగిపోతోంది" అంటారు మల్లీశ్వరి.

వ్యాపారవేత్త రామచంద్ర గల్లా 1985లో అమర రాజా గ్రూపును స్థాపించారు. 1990లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ ప్లాంటును ప్రారంభించినప్పుడు, స్థానిక మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రస్తుతం చిత్తూరులోని ఫ్యాక్టరీలో 85% మహిళలు పని చేస్తున్నారు. ఇదే వారసత్వాన్ని కొనసాగించాలనే దృక్పథంతో దివిటిపల్లిలో గిగా ప్లాంట్‌ను నెలకొల్పారు.

చేయి చేయి కలిపి..

ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో చుట్టు పక్కల ఉన్న గ్రామ ప్రజల దృక్పథంలో మార్పు వచ్చింది. ఇదే సమయంలో ప్లాంట్‌లో పని చేసే మహిళలకు బస్సు సౌకర్యం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. మన దేశంలో ఇప్పటికీ సరైన ఉపాధి అవకాశాలు లేని గ్రామాలెన్నో ఉన్నాయి. వాటిలో కూడా ఈ తరహా ప్లాంట్స్ నెలకొల్పితే గ్రామీణ మహిళలకు ఉపాధి లభిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

• గోగుమళ్ల కవిత

వేసవి ఉపశమనం 'సోడా టీ'

వేసవిలో జ్యూస్‌లు మాత్రమే కాదు.. చల్లటి టీ కూడా ఉపశమనాన్ని ఇస్తుంది. ఈ టీని ఎలా చేయాలో చూద్దాం...



తయారీ విధానం

- టీ పొడి లేదా టీ ఆకులను బాగా మరిగించాలి. డికాక్షన్‌ను తీసి ఒక గిన్నెలో పోసి చల్లార్చాలి. దానిలో తేనె కలపాలి.
- దీనిలో తగినంత నిమ్మరసం వేయాలి. బాగా కలపాలి. ఆ తర్వాత దానిలో చల్లటి సోడాను పోయాలి. ఐస్ ముక్కలను వేయాలి.
- టీ పౌడర్ కన్నా టీ ఆకులను ఉపయోగిస్తే మంచి రుచి వస్తుంది.
- కొందరు తేనెకు బదులుగా బెల్లం పొడిని కూడా వాడతారు. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది.
- నిమ్మ రసంతో పాటుగా నిమ్మకాయ ముక్కలను వేస్తే అదనపు రుచి వస్తుంది.

పిల్లలు మీ మాట వినట్లేదా..?

పిల్లలు... చెప్పిన మాట వినట్లేదని తరచూ తల్లిదండ్రులు బాధపడుతూ ఉంటారు. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలతో పిల్లలు మాట వినేలా చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.




- పిల్లలు ఏదైనా మంచి పని చేస్తే మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. సంతోషాన్ని వ్యక్తపరచాలి. దీనివల్ల పిల్లలతో అనుబంధం పెరుగుతుంది.
- పిల్లలతో సున్నితంగా మృదు స్వరంతో మాట్లాడాలి. వాళ్లమీద ప్రేమని, ఇష్టాన్ని వ్యక్తం చేసేలా మాట తీరు ఉండాలి. అప్పుడే పిల్లలు మీ మాట వినడానికి సుముఖంగా ఉంటారు.
- పిల్లలను ఆజ్ఞాపించవద్దు. వాళ్లకి అర్థమయ్యేలా చిన్న సూచన చేస్తే చాలు.
- పిల్లలతో మాట్లాడేటప్పుడు తేలిక పదాలు మాత్రమే ఉపయోగించాలి. చెప్పదలచుకున్నది సూటిగా చిన్న వాక్యాల్లో చెప్పేయాలి.
- హోమ్ వర్క్, స్క్రీన్ టైమ్‌లకు సంబంధించిన నియమ నిబంధనలను స్పష్టంగా పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి.
- పిల్లలు ఏదైనా పొరబాటు చేసినప్పుడు వాళ్లమీద అరవడం, కోపాన్ని ప్రదర్శించడం, కొట్టడం లాంటివి చేయకూడదు. వాళ్లు చేసిన తప్పు గ్రహించేలా వివరంగా మాట్లాడాలి..
- పిల్లల మీద శ్రద్ధ చూపించాలి. వాళ్లవైపు చూస్తూ ప్రతి విషయమూ అర్థమయ్యేలా చెప్పాలి.

ఐరన్ తక్కువైందని తెలిసేదెలా..?

జీవక్రియలు సజావుగా జరగడానికి ఐరన్ అత్యవసరం. పోషకాహార లోపం వల్ల ఒక్కోసారి శరీరంలో ఐరన్ మోతాదు తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి తగ్గి పలు ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. శరీరంలో ఐరన్ స్థాయి తగ్గిందని తెలిపే సంకేతాల గురించి నిపుణులు ఇలా చెబుతున్నారు.

- సాధారణంగా కాళ్లు, చేతులు కొద్దిగా వేడిగా ఉంటాయి. శరీరంలో ఐరన్ లోపిస్తే కాళ్లు, చేతులు చల్లగా అనిపిస్తాయి.
- చిన్న పని చేసినా అలసట వస్తుంది. ఎప్పుడూ నీరసంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. సుద్ద, సబ్బు, బలపాలు తినాలనే కోరిక ఏర్పడుతుంది.
- శరీరంలో ఐరన్ తగినంత పరిమాణంలో లేని పక్షంలో ఊపిరి సరిగా ఆడదు. బలంగా ఊపిరి తీసుకోవాల్సి వస్తుంది.
- తరచూ తలనొప్పి వస్తూ ఉంటుంది. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ నిద్ర మబ్బు వదలదు
- గోర్లు త్వరగా విరిగిపోతూ ఉంటాయి. కండరాలు పట్టేసినట్లు ఉంటాయి.
- శిరోజాలు అధికంగా రాలిపోతూ ఉంటాయి. చర్మం పొడిబారుతుంది. పెదవులు పగిలిపోతాయి. కళ్లలో నీళ్లు తిరుగుతూ ఉంటాయి.
- శరీరంలో ఐరన్ స్థాయి తగ్గితే రక్త హీనత ఏర్పడుతుంది. దీంతో మెదడుకి ఆక్సిజన్ సరఫరా తగ్గి తల తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. శరీరం వణుకుతూ ఉంటుంది. నిలబడడం కష్టమవుతుంది.
- ఐరన్ లోపం వల్ల గుండెలోని కండరాల పనితీరు మందగిస్తుంది. గుండె దడగా అనిపిస్తుంది. గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది.



అడవి బిడ్డలకు ఆసరా..!

"సుందర్‌బన్స్... పేరుకు తగినట్టు ప్రకృతి సౌందర్యంతో అలరారే ఈ అడవులు... ప్రపంచంలోనే అతి పెద్ద మడ అడవులుగా, యునెస్కో వారసత్వ సంపద ప్రదేశంగా గుర్తింపు పొందాయి. ఈ అందం వెనుక భయానకమైన ఒక వాస్తవం ఉంది. బతుకుతెరువు కోసం తేనె సేకరించడానికి వెళ్లినవారు క్రూరమృగాల బారిన పడి మరణించడం అక్కడ సర్వసాధారణం. మూడువేలకు పైగా ఉన్న ఆ బాధిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని, ఆత్మవిశ్వాసంతో జీవించడానికి కృషి చేస్తున్నారు ముంబయికి చెందిన 48 ఏళ్ల నీతి గోయెల్.



"నేను పుట్టి పెరిగింది, చదువుకున్నది చండీగఢ్‌లో. మా నాన్న ఎస్.కె.గుప్తా ప్రసిద్ధ పారిశ్రామికవేత్త. ఆయన బాటలోనే నేను కూడా నడిచాను. ముంబయిలో రెస్టారెంట్స్ నడుపుతున్నాను. నా భర్త కూడా వ్యాపార రంగంలోనే ఉన్నారు. మా పిల్లలిద్దరూ విదేశాల్లో చదువుతున్నారు. ఇదీ నా నేపథ్యం. మనకు ఉన్నదానిలో కొంత సమాజానికి ఇవ్వాలనే నిబద్ధత నా తల్లితండ్రుల నుంచి వచ్చింది. ముంబయి మురికివాడల్లోని పిల్లల కోసం, పేద విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు చేశాను. కొవిడ్ సమయంలో... ప్రముఖ నటుడు సోనూసూద్‌తో కలిసి పని చేశాను. పేదలకు, వలస కార్మికులకు 80 లక్షలకు పైగా భోజనాలను అందించాను. 32 మంది అనాథలను దత్తత తీసుకున్నాను. 800 మందికి పైగా సెక్స్‌వర్కర్లకు ఆసరాగా నిలిచాను. నిసర్గ తుపానువల్ల మహారాష్ట్రలోని రాయ్‌గడ్‌లో నిరాశ్రయులైన వారికోసం వెయ్యి ఇళ్ల నిర్మాణానికి సాయపడ్డాను. 'నారి నిట్టి' అనే ప్రాజెక్ట్ ద్వారా గృహహింస బాధిత మహిళలు సొంత వ్యాపారాలు పెట్టుకోవడానికి సాయపడ్డాను. ఒకవైపు వ్యాపారంలో, మరోవైపు సామాజిక కార్యక్రమాల్లో బిజీగా ఉండే నాకు... కొత్త ప్రదేశాలు చూడడం అంటే ఆసక్తి. సుందర్‌బన్స్ పర్యటన కూడా అలాంటిదే. మన దేశంలోని పశ్చిమబెంగాల్ నుంచి బంగ్లాదేశ్ వరకూ ఈ అడవులు విస్తరించి ఉన్నాయి. వాటి అందాన్ని ఆస్వాదించడానికి 2022లో పశ్చిమబెంగాల్ వెళ్లాను. అప్పుడే భయానకమైన వాస్తవాలెన్నో నాకు తెలిశాయి.

వెళ్తే పులులతో... లేదంటే ఆకలితో...

సుందర్‌బన్స్ నేషనల్ పార్క్, సాగర్ ఐలాండ్ తదితర ప్రాంతాల సందర్శన సందర్భంగా బంగ్లాదేశ్‌కు చెందిన టైగర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఎ.అజీజ్ పరిచయమయ్యారు. ఆయన గత మూడు దశాబ్దాలుగా సుందర్‌బన్స్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం పని చేస్తున్నారు. పదివేల చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిన సుందర్‌బన్స్ సుమారు వంద దీవుల సముదాయం. రాయల్ బెంగాల్ టైగర్స్‌కు, అరుదైన జంతు, వృక్ష జాతులకు నిలయం. ఇక్కడ నివసించే ప్రజలు అటవీ ఉత్పత్తులను... ప్రధానంగా తేనెను విక్రయించి జీవిస్తూ ఉంటారు. ఇక్కడి తేనెకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. దాని కోసం స్థానికులు పులులు, సర్పాలతో నిండిన అడవుల్లో.. ప్రాణాలను పణంగా పెట్టి సాహసం చేస్తారు. ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయేవారు కూడా ఎక్కువే. పులుల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నవారి వితంతువుల సంఖ్య మూడువేలకు పైనే అని తెలుసుకొని దిగ్భ్రాంతి చెందాను. వారిని 'టైగర్ విడోస్' అని వ్యవహరిస్తూ ఉంటామని డాక్టర్ అజీజ్ చెప్పారు. స్థానికులతో మాట్లాడే అవకాశం కూడా కల్పించారు. "పులులు ఉంటాయని మీకు తెలుసు కదా! అయినా ఎందుకు అడవుల్లోకి వెళ్తారు?" అని వారిని అడిగాను. "అడవుల్లోకి వెళ్లకపోతే తేనె సేకరణ ఎలా జరుగుతుంది? తేనె అమ్మకపోతే మాకు ఆదాయం ఉండదు. పులుల చేతిలోనైనా చావాలి లేదా ఆకలితోనైనా చావాలి. ఇవే మా బతుకులు" అని చెప్పారు. అడవిలోకి వెళ్లినవారు ఒక రోజు తరువాత కూడా తిరిగి రాకపోతే... వారు ప్రాణాలు కోల్పోయినట్టేనని స్థానికులు భావిస్తారు.



శాశ్వత పరిష్కారం కోసం...

గంగా నది ఎగువ నుంచి కొట్టుకువచ్చే మృతదేహాల ద్వారా ఈ ప్రాంతంలోని పులులు నరమాంస భక్షణకు అలవాటుపడ్డాయి. ఆ నది మీద ఆనకట్ట కట్టడంతో.. మృతదేహాలు కొట్టుకురావడం ఆగిపోయింది. దీంతో పులులు నరమాంసం కోసం వెతుక్కుంటూ దీవుల మీదకు వచ్చి పడుతున్నాయి. దీవుల్లోని తెగలకు భద్రత కరువయింది. పైగా లోతట్టు ప్రాంతాల్లో సంచారంపై ఆంక్షలు ఉండడంతో... ఇక్కడ మరణించినవారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా రాదు. సంపాదించే వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగానే కాదు, సామాజికంగా కూడా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వారికి అండగా నిలవాలని, బతికే దారి చూపించాలని అనుకున్నాను. వారి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఉపాధి మార్గాలను చూపించాలని నిర్ణయించుకున్నాను.

వారి శ్రమ ఫలించింది...

ముందుగా స్థానికులతో, కొందరు స్వచ్ఛంద సేవకులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాను. వారు బాధితుల వివరాలతో ఒక జాబితా తయారు చేశారు. ఆ కుటుంబాల అవసరాలు, వారికి కలిగిన నష్టం తీవ్రతలను పరిగణనలోకి తీసుకొని... వందమంది మహిళలను ఎంపిక చేశాం. వారి ఇళ్ల ముందే చేపల మడుగుల ఏర్పాటుకు, మేకలు, గొర్రెల పెంపకానికి ఆర్థిక సాయం చేశాం. మడుగుల తవ్వకం, వెదురుతో ఆక్సిజన్ పైపుల్ని తయారు చేసి, వాటిని కొలనుల్లో ఉపయోగించడం లాంటివి నేర్పించాం. కొద్ది నెలల్లోనే ఆ మహిళల శ్రమ ఫలితాన్ని ఇచ్చింది. స్థిరమైన ఆదాయం సంపాదించడం మొదలయింది. ఇప్పటికి 500 మందికి పైగా మహిళలు చేపలు, పశువుల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. వాటి మార్కెటింగ్ బాధ్యతలను కూడా మేమే చూస్తున్నాం. ఇప్పుడు ఆ కుటుంబాల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గౌరవమైన జీవితం గడుపుతున్నామనే సంతృప్తి వారిలో కనిపిస్తోంది."

కళ్లముందే చంపాడు!

(మొదటిపేజీ తరువాయి)


ప్రేమ్ సాగర్ (ఫైల్)

ఈ విషయాలు వెల్లడించాడు. తన కళ్ల ముందే జరిగిన ఆ హత్యలను ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నానని వాపోయాడు. తనను వెంటనే దుబాయ్ నుంచి తన స్వగ్రామానికి పంపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, దుబాయ్‌లోని భారత ఎంబసీ అధికారులకు అతడు విజ్ఞప్తి చేస్తున్నాడు. సాగర్ తల్లిదండ్రులు సైతం... అతణ్ని క్షేమంగా వెనక్కి రప్పించాలని అధికారులను, నాయకులను వేడుకుంటున్నారు. కాగా.. ఈ దుర్ఘటనలో అష్టపు ప్రేమ్‌సాగర్‌తోపాటు ప్రాణాలు కోల్పోయిన మరో వ్యక్తి జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్ (43) కొన్నేళ్ల క్రితమే ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. శ్రీనివాస్‌కు భార్య జమున, కుమారులు చందు, సూర్య, తల్లి రాజవ్వ ఉన్నారు. భార్య జమున అతడు దుబాయ్‌కి వెళ్లకముందే.. అతడితో గొడవపడి ఇద్దరు కుమారులతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నట్టు సమాచారం. అతడి తల్లి రాజవ్వకు శ్రీనివాస్ మృతి గురించి కుటుంబసభ్యులు ఇంకా తెలపలేదు.

చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడి..

అష్టపు ప్రేమ్‌సాగర్‌కు 12 ఏళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన ప్రమీలతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు.. విష్ణు, సహస్ర. ప్రేమ్‌సాగర్ తల్లిదండ్రులు ఫకీల్, లక్ష్మి వ్యవసాయ కూలీలు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రేమ్‌సాగర్ 2006లో ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. చివరిసారిగా రెండున్నర ఏళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. హత్య జరిగిన రోజు (గత శుక్రవారం) ప్రేమ్‌సాగర్ తన భార్య ప్రమీలకు ఫోన్ చేసి.. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీలకు ధైర్యం చెప్పి.. ఎలాంటి టెన్షన్ పెట్టుకోవద్దని, త్వరలోనే తాను తిరిగి వచ్చేస్తానని.. కుటుంబ ఆర్థిక వ్యవహారాలన్నీ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించాడు. కాగా.. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీలకు ప్రేమ్‌సాగర్ మృతి గురించి చెబితే తట్టుకోలేక ఆమెకు ఏమైనా అవుతుందన్న భయంతో.. కుటుంబసభ్యులు ఆ విషయం ఇంకా ఆమెకు చెప్పలేదు.

మృతదేహాలను రప్పించండి..

ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ మృతదేహాలను వీలైనంత త్వరగా వెనక్కి తీసుకురావడంలో సహకరించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌కు.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దుబాయ్‌లో ఇద్దరు తెలంగాణ వాసులు హత్యకు గురయ్యారన్న వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. కిషన్‌రెడ్డి విజ్ఞప్తికి జైశంకర్ వెంటనే స్పందించారు. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ అధికారులు జైశంకర్ ఆదేశాల మేరకు సత్వరం రంగంలోకి దిగారు. 'బుర్ దుబాయ్ పోలీస్ స్టేషన్'కు వెళ్లి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ దారుణం కిందటి శుక్రవారం జరిగిందని.. 'ఉద్దేశపూర్వక హత్యకేసు' నమోదు చేశామని మన అధికారులకు అక్కడి పోలీసులు తెలిపారు. స్థానిక బేకరీలో పనిచేస్తున్న ఓ పాకిస్థానీ వ్యక్తి ఇద్దరు తెలంగాణవాసులను నరికిచంపాడని.. మరో ఇద్దరిని గాయపరిచాడని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇంకా సిద్ధం కాలేదని.. అది రాగానే మృతదేహాలను స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని భారత అధికారులు వారికి విజ్ఞప్తి చేశారు. ఇక.. ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం ఫోన్ చేసి పరామర్శించారు. వారికి సానుభూతి తెలిపారు. ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ మృతదేహాలను వీలైనంత త్వరగా భారత్‌కు రప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులతో మాట్లాడి మృతదేహాలను రప్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు వారితో సమన్వయం చేసుకోవాలని కేంద్ర హోం శాఖ అధికారులను బండి సంజయ్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా.. వారి మృతదేహాలను ఇక్కడికి తరలించే ఏర్పాట్లు చేయాలంటూ ఢిల్లీలోని దుబాయ్ ఎంబసీకి లేఖ రాసింది.

వరదొస్తే పోలవరం వల్లేనా?

- ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుంటే బ్యాక్‌వాటర్‌కు ఆస్కారం ఎక్కడిది?
- పీపీఏ భేటీలో తెలంగాణపై ఏపీ ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద వస్తే పోలవరం ప్రాజెక్టు వల్లేనంటూ నిందలేస్తారా అని తెలంగాణను ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. మంగళవారం హైదరాబాద్‌లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన పోలవరం ఎత్తుపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఏపీ తరఫున పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జల వివాదాల విభాగం సీఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు. పోలవరం నిర్మాణంతో బూర్గంపాడు గ్రామం 2020-22 వరదల సమయంలో ముంపునకు గురైందని తెలంగాణ ప్రస్తావించింది. అప్పటికి ప్రాజెక్టు పూర్తికాలేదని.. నీటిని నిల్వ కూడా చేయలేదని.. అలాంటప్పుడు బ్యాక్‌వాటర్ వరదకు ఆస్కారం ఎక్కడిదని ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. నదీపరివాహక ప్రాంతంలో వరదలు రావడం సహజమని.. గోదావరికి వరద వస్తే అది పోలవరం వల్లేనంటూ నిందలు వేయడం అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కిన్నెరసాని, ముద్దేరు వాగు వద్ద సర్వే చేయాలని తెలంగాణ కోరగా.. ప్రాజెక్టు రెండో దశలో 45.72 మీటర్ల గరిష్ఠ కాంటూరులో నీటిని నిల్వ చేసే సమయంలో మార్కింగ్ చేస్తామని వారు తేల్చిచెప్పారు.

రికార్డుల్లో 51.. ఉన్నది 25..


- సమస్యలతో హాస్టల్‌కు రాని విద్యార్థినులు
- తుంగతుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏసీబీ తనిఖీల్లో గుర్తింపు


రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

తుంగతుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులు 51 మంది.. హాస్టల్‌లో ఉన్నది 25 మందే.. పక్కనే ఉన్న బడికి వస్తున్నా, వసతి గృహం ముఖం చూడటం లేదు. పేరుకు అందరి పేర్లూ ఉంటున్నా.. రికార్డులేవీ సరిగా లేవు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏసీబీ చేసిన తనిఖీల్లో వెల్లడైన తతంగం ఇది. హాస్టల్‌కు వచ్చే నిధులు దుర్వినియోగం అవుతున్నాయని తనిఖీల అనంతరం అధికారులు తెలిపారు. కానీ అక్కడ నెలకొన్న సమస్యలతో వసతి గృహానికి విద్యార్థులు రావడం లేదని పేర్కొన్నారు.

తెల్లవారుజామునే తనిఖీలు చేపట్టి..

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు చేపట్టాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు తుంగతుర్తి హాస్టల్‌కు చేరుకున్నారు. ఆడిటర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లతో కలసి తనిఖీలు చేశారు. అనంతరం నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ మాట్లాడారు. వసతి గృహం రికార్డుల్లో ఉన్న సంఖ్యలో విద్యార్థులు, సిబ్బంది లేరని గుర్తించామని చెప్పారు. 51 మంది విద్యార్థులు ఉంటున్నట్టు రిజిస్టర్‌లో ఉండగా.. 25మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రిజిస్టర్‌లో పేర్లున్న మిగతా 26మంది విద్యార్థినులు పాఠశాలకు వెళుతున్నా.. హాస్టల్‌లో ఉండకుండా, స్థానికంగా ఉన్న తమ ఇళ్లకే వెళుతున్నట్టు గుర్తించామని చెప్పారు. దీనిపై విద్యార్థులను ప్రశ్నిస్తే.. సరైన బెడ్లు లేవని, సమీపంలో శ్మశానం వల్ల భయాందోళనతో రాత్రి అక్కడ నిద్రించడం లేదని తెలిపారని వెల్లడించారు. సరైన గాలి, వెలుతురు లేక ఆహార పదార్థాలకు పురుగులు పడుతున్నాయని, ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. రికార్డులు సరిగా లేవని, హాస్టల్‌కు వచ్చే బడ్జెట్ దుర్వినియోగం అవుతోందని తమ తనిఖీలో తేలిందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను తెలంగాణ ఏసీబీ డీజీకి అందజేస్తామన్నారు.


హాలియాలో ధాన్యంపై పట్టాలు కప్పుతున్న పోలీసులు

ఉదయం భగ భగలు..

మధ్యాహ్నం జల్లులు

- నేడు, రేపు కూడా పలు జిల్లాలకు వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పగటి పూట దాకా మాడు పగిలేలా ఎండ.. ఆపై ఒక్కసారిగా కమ్ముకొచ్చే మబ్బులు.. చూస్తుండగానే టప టపా చినుకులు.. వాన దంచి కొట్టాక మళ్లీ ఎండ.. ఇలా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం దాకా భిన్న వాతావరణం నెలకొంటోంది. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కరీంనగర్‌లో 42.3, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత వచ్చింది. మెదక్, ఆదిలాబాద్, పెద్దపల్లి, జనగామ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక శుక్రవారం నుంచి రాష్ట్రంలో ఎండ తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ రోజు నుంచి కొన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటే అవకాశం ఉందని పేర్కొంది. బుధ, గురు వారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. వడదెబ్బతో మంగళవారం ముగ్గురు చనిపోయారు. మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన బాదంపుడి సుశీల(57), కొత్తగూడ మండలం వేలుబెల్లిలో బాసాని మల్లమ్మ(65) వడదెబ్బతో మృతి చెందారు. కాళేశ్వరం ఆలయానికి వచ్చి.. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన కాంపెల్లి కనకయ్య(72) చనిపోయాడు.

పలు జిల్లాల్లో మోస్తరు వానలు..

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా.. సాయంత్రం అక్కడక్కడా ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. నవాబ్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు 180 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కోయిలకొండ మండలంలో గాలి, వడగళ్ల వానతో కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. రోడ్లపై, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. హన్వాడ మండలం దాచకపల్లిలో పిడుగుపాటుకు రెండు గేదెలు చనిపోయాయి. రంగారెడ్డి జిల్లాలో ఉదయం నుంచి ఎండ దంచి కొట్టగా మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో వర్షం పడింది. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారి పల్లిలో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగి పడి ఇద్దరు బాలురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. యాచారం మండలంలో 200 ఎకరాల్లో వరి, 35 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఈదురు గాలులకు చెట్లు నేలకూలాయి. కొందుర్గు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 1.4 సెం.మీ, తాళ్లపల్లిలో 1.3 సెం.మీ, మేడ్చల్ మల్కాజిగిరి మండలం ఘట్‌కేసర్‌లో 1 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లోని బండ్లగూడ ఇందిరానగర్‌లో 1.7 సెం.మీ, చాంద్రాయణగుట్టలో 1.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. నగరంలో మరో రెండు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.


రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం దేవునిపల్లిలో ఈదురుగాలులకు నేలకొరిగిన బొప్పాయి తోట

రైతు కోసం.. మేము సైతం

నిత్యం శాంతి భద్రతలను పర్యవేక్షించే పోలీసులు రైతు కష్టం చూసి చలించిపోయారు. అకాల వర్షంతో ధాన్యం తడుస్తుండటం చూసి.. వాహనం దిగి పట్టాలు కప్పి రైతుకు ఆసరాగా నిలిచారు. మంగళవారం సాయంత్రం నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట శివారులో ఈ ఘటన జరిగింది. నల్లగొండ స్పెషల్ టీం పోలీసులు నిడమనూరు మండలం బొక్కమంతలపాడులో విధులకు వెళ్లి తిరిగి హాలియాకు బయలుదేరారు. అదే సమయంలో చినుకులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెంది ధాన్యంపై పట్టాలు కప్పుతుండగా, అటుగా వస్తున్న పోలీసులు అక్కడ ఆగి రైతులకు సహాయం చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఈ సమ్మర్ బ్లాక్‌బస్టర్ ఇదే



తమన్నా, హెబ్బా పటేల్, వశిష్ఠ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘనవిజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ చిత్రానికి దర్శకుడు సంపత్‌నంది కథను అందించి దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమా ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా మ్యాజిక్ చేస్తుందనే నమ్మకముంది. ఈ సమ్మర్ బ్లాక్‌బస్టర్ ఇదే అవుతుందనిపిస్తోంది" అని అన్నారు. "ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని ఇచ్చే చిత్రమిది" అని సంపత్ నంది చెప్పారు. "ఇందులో నేను పోషించిన పాత్ర నా కెరీర్‌లోనే ప్రత్యేకమైనది" అని తమన్నా భాటియా తెలిపారు. "మంచికీ చెడుకూ మధ్య జరిగే యుద్ధం ఈ సినిమా. ప్రేక్షకుల అంచనాలను అందుకుంటుంది" అని మధు అన్నారు. "మునుపెన్నడూ చూడని విజువల్స్ ఈ సినిమాలో ఉండబోతున్నాయి" అని అశోక్‌తేజ చెప్పారు.

ఘనవిజయం సాధిస్తుంది




సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించారు. ఈనెల 18న విడుదలవుతున్న సందర్భంగా సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా మీడియాతో ముచ్చటించారు. "ఇది కల్యాణ్‌రామ్ బాడీలాంగ్వేజ్‌కు తగ్గ కథ. ఆయన కోసమే ప్రత్యేకంగా మాస్ అంశాలు పుష్కలంగా ఉండేలా తెరకెక్కించిన సినిమా. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, మాస్ ప్రేక్షకుల చేత విజిల్స్ వేయించే పోరాట ఘట్టాలు ఈ సినిమాకు ప్రధానాకర్షణ. ఫైనల్ అవుట్‌పుట్ చూశాం, సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకముంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు. పెట్టిన ప్రతీ రూపాయి తిరిగివస్తుందన్న నమ్మకం ఉంది. ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాల్లో బెస్ట్ క్లైమాక్స్ ఇదే" అని సునీల్ బలుసు అన్నారు. "విజయశాంతి రోల్ ఈ సినిమాకు చాలా కీలకం. ఆమెకూ హీరోకూ మధ్య వచ్చే సన్నివేశాలన్నీ అద్భుతంగా వచ్చాయి. ప్రదీప్ చాలా ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రామ్‌ప్రసాద్ విజువల్స్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయి. సెకండాఫ్ చాలా రేసీగా ఉంటుంది. ఒక్క క్షణం కూడా ప్రేక్షకులు చూపు తిప్పరు" అని అశోక్‌వర్ధన్ ముప్పా చెప్పారు.



'వేవ్స్ బజార్'

వినోద రంగంలో మన 'లగాన్'!

ముంబైలో ప్రపంచ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు- కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు, జ్యూరీ సభ్యుడు ఆమీర్‌ఖాన్ అందించిన వ్యాసం... చిత్రజ్యోతికి ప్రత్యేకం



అమీర్‌ఖాన్

ప్రపంచవ్యాప్తంగా వినోద, మీడియా పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధిలో మన దేశం కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆకర్షణీయమైన కథనాలతో పాటుగా అత్యాధునిక సాంకేతికత ద్వారా వచ్చే ఆవిష్కరణలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. దీనికి అనుగుణంగానే అనేక స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ లభ్యమవుతోంది. స్థానిక భాషల్లో కంటెంట్ లభ్యమవడాన్ని కూడా మనం చూస్తున్నాం. వినోదాన్ని అందించే రంగం మాత్రమే కాకుండా సాంస్కృతికంగా, ఆర్థికంగా, అంతర్జాతీయ సంబంధాల విషయంలోనూ కీలక భూమిక పోషించనుంది. ఈ నేపథ్యంలో- వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు- ముంబైలో ప్రపంచ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో 'వేవ్స్ బజార్' ఒక ముఖ్యమైన భాగం.

వేవ్స్ బజార్ అంటే..

నేను బాలీవుడ్‌లో గత కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్నా. వినోదంతో పాటుగా సాంకేతికతో సంబంధమున్న పరిశ్రమ ఇది. ప్రజలందరికీ ఏకీకృతం చేసి.. ముందుకు నడిపించగలిగిన శక్తి కథలకు మాత్రమే ఉందని నేను నమ్ముతాను. ప్రపంచ వినోద పరిశ్రమకు ఒక దిశను చూపించటంలో వేవ్స్ బజార్ కీలక భూమిక పోషిస్తుందని నేను భావిస్తున్నా. ప్రపంచవ్యాప్తంగా వినోద పరిశ్రమతో సంబంధం ఉన్న సాంకేతిక నిపుణులు, వాణిజ్యవేత్తలు, క్రియేటర్స్ అందరినీ ఒక తాటి మీదకు తీసుకువచ్చే ప్రయత్నమే వేవ్స్ బజార్. వీరందరూ ఆన్‌లైన్ పద్ధతిలో అనుసంధానమవుతారు. ఈ వేవ్స్ బజార్‌ను ఈ ఏడాది జనవరి 27వ తేదీన కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ అధికారికంగా ప్రారంభించారు. ఆర్థిక, వాణిజ్య రంగాలకు ప్రతి ఏడాది దావోస్‌లో జరిగే సమావేశాలు ఎంత కీలకమో.. వినోద రంగానికి ఈ వేవ్స్ సమావేశాలు అంత కీలకంగా మారాలనేది ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశం. దీనిలో సినిమాలకు, టెలివిజన్‌కు, రేడియోకి యానిమేషన్‌కు, గేమింగ్‌కు, ప్రకటనారంగానికి, సంగీత రంగానికి, సౌండ్ డిజైన్‌కు సంబంధించిన నిపుణులు అనుసంధానమవ్వచ్చు. తమ సృజనాత్మక ఉత్పత్తులను విక్రయించవచ్చు. లేదా కొనుగోలు చేయవచ్చు. దీనిని ప్రారంభించి మూడు నెలలు అయింది. దీనిలో సుమారు 5500 కొనుగోలుదారులు, 2000 మంది విక్రయదారులు, 1000కి పైగా ప్రాజెక్టులు నమోదయ్యాయి. దీర్ఘకాలంలో ఇది కంటెంట్‌కు సంబంధించిన ఒక నెట్‌వర్కింగ్ హబ్ అవుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ఉదాహరణకు ఒక ఫిల్మ్‌మేకర్ తనకు భాగస్వామి కావాలనుకుంటే దీనిలో వెతుక్కోవచ్చు. గేమ్స్‌ను రూపొందిస్తున్న యువ టెక్నీషియన్స్‌కు ఇందులో పెట్టుబడిదారులు దొరుకుతారు. ఆర్టిస్టులకు తాము నటించిన క్లిప్పింగ్స్ దీనిలో ప్రదర్శించుకొనే సౌలభ్యం ఉంటుంది. భౌగోళిక హద్దులు లేకుండా తమ సృజనాత్మకతను ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించుకోవటానికి వేదిక లభిస్తుంది.

ప్రత్యక్షంగా చూసే అవకాశం..

వేవ్స్ బజార్ కేవలం ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం. అయితే ఈ సారి జరుగుతున్న వేవ్స్ సమావేశంలో కొందరికి ఈ బజార్‌లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. భవిష్యత్‌లో వినోద రంగానికి సంబంధించిన నెట్‌వర్కింగ్ ఎలా ఉండబోతోందనే విషయాన్ని ఈ సారి వేవ్స్ బజార్ నిర్దేశిస్తుందనటంలో నాకు ఎటువంటి సందేహం లేదు. ఒక నటుడిగా నా సృజనాత్మకతకు హద్దులు ఉన్నాయని నేను భావించను. ప్రస్తుతం ఉన్న హద్దులను దాటి నన్ను నేను నిరూపించుకోవటానికి ఉన్న వేదికల కోసం అన్వేషిస్తూ ఉంటాను. వేవ్స్‌లో అలాంటి వేదిక లభించనున్నదని నా నమ్మకం. ఈ వేవ్స్ ప్రస్థానంలో నేను కూడా భాగస్వామిని అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఒక కథను చెప్పే తీరును వేవ్స్ మార్చేస్తుందని నేను భావిస్తున్నా. లగాన్ సినిమాలో బ్రిటిష్‌వారిపై స్థానికులు పట్టుదలతో ఆడి.. అనేక అడ్డంకులు దాటి విజయం సాధిస్తారు. వేవ్స్ కూడా మన దేశానికి అలాంటి లగాన్ మూమెంట్ అని నేను నమ్ముతున్నా.



రూ.5 కోట్లు పరిహారం చెల్లించాల్సిందే!

- అజిత్‌కుమార్ సినిమాకు ఇళయరాజా నోటీసులు

అజిత్‌కుమార్ హీరోగా రూపొందిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్ర నిర్మాతలు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని పేర్కొంటూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా నోటీసులు జారీ చేశారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఈ నెల 10వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. అయితే, గతంలో 'నాట్టుపురపాట్టు', సకలకళా వల్లవన్, 'విక్రమ్' సినిమాలకు తాను స్వరాలు సమకూర్చిన మూడు పాటలను ఈ మూవీలో తన అనుమతి లేకుండా రీ క్రియేట్ చేశారని ఇళయరాజా నోటీసుల్లో పేర్కొన్నారు. అందుకుగాను రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఆ పాటలను తొలగించడంతో పాటు నిర్మాతలు క్షమాపణ చెప్పాలని ఇళయరాజా పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

టారిఫ్..!

ట్రంప్ సుంకాల నష్టాల నుంచి పూర్తిగా కోలుకున్న భారత మార్కెట్

- మళ్లీ 23,300 ఎగువకి నిఫ్టీ
- ఒక్కరోజే రూ.10.57 లక్షల కోట్ల లాభం
- 2 సెషన్లలో రూ.18.42 లక్షల కోట్ల వృద్ధి



ముంబై: వరుసగా రెండో రోజూ భారీగా లాభపడిన భారత స్టాక్ మార్కెట్.. ట్రంప్ సుంకాల నష్టాల నుంచి పూర్తిగా కోలుకుంది. వాహన, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ సహా అన్ని రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జర పడంతో మంగళవారం సెన్సెక్స్ 1,577.63 పాయింట్ల (2.10 శాతం) లాభంతో 76,734.89 వద్దకు చేరింది. ఒకదశలో సూచీ 1,750.37 పాయింట్లు ఎగబాకి 76,907.63 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం 500 పాయింట్ల (2.19 శాతం) వృద్ధితో 23,328.55 వద్ద ముగిసింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను సుంకాల నుంచి మినహాయించిన ట్రంప్ సర్కారు.. వాహన రంగానికి టారిఫ్‌ల నుంచి తాత్కాలిక ఊరట కల్పిస్తామని సంకేతాలిచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ర్యాలీ తీశాయి. ఆర్‌బీఐ రెపో తగ్గింపుతో బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం దేశీయంగా వినియోగం పెరగడానికి దోహదపడనుందన్న ఆశాభావం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.10.57 లక్షల కోట్లు పెరిగి రూ.412.24 లక్షల కోట్ల(4.81 లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. గడిచిన రెండు సెషన్లలో మదుపరుల సంపద రూ.18.42 లక్షల కోట్లు పెరిగింది.

- సెన్సెక్స్ నమోదిత 30 కంపెనీల్లో హెచ్‌యూఎల్, ఐటీసీ మినహా అన్నీ రాణించాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ షేరు 6.84 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ స్టాక్ 4.50 శాతం చొప్పున పెరిగాయి. యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ కూడా 4 శాతానికి పైగా ఎగబాకాయి. మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.23 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.69 శాతం పెరిగాయి.
- బీఎస్ఈలో 3,266 కంపెనీల షేర్లు లాభపడగా.. 833 నష్టపోయాయి. మరో 157 యథాతథంగా ముగిశాయి. 91 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 30 పైసలు పెరిగి రూ.85.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతోపాటు ఈక్విటీ మార్కెట్లో లాభాలు మన కరెన్సీకి బలం చేకూర్చాయి.
- ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.50 పెరుగుదలతో ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.96,450 వద్దకు తిరిగి చేరుకుంది. కిలో వెండి రూ.2,500 ఎగబాకి రూ.97,500 ధర పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 3,224 డాలర్లు, సిల్వర్ 32.32 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

టారిఫ్ నష్టాలు భర్తీ

ఈ నెల 2న సెన్సెక్స్ 76,617.44 వద్ద, నిఫ్టీ 23,332.35 వద్ద ముగియగా.. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.412.98 లక్షల కోట్లుగా నమోదైంది. ఆ రోజు అర్ధరాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. కొన్ని రోజులకే టారిఫ్‌ల అమలును 90 రోజులు వాయిదా వేయడంతో పాటు ఆపై కొన్ని రంగాలకు మినహాయింపులు కల్పించారు. దాంతో గడిచిన రెండు వారాల్లో మార్కెట్ సూచీలు తొలుత భారీ పతనాలను, ఆపై భారీ లాభాలనూ చవిచూశాయి. మొత్తానికి సూచీలు సుంకాలతో తొలుత ఏర్పడిన నష్టాలను దాదాపుగా పూడ్చుకోగలిగాయి. ఈ నెల 2 నాటి ముగింపు స్థాయితో పోలిస్తే, మంగళవారం నాటికి సెన్సెక్స్ 117.45 పాయింట్ల (0.15 శాతం) లాభంతో 76,734.89 వద్దకు చేరింది. నిఫ్టీ మాత్రం మరో 5 పాయింట్ల చేరువలో ఉంది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ కూడా రూ.74,000 కోట్ల మేర పెరగాల్సి ఉంది.

ఏడాది చివరి నాటికి సెన్సెక్స్ @ 82,000

ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి సెన్సెక్స్ 82,000 స్థాయికి చేరుకోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. సూచీ ప్రస్తుత స్థాయితో పోలిస్తే, 9 శాతం అధికమిది. అయితే, ఇదే బ్రోకరేజీ సంస్థ సెన్సెక్స్ ఈ ఏడాది చివరినాటికి 93,000 స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేసింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో సెన్సెక్స్ టార్గెట్‌ను 12 శాతం మేర తగ్గిస్తున్నట్లు మోర్గాన్ స్టాన్లీ అనలిస్టులు రిధమ్ దేశాయ్, నయంత్ పరేఖ్ తాజా నోట్‌లో పేర్కొన్నారు.

దూసుకుపోయిన వాణిజ్య లోటు

2024-25లో రూ.24.04 లక్షల కోట్లు.. మార్చి ఎగుమతుల్లో స్వల్ప వృద్ధి



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం నాలుగు నెలల వరుస క్షీణతకు తెర దించింది. మార్చి నెలలో ఎగుమతులు 0.7% పెరిగి 4,197 కోట్ల డాలర్లకు (రూ.3.57 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు 2,154 కోట్ల డాలర్లకు (రూ.1.83 లక్షల కోట్లు) పెరిగింది. మార్చి నెలలో దిగుమతులు నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 11.3% వృద్ధితో 6,351 కోట్ల డాలర్లకు (రూ.5.40 లక్షల కోట్లు) చేరాయి. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఎగుమతులు 0.08 శాతం పెరిగి 43,742 కోట్ల డాలర్లకు (రూ.37.18 లక్షల కోట్లు) చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 6.62% పెరిగి 72,024 కోట్ల డాలర్లకు (రూ.61.22 లక్షల కోట్లు) చేరడంతో వాణిజ్య లోటు 28,282 కోట్ల డాలర్లుగా (రూ.24.04 లక్షల కోట్లు) నమోదయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది 24,114 కోట్ల డాలర్లు (రూ.20.50 లక్షల కోట్లు)గా ఉంది.

వస్తుసేవల ఎగుమతులన్నింటినీ కలిపితే 2024-25లో వాటి విలువ రికార్డు స్థాయిలో 82,093 కోట్ల డాలర్లకు (రూ.69.80 లక్షల కోట్లు) చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 77,813 కోట్ల డాలర్లతో (రూ.66.14 లక్షల కోట్లు) పోల్చితే ఇది 5.5% అధికం. ప్రపంచ స్థాయిలో పలు సవాళ్లు ఎదురైనప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తంలో వస్తు ఎగుమతులు జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ అన్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రెడీమేడ్ గార్మెంట్లు, బియ్యం, పత్తి, కాటన్ యార్న్/ఫ్యాబ్రిక్స్, ప్లాస్టిక్, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, టీ, పొగాకు ఎగుమతులకు ఉత్తేజంగా నిలిచాయి.

ఆరేళ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.34 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహార వస్తువుల ధరలు తగ్గడం ఇందుకు కారణం. 2019 ఆగస్టులో నమోదైన 3.28% తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయికి దిగి రావడం ఇదే ప్రథమం. ఇది ఫిబ్రవరిలో 3.61% ఉండగా గత ఏడాది మార్చిలో 4.85% ఉంది. మార్చిలో ఆహార ద్రవ్యోల్బణం 3.75 శాతానికి దిగి వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ రెపోరేటు నిర్ణయించేందుకు రిటైల్ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకుంటుంది గనుక రాబోయే రోజుల్లో వడ్డీ రేట్లు మరింతగా తగ్గించేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఇదిలా ఉండగా టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) కూడా మార్చి నెలలో 6 నెలల కనిష్ఠ స్థాయి 2.05 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, బంగాళాదుంపలు, ఇతర ఆహార వస్తువుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది.

10 నిమిషాల్లో ఇంటికి సిమ్ కార్డు

బ్లింకిట్‌తో ఎయిర్‌టెల్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతి ఎయిర్‌టెల్ మరో వినూత్న సర్వీసుకు శ్రీకారం చుట్టింది. కస్టమర్లు కోరిన 10 నిమిషాల్లో వారి ఇంటికి సిమ్ కార్డు పంపిస్తామని ప్రకటించింది. ఇందుకోసం క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'బ్లింకిట్' ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సేవ కోసం ఖాతాదారులు రూ.49 చెల్లించాలి. ప్రస్తుతం ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, హైదరాబాద్ వంటి 16 నగరాల్లో ఈ సర్వీసు లభిస్తుంది. త్వరలోనే మిగతా నగరాలు, పట్టణాలకూ ఈ సేవను విస్తరించబోతున్నట్టు తెలిపింది. ఈ పద్ధతిలో సిమ్ కార్డు అందుకున్న ఖాతాదారులు 15 రోజుల్లోగా తమ ఆధార్ సాయంతో తమ కనెక్షన్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

అమర రాజాతో అతుల్ గ్రీన్‌టెక్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ వాహనాల (ఈవీ)కు అవసరమైన బ్యాటరీలు, చార్జర్లను పెద్ద ఎత్తున తయారు చేసేందుకు అమర రాజా గ్రూప్ సిద్ధమవుతోంది. ఇందుకోసం అతుల్ ఆటో అనుబంధ కంపెనీ అతుల్ గ్రీన్‌టెక్‌తో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్ఈఎం) అనుబంధ సంస్థ అయిన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ), అమర రాజా పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ (ఏఆర్‌పీఎస్ఎల్) మధ్య ఒక త్రైపాక్షిక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అతుల్ గ్రీన్‌టెక్ త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఈపీ) బ్యాటరీలు, చార్జర్లను అమర రాజా గ్రూప్ కంపెనీలు అభివృద్ధి చేసి సరఫరా చేస్తాయి. ఈ ఒప్పందం అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్స్ అభివృద్ధికి కూడా వీలు కల్పిస్తుందని మూడు కంపెనీలు ప్రకటించాయి. ఈ బ్యాటరీలను అమర రాజా.. తెలంగాణలోని దివిటిపల్లి వద్ద ఉన్న తన గిగా కారిడార్‌లో తయారు చేస్తుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	130
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	95
కర్నూలు	130	నెల్లూరు	100
విశాఖపట్నం	124	అనంతపురం	100
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

జోస్ అలుక్కాస్ ఆత్మకథ 'గోల్డ్'

ఆవిష్కరించిన కేంద్ర మంత్రి సురేశ్ గోపి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఆభరణాల రిటైల్ విభాగంలో కేరళలోని త్రిసూర్ స్వర్ణ వారసత్వాన్ని విశ్వవ్యాప్తం చేయటంలో జోస్ అలుక్కాస్ చేసిన కృషి అమోఘమైనదని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. త్రిసూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ ఆత్మ కథ 'గోల్డ్'ను మంత్రి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ.. బంగారం వ్యాపారంలో త్రిసూర్‌కు ప్రత్యేకమైన చరిత్ర ఉందని, దాన్ని జోస్ అలుక్కాస్ కొనసాగించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం జోస్ అలుక్కాస్ మాట్లాడుతూ.. త్రిసూర్ నుంచి తాను వ్యాపారాన్ని ప్రారంభించి శాఖోపశాఖలుగా విస్తరించినట్లు చెప్పారు. తన 81 ఏళ్ల జీవితం వ్యక్తిగతమైనదే కాదని, భారతీయ ఆభరణాల వ్యాపార చరిత్ర కూడా అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోజోస్ అలుక్కాస్ ప్రచారకర్త ఆర్ మాధవన్, కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కే రాజన్, ఉన్నత విద్యా శాఖ మంత్రి ఆర్ బిందు సహా జోస్‌అలుక్కాస్ ఎండీలు వర్గీస్ అలుక్కాస్, పాల్ జే అలుక్కాస్, జాన్ అలుక్కాస్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంటింగ్ తప్పుల భారం రూ.1,979 కోట్లు

ఇండస్ఇండ్ బ్యాంక్

న్యూఢిల్లీ: డెరివేటివ్ పెట్టుబడుల విలువ లెక్కింపులో జరిగిన తప్పులు ఇండస్ఇండ్ బ్యాంక్‌ను బాగానే దెబ్బకొట్టింది. ఈ తప్పుల ఫలితంగా గత ఏడాది జూన్ నెలాఖరు నాటికి తమ నెట్‌వర్త్‌కు రూ.1,979 కోట్ల మేర గండి పడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇది బ్యాంకు మొత్తం నెట్‌వర్త్‌లో 2.35 శాతానికి సమానమని పేర్కొంది. దీనికి సంబంధించి బ్యాంక్ నియమించిన పీడబ్ల్యూసీ ఇప్పటికే తన నివేదికను ఇండస్ఇండ్‌కు సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్టు తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,180 ▼	87,200 ▼	1,09,800 ▼
విజయవాడ	96,500 ▼	90,000 ▼	98,000 ▼
విశాఖపట్నం	93,490 ▼	85,700 ▼	95,420 ▲
రాజమండ్రి	95,130 ▼	87,200 ▼	98,200 ▲
ప్రొద్దుటూరు	92,900 ▼	85,470 ▼	97,900 ▲
ముంబై	93,102 ▼	85,281 ▼	95,030 ▲

స్పోర్ట్స్

సన్నీ.. ఎంత మంచి మనసో!



కాంబ్లీకి నెలకు రూ. 30వేల ఆర్థిక సాయం

ముంబై: మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి సునీల్ గవాస్కర్ చాంప్స్ ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఈ ఏప్రిల్ నుంచి ప్రతి నెలా కాంబ్లీకి రూ.30 వేల ఆర్థిక సాయం, వైద్య ఖర్చుల నిమిత్తం ఏటా మరో రూ.30 వేలు ఇవ్వనున్నట్టు ఫౌండేషన్ తెలిపింది. మాజీ క్రీడాకారులకు సాయం చేసేందుకు ఈ స్వచ్ఛంద సంస్థను 1999లో గవాస్కర్ స్థాపించాడు. గత జనవరిలో జరిగిన వాంఖడే స్టేడియం 50వ వార్షికోత్సవం సందర్భంగా గవాస్కర్‌ను కాంబ్లీ కలిశాడు. అప్పుడు కాంబ్లీకి సాయం చేస్తానని ఇచ్చిన మాటను గవాస్కర్ నెరవేర్చాడు. ఇక, గత డిసెంబరులో మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో కాంబ్లీ రెండు వారాల పాటు ఆస్పత్రిలో చికిత్స తీసుకొని, కోలుకోవడం తెలిసిందే.



ఈ వయసులోనూ.. ఇదేం మ్యాజిక్ అన్నా?

ధోనీ త్రోపై నెట్టింట ప్రశంసల జల్లు

లఖ్‌నవూ: ఈ ఐపీఎల్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నై సూపర్‌కింగ్స్‌కు సోమవారం లఖ్‌నవూ జట్టుపై విజయం ఎంతో ఊరటనిచ్చింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ తనదైన స్టయిల్లో చేసిన మ్యాజిక్ మరోసారి అభిమానులను అలరించింది. లఖ్‌నవూ బ్యాటింగ్ చివరి ఓవర్‌లో అబ్దుల్ సమద్‌ను రనౌట్ చేసిన తీరు.. వహ్వా అనిపించింది. ఆ ఓవర్ రెండో బంతిని బౌలర్ పథిరన వైడ్‌గా వేశాడు. స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న సమద్ నాన్ స్ట్రయిక్ ఎండ్‌లోకి పరుగు కోసం ప్రయత్నించాడు. దీన్ని గుర్తించిన వికెట్‌కీపర్ ధోనీ.. వికెట్ల వెనకాల నుంచి గ్లోవ్స్‌తోనే బంతిని విసిరి నాన్ స్ట్రయికర్ ఎండ్‌లోని వికెట్లను పడగొట్టాడు. స్టంప్స్‌ను సరిగా చూడకుండానే.. వాటికి మహీ గురిపెట్టిన ఈ అద్భుతమైన ఫీట్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరలవుతోంది. '43 ఏళ్ల వయసులోనూ ఇదెలా సాధ్యం?.. గ్లోవ్స్ వేసుకొని కూడా అలా ఎలా రనౌట్ చేశావ్ అన్నా..' అంటూ ధోనీ కీపింగ్ సామర్థ్యంపై నెట్టింట ప్రశంసల జల్లు కురుస్తోంది. మహీ మ్యాజిక్‌కు లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ కూడా ఫిదా అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత అలా ఎలా రనౌట్ చేశావు? అని ధోనీని పంత్ సరదాగా అడిగాడు. 'వికెట్లను చూశా. అలా విసిరానంతే..! తగిలితే తగులుతుంది.. లేకపోతే లేదు' అని ధోనీ నవ్వుతూ బదులిచ్చాడు.

మల్లీశ్వరిని చూసి దేశం గర్విస్తోంది

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ట్వీట్



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): వెయిట్‌లిఫ్టర్‌గా కరణం మల్లీశ్వరి సాధించిన విజయాలను చూసి దేశం గర్విస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువ అథ్లెట్లకు మార్గనిర్దేశనం చేసేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయమని మంగళవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. యమునానగర్ పర్యటన సందర్భంగా ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరితో భేటీ అయినట్టు మోదీ తెలిపారు.

షూటింగ్‌లో సౌరభ్‌కు కాంస్యం

లీమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో షూటర్ సౌరభ్ చౌధరి భారత్‌కు కాంస్య పతకం అందించాడు. మంగళవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సౌరభ్ 219.1 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకొన్నాడు.

ఆగస్టులో బంగ్లా టూర్‌కు..

టీమిండియా షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఆగస్టు 17 నుంచి 31 వరకు మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లు జరుగనున్నాయి. అలాగే బంగ్లాదేశ్ గడ్డపై టీ20 సిరీస్ ఆడడం భారత్‌కిదే మొదటిసారి. మొత్తం 6 మ్యాచ్‌లు మీర్పూర్, చట్టోగ్రామ్‌లో నిర్వహించనున్నారు. మరోవైపు ఈ సిరీస్ కంటే ముందు జూన్‌లో భారత జట్టు ఇంగ్లండ్‌తో 5 టెస్టులు ఆడనుంది. ఈనేపథ్యంలో యువ ఆటగాళ్లకు బంగ్లాతో సిరీస్‌ల్లో ఆడే అవకాశం రావచ్చు. ఇక రెండు జట్లు గతేడాది చివరిసారిగా తలపడినప్పుడు టెస్టు సిరీస్‌ను 2-0తో, టీ20 సిరీస్‌ను 3-0తో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.

పంజాబ్.. బల్లే బల్లే

స్వల్ప స్కోరును కాపాడుకున్న కింగ్స్

చాహల్ చమక్ ● కోల్‌కతాకు భంగపాటు



చాహల్ (4/28)

1 ఐపీఎల్ చరిత్రలో తక్కువ స్కోరు (111)ను కాపాడుకున్న జట్టుగా పంజాబ్.

చండీగఢ్: ధనాధన్ ఫార్మాట్‌లో నిజంగా ఇది అద్భుతమే. 200కి పైగా స్కోర్లు చేసినా గెలవడంపై సందేహాలు నెలకొన్న వేళ.. లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను ఉర్రూతలూగించింది. తమ చివరి మ్యాచ్‌లో 245 పరుగులు బాదినా పంజాబ్ కింగ్స్ ఓడిన విషయం తెలిసిందే. కానీ మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 111 రన్స్ మాత్రమే సాధించి.. తమ బౌలర్ల ప్రతిభతో కాపాడుకున్న తీరు మాత్రం ఔరా.. అనిపించక మానదు. భీకర బ్యాటింగ్ లైనప్ కలిగిన కేకేఆర్‌కు ముకుతాడు వేసిన స్పిన్నర్ చాహల్ (4/28) గేమ్‌చేంజర్‌గా నిలిచాడు. చివర్లో రస్సెల్ (17) కాస్త భయపెట్టినా పంజాబ్ 16 పరుగుల తేడాతో అపూర్వ విజయం దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 15.3 ఓవర్లలో 111 పరుగులకు కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 30), ప్రియాన్ష్ ఆర్య (12 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 22), శశాంక్ సింగ్ (17 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 18) మాత్రమే రాణించారు. ఆ తర్వాత ఛేదనలో కోల్‌కతా 15.1 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. రఘువంశీ (37), రహానె (17) ఆకట్టుకున్నారు. జాన్సెన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా చాహల్ నిలిచాడు.

పంజాబ్ మాయ: 112 పరుగుల ఛేదనను కోల్‌కతా సునాయాసంగా ముగిస్తుందనే అంతా భావించారు. కానీ పంజాబ్ బౌలర్లు కూడా అదరగొట్టారు. ముఖ్యంగా స్పిన్నర్ చాహల్ కేకేఆర్‌ను బెదరగొట్టాడు. తొలి రెండు ఓవర్లలో ఓపెనర్లు నరైన్ (5), డికాక్ (2) వికెట్లను కోల్పోవడంతోనే పంజాబ్ విజయంపై ఆశలు పెరిగాయి. కానీ రఘువంశీ, రహానె నిలకడగా ఆడడంతో కోల్‌కతా గెలుపుపై ఎవరికీ సందేహం కలుగలేదు. ఇద్దరూ ఎలాంటి ఇబ్బంది లేకుండా బౌండరీలతో ముందుకు సాగారు. అయితే 8వ ఓవర్‌లో రహానెను చాహల్ ఎల్బీ చేయడంతో ఒక్కసారిగా మ్యాచ్ మలుపు తిరిగింది. వాస్తవానికి రహానె రివ్యూ కోరుకుంటే ఫలితం అతడికి అనుకూలంగానే వచ్చేది. ఇక ఆ తర్వాత పంజాబ్ బౌలర్ల హవా సాగింది. ధాటిగా ఆడుతున్న రఘువంశీని కూడా చాహల్ అవుట్ చేయగా, వెంకటేశ్ అయ్యర్ (7)ను మాక్స్‌వెల్ ఎల్బీ చేయడంతో కేకేఆర్‌లో వణుకు ఆరంభమైంది. దీనికి తోడు చాహల్ ఒకే ఓవర్‌లో రింకూ (2), రమణ్‌దీప్ (0)లను అవుట్ చేసి ఒక్కసారిగా ఆశలు రెట్టింపు చేశాడు. ఓ దశలో కేకేఆర్ 79/8 స్కోరుతో నిలిచింది. అప్పటికి 42 బంతుల్లో 33 పరుగులు కావాల్సి ఉండగా.. 14వ ఓవర్‌లో రస్సెల్ విరుచుకుపడ్డాడు. అప్పటివరకు మూడు ఓవర్లలో నాలుగు వికెట్లు తీసిన చాహల్ ఈ ఓవర్‌లో 6,6,4తో 16 రన్స్ సమర్పించుకున్నాడు. దీంతో కేకేఆర్‌పై ఒత్తిడి తగ్గడంతో పంజాబ్ ఆశలు గల్లంతే అనిపించింది. అయినా పట్టు విడువకుండా 15వ ఓవర్‌లో అర్ష్‌దీప్ మెయిడిన్ వికెట్ తీయగా.. ఆ వెంటనే రస్సెల్‌ను జాన్సెన్ బౌల్డ్ చేయడంతో స్టేడియంలో పంజాబ్ సంబరాలు మిన్నంటాయి.

వికెట్లు టపటపా..: బ్యాటింగ్‌కు అనుకూలిస్తుందనుకున్న పిచ్‌పై కోల్‌కతా బౌలర్లు అద్భుతం చేశారు. భారీ స్కోరు ఆలోచనలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్ జట్టు వీరి ధాటికి ఉక్కిరిబిక్కిరైంది. తమ చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై 245 రన్స్ సాధించిన కింగ్స్ ఈసారి ఓ దశలో వంద పరుగులకైనా చేరుతుందా? అనిపించింది. మొదట ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య ఆడిన తీరుకు.. ఆ తర్వాత మైదానంలో వికెట్ల జాతరకు సంబంధం లేకుండా పోయింది. ప్రతీ బ్యాటర్ భారీ షాట్లకు వెళ్లి మూల్యం చెల్లించుకున్నారు. 36 పరుగుల వ్యవధిలోనే పంజాబ్ చివరి ఆరు వికెట్లను కోల్పోవడం గమనార్హం. ఎనిమిదో నెంబర్ బ్యాటర్ శశాంక్ సింగ్ (18) కాస్త పోరాడినా అది కూడా కాసేపే అయ్యింది. రెండో ఓవర్‌లో ప్రియాన్ష్ రెండు ఫోర్లతో టచ్‌లోకి రాగా.. తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4,6,4, ఆర్య 4తో పేసర్ వైభవ్ అరోరా 20 పరుగులిచ్చుకున్నాడు. ఆ సమయంలో 3 ఓవర్లలోనే 33 పరుగులతో అత్యంత పటిష్ఠంగా కనిపించిన కింగ్స్ జట్టు ఆ తర్వాత పేకమేడలా కుప్పకూలింది. నాలుగో ఓవర్‌లో ప్రియాన్ష్, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (0)ల వికెట్లు పడగొట్టి పేసర్ హర్షిత్ పంజాబ్‌ను తొలి దెబ్బ కొట్టాడు. ఆ వెంటనే ఇన్‌గ్లిస్ (2)ను వరుణ్ అవుట్ చేయగా.. ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ రెండు సిక్సర్లతో ధాటిని కనబర్చాడు. కానీ అదే ఓవర్ ఆరో బంతికి హర్షిత్‌కే ప్రభ్‌సిమ్రన్ చిక్కడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 55/4తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత స్పిన్నర్లు వరుణ్, సునీల్ నరైన్ చకచకా వికెట్లు తీయడంతో ఓ దశలో 86 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఇలాంటి పరిస్థితిలో శశాంక్-బార్ట్‌లెట్ (11) మధ్య తొమ్మిదో వికెట్‌కు 23 పరుగులు జత చేరడంతో స్కోరు వంద దాటింది. కానీ 16వ ఓవర్‌లోనే వీరిద్దరూ అవుట్ కావడంతో పంజాబ్ ఆట ముగిసింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 30, శ్రేయాస్ అయ్యర్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 0, ఇంగ్లిస్ (బి) వరుణ్ 2, నేహల్ (సి) వెంకటేశ్ (బి) నోకియా 10, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7, సూర్యాంశ్ (సి) డికాక్ (బి) నరైన్ 4, శశాంక్ (ఎల్బీ) వైభవ్ 18, జాన్సెన్ (బి) నరైన్ 1, బార్ట్‌లెట్ (రనౌట్) 11, అర్ష్‌దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 15.3 ఓవర్లలో 111 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-39, 2-39, 3-42, 4-54, 5-74, 6-76, 7-80, 8-86, 9-109, 10-111; **బౌలింగ్:** వైభవ్ అరోరా 2.3-0-26-1, నోకియా 3-0-23-1, హర్షిత్ రాణా 3-0-25-3, వరుణ్ చక్రవర్తి 4-0-21-2, నరైన్ 3-0-14-2.

కోల్‌కతా: డికాక్ (సి) సూర్యాంశ్ (బి) బార్ట్‌లెట్ 2, నరైన్ (బి) జాన్సెన్ 5, రహానె (ఎల్బీ) చాహల్ 17, రఘువంశీ (సి) బార్ట్‌లెట్ (బి) చాహల్ 37, వెంకటేశ్ అయ్యర్ (ఎల్బీ) మ్యాక్స్‌వెల్ 7, రింకూ సింగ్ (స్టంప్డ్) ఇంగ్లిస్ (బి) చాహల్ 2, రస్సెల్ (బి) జాన్సెన్ 17, రమణ్‌దీప్ (సి) శ్రేయాస్ (బి) చాహల్ 0, హర్షిత్ (బి) జాన్సెన్ 3, వైభవ్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 0, నోకియా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 15.1 ఓవర్లలో 95 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-62, 4-72, 5-74, 6-76, 7-76, 8-79, 9-95, 10-95; **బౌలింగ్:** జాన్సెన్ 3.1-0-17-3, బార్ట్‌లెట్ 3-0-30-1, అర్ష్‌దీప్ 3-1-11-1, చాహల్ 4-0-28-4, మ్యాక్స్‌వెల్ 2-0-5-1.

నేటి మ్యాచ్

ఢిల్లీ x రాజస్థాన్ — వేదిక: ఢిల్లీ — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	6	4	2	0	8	1.081
ఢిల్లీ	5	4	1	0	8	0.899
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	6	2	4	0	4	0.104
రాజస్థాన్	6	2	4	0	4	-0.838
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

సాత్విక్ జోడీ వచ్చేసింది!

- గాయత్రి జంట దూరం
- 'సుదిర్మన్' ఫైనల్స్‌కు భారత జట్టు



న్యూఢిల్లీ: సుదిర్మన్ కప్ ఫైనల్స్‌కు భారత బ్యాడ్మింటన్ జట్టును మంగళవారం ప్రకటించారు. మెగా టోర్నీ ఈనెల 27 నుంచి చైనాలోని గ్జియామెన్‌లో జరుగనుంది. పీవీ సింధు, లక్ష్య సేన్ సారథ్యంలో మొత్తం 14 మందితో కూడిన భారత జట్టు ఈ పోటీల బరిలోకి దిగనుంది. మహిళల డబుల్స్‌లో ఏస్ జంట పుల్లెల గాయత్రి/ట్రీసా భుజం గాయం కారణంగా టోర్నీకి దూరమైంది. ఈ జోడీ గైర్హాజరుతో మహిళల డబుల్స్ బాధ్యతలను యువ జంట ప్రియ/శ్రుతి మోయనుంది. ఇక, గతనెల ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ సందర్భంగా వెన్నునొప్పికి గురైన పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి మళ్లీ జట్టులోకి వచ్చేసింది. సాత్విక్ జంటకు బ్యాకప్‌గా హరిహరన్/రుబాన్ కుమార్ ద్వయాన్ని ఎంపిక చేశారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్‌తో పాటు వెటరన్ హెచ్ఎస్ ప్రణయ్, మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు అనుపమ, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా బరిలోకి దిగనున్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యల వెనుక కుట్ర

కేసీఆర్ సూచనలతోనే ఆ వ్యాఖ్యలు

- దుబ్బాక ఎమ్మెల్యేపై కాంగ్రెస్ ఆగ్రహం
- ఎమ్మెల్యేలేమైనా సంతలో వస్తువులా?
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: పీసీసీ చీఫ్
- నోవాటెల్‌లో సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం
- ముఖ్యమంత్రి వెళ్తున్న లిఫ్ట్ మొరాయింపు



శంషాబాద్ రూరల్/హైదరాబాద్ సిటీ/తొగుట/చేగుంట/రాయపోల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిందిగా బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు తమను కోరుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు, మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను.. ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రకోణంగా భావిస్తున్నామని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకునే దిశగా ఆలోచిస్తామన్నారు. మంగళవారం నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి ముందు వారు మాట్లాడారు. తొలుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కొనుగోలు చేయడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలేమైనా సంతలో వస్తువులా? అని మండిపడ్డారు. చోటా మోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం తమది కాదని, ఇలాంటి వారికి భయపడబోమని చెప్పారు. తమ ఎమ్మెల్యేలకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందన్నారు. కాగా, కొత్త ప్రభాకర్‌రెడ్డి.. కేసీఆర్ ఆత్మ అని, ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో భాగంగానే ఆయన వ్యాఖ్యలు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల సూచనలతోనే ప్రభాకర్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. భూభారతిని తీసుకురావడంతోనే వారికి భయం పట్టుకుందని, గతంలో చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాగా, తమ ప్రభుత్వంపై మొదటి నుంచీ కుట్రలు జరుగుతూనే ఉన్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ట్రాన్స్‌పోర్టు వ్యాపారి అనుకున్నానని, కానీ.. ఆయన ఈ మధ్య జ్యోతిష్యం కూడా చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదులు..

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన సొంత నియోజకవర్గం దుబ్బాకలోని తొగుటలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ప్రభాకర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలంటూ తొగుట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేగుంటలోనూ ఎమ్మెల్యేపై పోలీసులకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. రాయపోల్‌లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డిని అరెస్టు చేసి విచారించాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి తప్పిన ప్రమాదం

సీఎల్పీ సమావేశానికి హాజరుకావడానికి ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆయన వెళుతున్న లిఫ్ట్ ఓవర్‌లోడ్ కారణంగా ఒక్కసారిగా కిందకు దిగింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో అది మొరాయించింది. ఓవర్‌లోడ్‌తో అలారం మోగడంతో అప్రమత్తమైన భద్రత , హోటల్ సిబ్బంది వెంటనే లిఫ్ట్‌లో నుంచి కొంతమంది ఎమ్మెల్యేలను కిందకి దించారు. సీఎంను వేరే లిఫ్ట్‌లో పంపించారు. కాగా, ఓవర్ లోడ్ కారణంగానే లిఫ్ట్ పైఫ్లోర్‌కు వెళ్లకుండా ఆగిపోయిందని పోలీసులు తెలిపారు. సీఎంకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

అక్రమమని తెలిసీ ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)



పేర్కొంది. అయితే, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అక్కడ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు వాటిని అడ్డుకోవడం లేదని పేర్కొంటూ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. కచ్చితమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని.. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించింది. స్టేటస్ కో విధించిన తర్వాత కూడా పలు నిర్మాణాలు పూర్తయినట్లు ఫొటోల ద్వారా స్పష్టమవుతోందని పేర్కొంది. అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలన్న ఉత్తర్వులను జీహెచ్ఎంసీ చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. అధికారులతో కుమ్మక్కై చట్టవిరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టినందుకు 'సూపర్‌టెక్ లిమిటెడ్ వర్సెస్ ఎమరాల్డ్ కోర్ట్ ఓనర్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్' కేసులో భారీ టవర్స్ కూల్చివేతకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. ప్రస్తుత కోర్టు ధిక్కరణ కేసులోని మణికొండ జాగీర్ భూముల్లో ఎన్ని నిర్మాణాలు ఉన్నాయి? ఎన్నింటికి అనుమతి ఉంది? అనుమతి లేకుండా ఎన్ని నిర్మాణాలు చేపట్టారు? ప్రణాళికకు విరుద్ధంగా ఎన్ని కట్టారు? అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యలేంటి? తాగునీరు, విద్యుత్ నిలిపివేతకు సంబంధించి ఎన్ని లేఖలు రాశారు? అక్రమ నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టారు? తదితర వివరాలు, ఫొటోలు, వీడియోలతో సమగ్ర నివేదిక సమర్పించాలని.. వచ్చే విచారణ తేదీలోపు ఈ నివేదిక సమర్పించపోతే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ జూలై 2కు వాయిదా వేసింది.

కార్పొరేటర్ చెప్తే..నిర్మాణ అనుమతి నిలిపేస్తారా?: హైకోర్టు

కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌పై మండిపాటు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ చెప్పారని నిర్మాణ అనుమతులు ఇవ్వకుండా నిలిపేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఓ కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో ప్రత్యక్షంగా హాజరైన కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. నిబంధనల ప్రకారం ప్రాసెసింగ్ ఫీజు తీసుకుని బిల్డింగ్‌కు నిర్మాణ అనుమతి ఇవ్వాలని హైకోర్టు గతంలో ఆదేశాలు జారీచేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని వీణారెడ్డి అనే మహిళ హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ధిక్కరణ కేసులో నోటీసులు ఇచ్చినా కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ స్పందించకపోవడంతో ప్రత్యక్షంగా హాజరుకావాలని హైకోర్టు నోటీసులు ఇచ్చింది. తాజాగా మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ముందు హాజరైన కమిషనర్.. అందులో ప్రభుత్వ భూమి ఉందని కార్పొరేటర్ చెప్పడం వల్లే అనుమతి ఇవ్వలేదని పేర్కొనడంతో ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. కమిషనర్ వివరణకు సంతృప్తి చెందని ధర్మాసనం.. అనుమతి కోరుతున్న భూమిలో సర్వే చేపట్టి ప్రభుత్వ భూమి ఉందా? లేదా? తేల్చాలని స్పష్టంచేసింది. ఆ తర్వాత నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ జూన్ నెలకు వాయిదా వేసింది.

సన్న బియ్యం.. మన బ్రాండ్

పథకమూ మనదే.. పేటెంటూ మనదే.. ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోతుంది

- కుల గణన, ఎస్సీ వర్గీకరణ.. భూ భారతి. ఇందిరమ్మ ఇళ్లు.. గొప్ప నిర్ణయాలు
- వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ పిలుపు
- కులగణన.. మోదీ సర్కారుకు మరణ శాసనం
- ఇది దేశంలోనే గేమ్ చేంజర్ కాబోతోంది
- తెలంగాణ మోడల్‌పై దేశవ్యాప్తంగా చర్చ
- అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి
- కంచ గచ్చిబౌలిపై అసత్య ప్రచారం
- ఇప్పుడు మోదీ కూడా రంగంలోకి దిగారు
- ప్రభుత్వం బుల్డోజర్లు పంపిస్తోందంటున్నారు: రేవంత్



సీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఉత్తమ్, పొంగులేటి, విజయశాంతి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): "పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం.. ఆనాటి రూ.2కే కిలో బియ్యం తరహాలో శాశ్వతంగా గుర్తుండిపోనుంది. సన్న బియ్యం.. మన పథకం. మన బ్రాండ్. ఈ పథకం 'పేటెంటూ మనదే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం పథకం ఎందుకు అమలు కావట్లేదో ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. దేశంలో ప్రస్తుతం తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోందని, అందుకే, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం సీఎల్పీ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రధానంగా సన్న బియ్యం, కుల గణన, ఎస్సీ వర్గీకరణ, భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. సన్న బియ్యం పంపిణీ, ఎస్సీ వర్గీకరణ అంశాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివరించారు. బీసీ కుల గణనపై మంత్రి పొన్నం ప్రభాకర్.. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. "ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. కుల గణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా, పకడ్బందీగా పరిష్కరించాం. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులను తీసుకొచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇది నిదర్శనం. ఇక, జటిలమైన ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపాం. వర్గీకరణ చట్టం అమలయ్యే వరకూ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. రైతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ భారతి చట్టం తీసుకొచ్చాం. దీనిని రైతులకు చేరవేయాలి. ఇక, ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందాలి. కుల గణన, సన్న బియ్యం, ఎస్సీ వర్గీకరణ, భూ భారతి వంటి గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నుంచి జూన్ 2 వరకు ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్నీ పర్యటించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తాను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం కావడానికి సమయం కేటాయిస్తానని చెప్పారు. మనం ఎంత మంచి పని చేసినా.. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదని, పార్టీ.. ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే మనకూ భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి వద్దకు తీసుకెళ్లాలని వివరించారు.

తెలంగాణ పథకాలతో మోదీ ఉక్కిరిబిక్కిరి

"తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎస్సీ వర్గీకరణ ఆయనకు గుదిబండగా మారింది. కుల గణన సర్వే.. కేంద్రంలోని మోదీ సర్కారుకు మరణ శాసనం రాయబోతోంది. దేశంలోనే ఇది గేమ్ చేంజర్ కానుంది. బిహార్ ఎన్నికల్లోనూ కీలక పాత్ర పోషించనుంది" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కంచగచ్చిబౌలి భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అబద్ధపు ప్రచారం చేసిందని, దానిని ప్రధాని మోదీ కూడా నమ్మి.. తెలంగాణ ప్రభుత్వం అడవులపై బుల్డోజర్లు పంపిస్తోందంటూ మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని, ఇప్పటి దాకా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విమర్శలు చేశారని, ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారని వ్యాఖ్యానించారు.

వర్గీకరణ, కుల గణన.. గొప్ప గొప్ప నాయకులే చేయలేక పోయారు: భట్టి విక్రమార్క

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఒకెత్తయితే.. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన మరొక ఎత్తని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ రెండు అంశాలను గత కొన్ని దశాబ్దాలుగా గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయారని, కానీ, మన ప్రభుత్వం చెప్పి మరీ చేసి చూపించిందని అన్నారు. ఇప్పుడు ఈ రెండు అంశాలను అమలు చేయాలంటూ దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలైందన్నారు. కొద్దిమందికి ఇష్టం లేకపోయినా దేశంలో భూ సంస్కరణలు వంటి గొప్ప నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని, అందుకే, సుదీర్ఘ కాలంపాటు అధికారంలో కొనసాగిందని చెప్పారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను మూటకట్టి మూలన పడేసే విషయాలన్నారు. అందుకే ఆ రెండు పార్టీలు చేతులు కలిపి.. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్లు చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏనుగులు, పులులు తిరుగుతున్నట్టు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.



సీఎల్పీ భేటీకి హాజరైనట్టు సంతకం చేస్తున్న రేవంత్

పార్టీ లైన్ దాటొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

అందరమూ బతుకుతామని స్పష్టం చేశారు. మీరు ఎవరి గురించి మాట్లాడుతున్నారో.. వారు కూడా ఏమీ చేయలేరని పార్టీ నేతలకు చెప్పారు. తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం పార్టీ లైన్లోనే పని చేస్తామని, పార్టీని కాదని ఏమీ చేయలేమని తేల్చి చెప్పారు. పదవి దక్కకపోయినా అద్దంకి దయాకర్ పార్టీ లైన్లోనే ఉంటూ వచ్చారని, అన్ని సమీకరణలు కలిసొచ్చి ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కిందని వివరించారు. పార్టీ లైన్లోనే ఓపిగ్గా ఉన్నందున.. ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వాలన్న భావనకు అందరూ వచ్చారని, ఆయనలాగే అందరూ పార్టీ లైన్ దాటకుండా ఓపిగ్గా ఉండాలని హితవు పలికారు.

ఎమ్మెల్యేలను కలుస్తా..!

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 15 రోజులపాటు పార్టీ ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తానని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆయా నియోజక వర్గాల్లో మళ్లీ గెలవాలంటే ఏయే పనులు చేయాలో నివేదికను సిద్ధం చేసుకుని ఉండాలన్నారు. ముఖాముఖి భేటీల్లో ఆయా నివేదికలను పరిశీలించి పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అలాగే, మే ఒకటో తేదీ నుంచి జూన్ 2 వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కార్యక్రమాలను నిర్వహించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. వాటికి తాను హాజరవుతానని, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని అన్నారు. ఇక, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.5 కోట్ల చొప్పున నిధులను విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీఎల్పీ సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది. వచ్చే నెల నుంచి నిధుల విడుదల కార్యక్రమం ఉంటుందని చెప్పినట్లు సమాచారం. కాగా.. ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికై సీఎల్పీ సమావేశంలో తొలిసారిగా పాల్గొన్న విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌లకు సన్మానం... అభినందన కార్యక్రమం జరిగింది. ఇక, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల్లో కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు మాత్రమే సీఎల్పీ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

భారత్ సదస్సుకు రాహుల్, ప్రియాంక

ఈనెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న భారత్ సదస్సుకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరు కానున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సదస్సును విజయవంతం చేసే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న ఎమ్మెల్యేలకూ బాధ్యతలు అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సూచించారు.

అరెస్టు చేయరాదని ఉత్తర్వులు ఇస్తే వారంలో వచ్చేస్తా

- హైకోర్టును కోరిన ట్యాపింగ్ నిందితుడు ప్రభాకర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో తనను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే వారంలో ఇండియా వచ్చేస్తానని ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు అనుబంధంగా మరో దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తుపై జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభాకర్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఐన్యూస్ ఎండీ శ్రవణ్‌రావును అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. అదేతరహాలో ప్రభాకరరావును సయితం అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆయన దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తరఫున సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. ప్రభాకర్‌రావు పాస్‌పోర్ట్ రద్దయిందని, రెడ్ కార్నర్ నోటీసు జారీఅయిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆయన వారంలో తిరిగి వస్తానని ఎలా చెబుతారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ మధ్యంతర పిటిషన్ తమ రికార్డుల్లోకి రాలేదని తెలిపింది. వచ్చిన తర్వాత వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను 25కు వాయిదా వేసింది.

నేను కొంచెం రౌడీ టైపే!

- కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- బెదిరింపులకు పాల్పడే వారి పేర్లు పింక్ బుక్‌లో రాస్తాం
- వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: కవిత

బాన్సువాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, తమ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడే వారి పేర్లను బరాబర్ పింక్‌బుక్‌లో రాసుకుంటాం అని.. వారిని విడిచిపెట్టేది లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. 'కేసీఆర్ మంచోడు కావొచ్చు.. నేను కొంచెం రౌడీ టైపే' అని ఆమె వ్యాఖ్యానించారు. బాన్సువాడలో తమ కార్యకర్తలను సతాయించిన వారిని, పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చిన వారిని క్షమించే ప్రసక్తే లేదన్నారు. బాన్సువాడలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.. రజతోత్సవ మహాసభకు ఇంటికొకరు చొప్పున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మాట తప్పే ప్రభుత్వం అని, అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఆ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ పంచి ఓట్లేయించుకున్నారని... ఇప్పుడు ఆ గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

జపాన్‌కు సీఎం రేవంత్ బృందం

- నేడు భారత రాయబారితో సమావేశం
- రేపు, ఎల్లుండి టోక్యోలో కంపెనీలతో భేటీ
- 19 నుంచి 20 వరకు ఒసాకాలో పర్యటన
- 23న ఉదయం తిరిగి తెలంగాణకు రాక

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు విదేశీ కంపెనీల నుంచి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా పలు శాఖల అధికారులతో కలిసి ఆయన జపాన్ పర్యటనకు వెళ్లారు. బుధవారం నుంచి 22 వరకు ఈ బృందం జపాన్‌లో పర్యటించి, 23న ఉదయం రాష్ట్రానికి రానుంది. టోక్యో, మౌంట్ ఫుజీ, ఒసాకా, హిరోషిమాలో ముఖ్యమంత్రి బృందం పర్యటిస్తుంది. ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధులతో సమావేశమవుతుంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై జపాన్ కంపెనీలతో సీఎం బృందం చర్చలు జరుపుతుంది. పర్యటనలో భాగంగా ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో-2025లో తెలంగాణ పెవెలియన్‌ను ప్రారంభిస్తారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

- జపాన్ వెళ్లేందుకు మంగళవారం సాయంత్రమే సీఎం బెంగళూరుకు వెళ్లారు. బుధవారం ఉదయానికి ఆయన జపాన్‌లోని నారిటా ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం భారత రాయబారితో అతిథ్య భేటీలో పాల్గొంటారు.
- ఏప్రిల్ 17: టోక్యోలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ, జెట్రో, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీని సందర్శిస్తారు.
- ఏప్రిల్ 18: టోక్యోలో ఉన్న గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం టోక్యో గవర్నర్‌తో మర్యాదపూర్వక సమావేశమవుతారు. ఆ తర్వాత ఇండియన్ ఎంబసీ ఆధ్వర్యంలో పరిశ్రమల ప్రతినిధులతో భేటీ అవుతారు. అనంతరం టయోటా, తోషిబా, ఐసిన్, ఎన్టీటీ తదితర కంపెనీల సీఈవోలతో వేర్వేరుగా సమావేశమవుతారు. జపాన్ ఓవర్సీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రతినిధులతో సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సుమిదా రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు.
- ఏప్రిల్ 19: టోక్యో నుంచి ఒసాకా వెళ్తారు. అక్కడ మౌంట్ ఫుజీ ప్రాంతాన్ని, అరకుర యామా పార్క్‌ను సందర్శిస్తారు.
- ఏప్రిల్ 20: ఒసాకాలోని కిటాక్యూషు సిటీకి వెళ్తారు. అక్కడి మేయర్‌తో సమావేశమవుతారు. ఎకో టౌన్ ప్రాజెక్టుకు సంబంధించిన సమావేశంలో పాల్గొంటారు. మురసాకికి రివర్ మ్యూజియం, ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం అండ్ ఎకో టౌన్ సెంటర్లను సందర్శిస్తారు.
- ఏప్రిల్ 21: ఒసాకాలోని యుమెషిమాలో వరల్డ్ ఎక్స్ పో-2025లో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు.
- ఏప్రిల్ 22: ఒసాకా నుంచి హిరోషిమా చేరుకుంటారు. అక్కడ హిరోషిమా పీస్ మెమోరియల్‌ను సందర్శించి, గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. ఆ తర్వాత హిరోషిమా వైస్ గవర్నర్, అసెంబ్లీ ఛైర్మన్లతో సమావేశాలు నిర్వహిస్తారు. అనంతరం హిరోషిమా జపాన్- ఇండియా చాప్టర్‌తో కలిసి బిజినెస్ లంచ్ చేస్తారు. అక్కడి నుంచి హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మజ్దా మోటార్స్ ఫ్యాక్టరీలను సందర్శిస్తారు. ఆ తర్వాత ఒసాకాలోని కాన్సాయ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయం నుంచి తెలంగాణకు బయలుదేరి.. 23న ఉదయానికి హైదరాబాద్ చేరుకుంటారు.

సర్కార్‌ను బద్నామ్ చేయడానికే..

సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు!

- భారత చట్టాల నుంచి తప్పించుకునేందుకు విదేశాల నుంచి పోస్టులు
- ప్రభుత్వ వ్యతిరేక ప్రచారంలో 25 మంది కీలక పాత్ర
- వారికి భారీగా నిధులు
- వారి వెనకున్న పెద్దల గురించి ప్రభుత్వానికి నిఘా వర్గాల నివేదిక
- ఆయా సైట్లకు త్వరలో నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడానికి కొందరు పక్కా ప్లాన్ వేశారని, సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని ఫేక్ పోస్టులను రూపొందించి వదులుతున్నారని, వీరికి పెద్దఎత్తున నిధులు అందుతున్నాయని హెచ్‌సీయూ భూ వివాదానికి సంబంధించి ఫేక్ పోస్టులపై దర్యాప్తు జరుపుతున్న సైబర్ క్రైం బృందాలు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో 25 మంది కీలక పాత్ర పోషించారని, వారి బ్యాంకు లావాదేవీలు, వారి వెనుక ఉన్న పెద్దల పాత్ర గురించి ఇప్పటికే ప్రభుత్వానికి నిఘావర్గాలు సమగ్రమైన నివేదిక అందించాయని తెలుస్తోంది. ఫేక్ పోస్టులు పెడుతున్న వారు భారతచట్టాల నుంచి తప్పించుకోవడం కోసం దుబాయ్, ఆఫ్రికా తదితర దేశాల నుంచి తమ కార్యక్రమాలను సాగిస్తున్నారని, వారికి హవాలాతో పాటు ఇతర మార్గాల్లో పెద్ద ఎత్తున నిధులు అందుతున్నాయని, ఇది డిజిటల్ మాఫియాగా విస్తరించిందని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. ఇన్నాళ్లు సాధారణమైన వీడియోలతో ఫేక్ ప్రచారం చేసిన వారు కొత్తగా ఏఐ ఆధారిత ఫేక్ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రజల్ని, మేధావుల్ని సైతం తప్పుదోవ పట్టించే విధంగా ఈ పోస్టులు ఉంటున్నాయి. హెచ్‌సీయూ భూ వివాదంపై సృష్టించిన వీడియోలను నిజమని నమ్మి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం వాటిని రీ పోస్టు చేశారంటే ఎంత బలంగా ఈ డిజిటల్ మాఫియా పనిచేస్తుందో స్పష్టం అవుతోందని పోలీసు అధికారులంటున్నారు. ఇదీ పక్కా పథకంతో నడుస్తున్న కుట్ర అని, దీని వెనుక ప్రతిపక్ష పార్టీ పెద్దలు ఉన్నారని ప్రభుత్వానికి నిఘా వర్గాల నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి అనేక యూట్యూబ్ చానళ్లు, న్యూస్ వెబ్‌సైట్లకు కోట్ల రూపాయల్లో నిధులు అందుతున్నాయని, ఈ డిజిటల్ మాఫియాను నియంత్రించడానికి కొత్త చట్టాలు తేవాల్సిన అవసరముందని మాజీ పోలీసు అధికారులు విశ్లేషిస్తున్నారు. ఫేక్ పోస్టులను పెట్టి డిలీట్ చేసిన న్యూస్ సైట్లు, సోషల్ మీడియా ఖాతాలకు సంబంధించి వాటి యూఆర్ఎల్ వివరాలను సైబర్ క్రైం బృందాలు సేకరించాయి. వీటిలో అత్యధికం బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యక్షంగా, పరోక్షంగానూ మద్దతిస్తున్నవేనని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పోలీసు అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ అడ్డా, పావనీ గౌడ్ బీఆర్ఎస్, రామ్, బీఆర్ఎస్ తెలంగాణ సైన్యం, తెలంగాణ వాయిస్, తెలంగాణ ఉద్యమ జ్యోతి, హరీష్ రెడ్డి, కెప్టెన్ ఫసాక్, ఆయూబ్ సోహైల్, వి టాక్స్, ధన, ఏజే స్వారో, థామస్ అగస్టిన్, జి.కిషన్ రెడ్డి, కట్టా జగదీశ్, రఘువీర్ రాథోడ్, రాజిరెడ్డి గారి అమ్మాయి, అఖిల్ రాయుడు, సూర్యకాంతం, పృథ్వీ తేజ, రామజింగ్ మీమ్స్, వంశీకృష్ణారెడ్డి, మల్లార్, పల్లవి, ఇండియన్ రైటర్, సూరజ్ మెహ్రా పేర్లతో ఉన్న న్యూస్ సైట్లు, సోషల్ మీడియా ఖాతాలను నిర్వహిస్తున్నారని, వాటిల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారని, వాళ్లకు నోటీసులు ఇవ్వనున్నామని సైబర్ క్రైం బృందాలు తెలిపాయి.

ఒడిశాలో నేటి నుంచి సింగరేణి మైనింగ్

తెలంగాణలోని గోదావరి లోయలో 130 ఏళ్లుగా బొగ్గు తవ్వకాలు జరుపుతూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ.. చరిత్రలో తొలి సారి మరో రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు చేపట్టనుంది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు కోల్ లింకేజీలో భాగంగా ఒడిశాలోని అంగూల్ జిల్లాలో గల నైనీ బొగ్గు బ్లాకును కేంద్రం కేటాయించింది. ఆ బ్లాకులో బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్ విధానంలో బొగ్గు తవ్వకాలను ప్రారంభిస్తారని సంస్థ సీఎండీ బలరామ్ తెలిపారు. 2016 మే లో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. అయితే అన్ని అనుమతులు సాధించి, గనిలో తవ్వకాలు ప్రారంభించడానికి తొమ్మిదేళ్లు పట్టింది.

నిరంతర విద్యుత్‌కు సహకారం: సీఈఏ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిరంతర విద్యుత్ సరఫరా కోసం అవసరమైన సహకారం అందిస్తామని కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) చైర్‌పర్సన్ ఘనశ్యాం ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో పాటు ఉత్తర, దక్షిణ డిస్కమ్‌ల సీఎండీలు హాజరయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, సరఫరా, వనరుల ప్రణాళిక, రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 16,877 మెగావాట్లుగా ఉంటుందని సీఈఏ వనరుల ప్రణాళిక నివేదికలో ఉండగా.. గత మార్చి 20న 17,162 మెగావాట్ల డిమాండ్ నమోదయిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలో మార్పులు చేయాలని అధికారులు కోరారు.

అందుబాటులోకి సరస్వతీ పుష్కరాల యాప్

» ఆవిష్కరించిన మంత్రులు శ్రీధర్ బాబు, సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాలపై భక్తులకు సమగ్ర సమాచారం తెలియజేసేందుకు రూపొందించిన వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సరస్వతీ పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సరస్వతీ పుష్కరాలకు ప్రతి రోజూ 50 వేల మందికిపైగా భక్తులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించవచ్చని అంచనా వేస్తున్నామని చెప్పారు. ప్రధాన పుష్కర ఘాట్ వద్ద 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటు, భక్తుల సౌకర్యం కోసం చలువ పందిళ్లు, శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం చేస్తున్నామని వివరించారు.

100 గదులతో టెంట్ సిటీ

మే 15న శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం నుంచి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి పాల్గొని పుష్కరాల్ని ప్రారంభిస్తారు. అనంతరం ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం ఆచరించనున్నారు. మహా కుంభ మేళా తరహాలో భక్తుల సౌకర్యార్థం ఘాట్ వద్ద 100 గదులతో కూడిన టెంట్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల వసతికి దేవస్థానం వద్ద 100 గదులతో డార్మిటరీ భవనాన్ని అందుబాటులోకి తెస్తున్నారు.

23న రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలపై తుది దశ విచారణలో భాగంగా ఈ నెల 23వ తేదీన జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో ఇప్పటిదాకా కీలక ప్రక్రియలన్నీ పూర్తయ్యాయి. నివేదికకు కూడా ఆయన తుదిరూపం ఇచ్చే పనిలో పడ్డారు. విచారణలో భాగంగా కీలక అధికారులందరినీ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదలశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఆ సమయంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ క్రాస్ ఎగ్జామినేషన్ మిగిలి ఉంది. ఈ ముగ్గురిని విచారణకు హాజరై సహకరించాలని కోరుతూ కమిషన్ సమన్లు పంపాలని భావిస్తోంది. ఈ నెల 23వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్‌కు చేరుకున్నాక కేసీఆర్ తదితరులకు సమన్ల జారీపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

ఉత్తమ సమాజానికి ఉపాధ్యాయుల పాత్రే కీలకం

» ప్రెసిడెన్సీ ఫౌండర్ చాన్స్‌లర్ డాక్టర్ నిస్సార్ అహ్మద్


ఇన్‌స్పైర్డ్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ నిస్సార్ అహ్మద్

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజానికి విద్యార్థులు ముఖ్యమని అయితే వారిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఫౌండర్ చాన్స్‌లర్ డాక్టర్ నిస్సార్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. ఐదు దశాబ్దాల విద్యారంగంలో ప్రయాణంపై ఇన్‌స్పైర్డ్ 2025 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి అనితా నాయర్, మాజీ ఐపీఎస్ సంజయ్‌సహాయ్, ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ నఫీజా అహ్మద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ, విద్యారంగంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించామని, నిర్మాణాత్మకమైన విద్య అందించే లక్ష్యాన్ని కొనసాగించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా దీర్ఘ సేవా ప్రశస్తి, అత్యుత్తమ అధ్యాపక పురస్కారం, ఇన్‌స్టిట్యూషనల్ లెగసీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ కౌసర్ నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు.

1976 బ్యాచ్ సివిల్ ఎస్ఐల స్వర్ణోత్సవాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1976 బ్యాచ్ సివిల్ ఎస్ఐల స్వర్ణోత్సవ వేడుకలు మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్ల మెస్‌లో ప్రారంభం అయ్యాయి. 1976లో ఎస్ఐలుగా ఎంపికైన 292 మంది.. అనంతపురం పోలీస్ శిక్షణాకేంద్రంలో ట్రైనింగ్ పూర్తిచేసుకుని విధుల్లో చేరారు. సుదీర్ఘకాలం విధుల్లో కొనసాగి.. డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారులుగా రిటైరయ్యారు. తమ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకుని 50 ఏళ్లవుతున్న నేపథ్యంలో స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న సుమారు 125 మంది విశ్రాంత అధికారులు.. శిక్షణతోపాటు సర్వీసులో ఎదుర్కొన్న ఇబ్బందులు, సాధించిన విజయాలను గుర్తుచేసుకుని సంతోషించారు. వారిలో 80 ఏళ్లు నిండిన వారికి సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు.

అంగన్వాడీలకు గుడ్ల సరఫరా
టెండర్ గడువు మే 15 వరకు పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరా కోసం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆహ్వానించిన టెండర్ గడువు మే 15 వరకు పెంచారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాది పాటు గుడ్ల సరఫరాకు గత నెల 30న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. టెండర్ల దాఖలుకు తొలుత ఈ నెల 10 వరకూ.. తర్వాత 15 వరకూ పెంచింది. అగ్‌మార్క్ ధ్రువీకరణ పత్రంతోపాటు రెండేళ్ల అనుభవం గల అగ్‌మార్క్ సర్టిఫికెట్, రెప్లికా సీరియల్ నంబర్ ఉండాలని ప్రభుత్వం నిబంధన తెచ్చింది. దీంతో 23 మంది పౌల్ట్రీ రైతుల్లో ఎనిమిది మందికి మాత్రమే టెండర్లు దాఖలుచేసే అవకాశం లభించింది. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తేవడంతో.. ఆయన ఆదేశాల మేరకు వచ్చేనెల 15 వరకూ మహిళా శిశు సంక్షేమశాఖ గడువు పొడిగించింది. టెండర్ దాఖలుచేసే నాటికి రెండేళ్ల అనుభవం గల అగ్‌మార్క్ సర్టిఫికెట్ ఉన్నా సరిపోతుందని నిబంధన సవరించినట్లు సమాచారం.

ఇందిరమ్మ లబ్ధిదారులకు 20.19 కోట్లు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిబంధనల ప్రకారం మొదటి దశ కింద బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఖాతాల్లో రూ.20.19 కోట్లను జమచేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇళ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2,019 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఈ రూ.20.19 కోట్లను విడుదల చేశామని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. బేస్‌మెంట్ పూర్తిచేసుకున్న వారిలో ఓ 12 మంది లబ్ధిదారులకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చెక్కులను లాంఛనంగా అందజేసినట్లు తెలిపారు. గ్రౌండింగ్ అయిన ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని, ఇప్పటికి 13,500 ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయిందని పొంగులేటి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లోనే నిధులను జమ చేస్తామన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయిన తర్వాత రూ.లక్ష, గోడల వరకు నిర్మాణం అయితే రూ. 1.25 లక్షలు, శ్లాబ్ పూర్తి చేసుకున్న తర్వాత రూ. 1.75 లక్షలు, ఇల్లు నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష చొప్పున నాలుగు దశల్లో ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. బేస్‌మెంట్, గోడల వరకు, శ్లాబ్ వరకు నిర్మాణం పూర్తయిన దశల్లో అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్ధిదారులే ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా డబ్బులు వారి ఖాతాలో జమచేస్తామని స్పష్టంచేశారు. కనీసం 400 చదరపు గజాలకు తగ్గకుండా, 600 చదరపు గజాలకు మించకుండా లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడంతో పాటు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడతగా లక్షరూపాయల చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆ నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు

17 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. కొత్త చట్టం ప్రకారం పరిష్కారానికి ఏర్పాట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేశారు. దరఖాస్తుల నమూనాలను ఖమ్మం, నారాయణపేట, కామారెడ్డి, ములుగు జిల్లాల కలెక్టర్లకు పంపారు. బుధవారం వారు వాటిని ముద్రించి ఎంపిక చేసిన నాలుగు మండలాలకు పంపనున్నారు. అనంతరం, ఈనెల 17 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు. వాటిలోనే దరఖాస్తులను స్వీకరించనున్నారు. వీటిలో వచ్చే ఫిర్యాదులకు కొత్త చట్టం నిబంధనల ప్రకారం పరిష్కారం చూపనున్నారు. ఇక, భూ భారతి చట్టం, నిబంధనలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలిరోజు రిజిస్ట్రేషన్లపైనే దృష్టి

భూ భారతి అమలును ప్రయోగాత్మకంగా చేపట్టిన నాలుగు మండలాల్లో మొదటి రోజు రిజిస్ట్రేషన్లపైనే దృష్టిసారించారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయడానికి ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే కోణంలో సీసీఎల్ఏ నుంచి సమీక్షిస్తున్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపురం మండలాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సీసీఎల్ఏ అధికారులు స్వయంగా పర్యవేక్షించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, అప్పీల్, రివిజన్, నాలా తదితర సేవలకు సంబంధించి అన్ని పత్రాలూ సక్రమంగా ఉంటే జాప్యం లేకుండా వెంటనే పని పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు సమాచారం కోసం లాగిన్ అయ్యే వారికి ఈ-చలానా, ఈసీ వివరాలు, నిషేధిత భూముల జాబితా, భూ హక్కుల రికార్డు, మార్కెట్ విలువల వివరాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందుబాటులో ఉంచారు. అయితే, ప్రస్తుతానికి ఈసీ, అప్పీల్, రివిజన్‌కి సంబంధించిన సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదని చూపుతోంది. గతానికి భిన్నంగా.. సాఫ్ట్‌వేర్ లోపాలను పరిష్కరించేందుకు రెండు, మూడు రోజులకోసారి అప్‌డేట్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలూ గుర్తించారు. పోర్టల్ అధికారిక లాగిన్‌ను మండల స్థాయిలో ఆపరేటర్, తహసీల్దార్‌కు ఇచ్చారు. వీరితోపాటు ఆర్డీవో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), కలెక్టర్‌కూ ఉంది. వీరిలో ఆపరేటర్ ఒక్కరే తాత్కాలిక ఉద్యోగి. అయితే, రెవెన్యూలో రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు లాగిన్ ఇస్తే.. తహసీల్దార్ బిజీగా ఉన్నా రెగ్యులర్ ఉద్యోగులు పెండింగ్ కేసులు పర్యవేక్షించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సోమవారం సీఎం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో కూడా తాత్కాలిక ఉద్యోగుల చేతిలో ఉండే లాగిన్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతోపాటు మరో సమస్యను తహసీల్దార్లు లేవనెత్తారు. రైతు భరోసా అమలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులకు ఇచ్చిన లాగిన్‌లో ఏ రైతుకు రాష్ట్రంలో ఎన్ని జిల్లాల్లో ఎంత భూమి ఉందో తెలుసుకునే అవకాశం ఉందని.. తహసీల్దార్లకు మాత్రం ఆ మండలం వరకే వివరాలు తెలిసేలా చేశారని, పూర్తి వివరాలు తెలిస్తే ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ వంటి విషయాల్లో ఉపయుక్తంగా ఉంటుందని ప్రతిపాదించారు.

15 మందితో వార్ రూమ్

భూ భారతి చట్టం, నిబంధనలు, గ్రామ పాలనాధికారుల వ్యవస్థ, పోర్టల్.. ఈ నాలుగు అంశాలపై పాలనపరమైన నిర్ణయాలు, మార్పులు, చేర్పులు చేసేందుకు 15 మందితో వార్‌రూమ్ ఏర్పాటు చేశారు. భూ భారతిని ప్రజల్లోకి తీసుకెళ్లడం దగ్గర నుంచి అమలు వరకు ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తున్నారు. మరో 8 మంది సభ్యుల బృందంతో హెల్ప్ సెంటర్ కూడా సీసీఎల్ఏ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. పోర్టల్ లాగిన్ సంబంధిత సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు, క్షేత్రస్థాయి అధికారులు, ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి ఈ సెంటర్ పని చేస్తుంది. ఇందుకు 040-2931 3999 నంబరును కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

పాత పద్ధతిలోనే పాస్ పుస్తకాలు

భూ భారతి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పాస్ పుస్తకాలు మళ్లీ మారుస్తారనే చర్చ జరుగుతోంది. అయితే, ఈ అంశంపై ప్రస్తుతానికి ఎటువంటి మార్పు లేదని సీసీఎల్ఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఏమైనా మార్పులు చేయాలనుకుంటే జూన్ తర్వాతే సర్కారు విధాన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. భూ భారతి హక్కుల రికార్డులో నమోదైన వారందరికీ ప్రభుత్వం తనంత తానుగా కానీ, భూ యజమాని దరఖాస్తు చేసినా రూ.300 ఫీజు తీసుకుని పాస్ పుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్వోఆర్‌లో యాజమాన్య హక్కు కలిగిన వ్యక్తి లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో తన భూమిని సర్వే చేయించుకుని, మ్యాప్ తయారు చేయించుకుంటే.. మండల సర్వేయర్ పరిశీలన అనంతరం తహసీల్దార్ ఆమోదంతో పాస్ పుస్తకంతోపాటు సర్వే మ్యాప్‌ను ముద్రించి ఇస్తారు. అలాగే, పాస్ పుస్తకం, ఆర్వోఆర్‌లోని వివరాల్లో వ్యత్యాసం ఉందని, సరి చేయాలని దరఖాస్తు పెట్టుకుంటే కూడా రికార్డులను పరిశీలించి తహసీల్దార్ కొత్త పాస్ పుస్తకం జారీ చేస్తారు. ఒకవేళ, పాస్ పుస్తకాల జారీలో తహసీల్దార్ నిర్ణయంపై అభ్యంతరాలుంటే ఆర్డీవోకు, ఆపైన కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు.

'సీతారామ'పై ఉన్నతస్థాయి కమిటీ

» నలుగురు సభ్యులతో ధృడత్వ పరిశీలన
» ఓ పిల్లర్ కూలిపోయిన నేపథ్యంలోనే..
» రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. ఆదేశాలు జారీ
» 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వనున్న కమిటీ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్‌లలోని నిర్మాణాల ధృడత్వాన్ని, నాణ్యతను పరిశీలించేందుకు నలుగురు సభ్యులతో ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు చీఫ్ ఇంజనీర్ (సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్) మోహన్‌కుమార్, సీఈ (క్వాలిటీ కంట్రోల్) వెంకటకృష్ణ, సీఈ (మైనర్ ఇరిగేషన్) రఘునాథరావు, ఎస్ఈ (టెక్నికల్) బస్వరాజులతో కమిటీ వేసినట్టు ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పూసుగూడెం-కమలాపురం పంప్‌హౌస్‌కు వెళ్లే కాలువ మార్గంలో మాదారంవద్ద 48.309 కి.మీ. వద్ద కాలువ పైన వరద నీరు వెళ్లడానికి వీలుగా సూపర్ పాసేజ్ నిర్మాణం చేపట్టగా... దీనికి సపోర్టుగా ఉండటానికి నాలుగు పిల్లర్లు కట్టారు. అయితే గత నెల మార్చిలో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ కోసం ప్యాకేజీ-4లో భాగంగా కెనాల్ 39.926 కి.మీ. నుంచి 44.650 కి.మీ. మధ్యలో నీటిని విడుదల చేయగా.. పిల్లర్ కింది భాగంలో మట్టి అంతా కొట్టుకుపోయి... పిల్లర్ కింద పడిపోయినట్లు ప్రాథమిక నివేదికలో తేల్చారు. ఇది జరిగి... రెండు వారాలు పూర్తవుతున్నా ఉన్నతస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వలేదు. అయితే, ఈ విషయం సీఎం ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లగా... ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కట్టుడు... కూలుడేనా...? నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించరా...? పదికాలాల పాటు ఉండాల్సిన నిర్మాణాలు ప్రాజెక్టు సిద్ధం కాకముందే కూలడమేంటి...?' అని అధికారులను నిలదీశారు. దాంతో ఈ పథకంలోని అన్ని కాంపోనెంట్ల నిర్మాణాల్లో ధృడత్వాన్ని, నాణ్యత ప్రమాణాలు పాటించే నిర్మాణాలు చేపట్టారా...? లేదా...? అన్న అంశాన్ని కమిటీ పరిశీలించి, 15 రోజుల్లోగా నివేదిక అందించనుంది. ఆ నివేదిక ఆధారంగా నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించలేదని తేలితే అధికారులపై తదుపరి చర్యలకు ఉపక్రమించనున్నారు.

వడదెబ్బ మృతులకు 4 లక్షల పరిహారం

» ప్రత్యేక విపత్తు నిధి నుంచి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వడగాల్పులు, వడదెబ్బల వల్ల మరణించిన వారికి రూ.4లక్షల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేసవిలో వడగాల్పులు, ఎండ తీవ్రతకు మృతి చెందే వారిని ప్రత్యేక విపత్తు కేటగిరి కింద పరిగణించి పరిహారం అందించాలని పేర్కొంటూ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో వేడి గాలుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో సంభవించిన మరణాలకే ఈ పరిహారం వర్తిస్తుంది. విపత్తు నిర్వహణ శాఖ మార్గదర్శకాల ప్రకారం.. కలెక్టర్, వైద్యాధికారులు.. మృతుని మరణానికి కారణాన్ని ధ్రువీకరించిన తర్వాతే బాధిత కుటుంబానికి పరిహారం మంజూరు అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైతు బీమా పథకంలో నమోదైన వారు వడగాల్పుల ప్రభావం వల్ల మరణిస్తే.. ఏ పథకం కింద ఎక్కువ మొత్తం వస్తుందో దానినే అమలు చేస్తామని తెలిపారు. వాతావరణ విభాగం మార్గదర్శకాల ప్రకారం.. 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా, సాధారణ ఉష్ణోగ్రతకు 5 నుంచి 7 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాల్లోనే వడదెబ్బ మరణాలుగా గుర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తాగునీటి కోసం కర్ణాటకకు అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు కింద జూన్ నెలలో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కోరేందుకు త్వరలో నీటిపారుదలశాఖ అధికారులు కర్ణాటకకు వెళ్లనున్నారు. జూరాల ప్రాజెక్టుకు నీటి విషయమై కర్ణాటక యంత్రాంగాన్ని కలవాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆ రాష్ట్ర పర్యటన కోసం నీటిపారుదలశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ఒక్క జూరాలలోనే నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2.88 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ప్రతినెలా ఈ ప్రాజెక్టు కింద తాగునీటి అవసరాల కోసం 0.11 టీఎంసీల నీరు అవసరం. దాంతో రానున్న 50 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ ముందు జాగ్రత్తగా మరికొన్ని నీళ్లను అడగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆల్మట్టిలో 29.90 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, నారాయణపూర్‌లో 23.25 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటి అవసరాల కోసం ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తే జూరాలకు చేరేసరికి 0.70 టీఎంసీలు మిగలనున్నాయి. దాంతో ఒక టీఎంసీ దాకా నీటిని కర్ణాటక నుంచి కోరడానికి వీలుగా అధికారులు త్వరలోనే వెళ్లే అవకాశాలున్నాయి.

'భూ భారతి'పైనే రైతుల ఆశలు

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో అమలు.. వివాదాలు పరిష్కారమవుతాయని అంచనాలు

» పాస్ బుక్స్,సాదా బైనామా కేసులే ఎక్కువ
» సమస్యల వల్ల పథకాలకు రైతులు దూరం
» నేలకొండపల్లి, వెంకటాపూర్‌లో తొలి రోజు జరగని రిజిస్ట్రేషన్లు
» లింగంపేట, మద్దూర్‌లో నేటి నుంచి రిజిస్ట్రేషన్లు


మద్దూరు తహసీల్దార్ కార్యాలయం

కామారెడ్డి/ లింగంపేట, నేలకొండపల్లి, మహబూబ్‌నగర్, వెంకటాపూర్/ములుగు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూభారతి రెవెన్యూ చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా తొలుత నాలుగు మండలాల్లో అమలు చేయనున్నారు. ఇందుకోసం నారాయణపేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ మండలాల్లో ఎలాంటి భూ సమస్యలు ఉన్నాయి? ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటి పరిష్కారం ఏ విధంగా సాధ్యమవుతుందని మదింపు వేసుకొని చట్టం ద్వారా వాటిని పరిష్కరిస్తారు. ఆ తర్వాత భూభారతి పోర్టల్‌లో కూడా వాటికి సంబంధించిన మాడ్యూల్స్‌ను సిద్ధం చేసి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోర్టల్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తారు. అయితే, భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద తమ ప్రాంతాలను ఎంపిక చేయడంతో మద్దూర్, నేలకొండపల్లి, లింగంపేట, వెంకటాపూర్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూసమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మండలాల్లో పాస్ పుస్తకాలు, సాదా బైనామా సమస్యలే అధికంగా ఉన్నాయి. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో భూముల వివరాలు, భూసమస్యల వివరాలు ఇలా ఉన్నాయి.

లింగంపేట మండలంలో వివాదంలో 1,663 ఖాతాలు

కామారెడ్డి జిల్లా లింగంపేట మండల పరిధిలో 41 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 23 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలో 10,098 సర్వేనంబర్లున్నాయి. వీటిలో 61,175 ఎకరాల్లో భూవిస్తీర్ణం ఉంది. ఇందులో 26,275 ఎకరాల సాగు భూమి ఉండగా.. 18,142 ఖాతాలను రెవెన్యూ అధికారులు జారీ చేశారు. అటవీ భూములు 3044 ఎకరాల్లో ఉండగా.. వీటి పరిధిలో 278 సర్వే నంబర్లు ఉన్నాయి. అసైన్డ్ భూములు 12,722 ఎకరాల్లో ఉండగా.. వీటి పరిధిలో 10,199 సర్వే నంబర్లున్నాయి. లింగంపేట మండల పరిధిలో సంవత్సరాల తరబడి అటవీ, రెవెన్యూ భూముల హద్దులు తెలియక పలు పట్టా భూములకు పాసు పుస్తకాలు రావడం లేదు. మండలంలోని 1663 ఖాతాలు వివాదంలో ఉండడంతో వీటిని పార్ట్ బీలో చేర్చారు. ఈ ఖాతాలు ఎక్కువగా శెట్పల్లిసంగారెడ్డి, పోతాయిపల్లి, ముంబాజీపేట, కొండాపూర్, భవానిపేట, మోతె, లింగంపల్లి (ఖుర్దు)గ్రామాల్లో ఉన్నాయి. పాసు పుస్తకాలు మంజూరు కాక చాలా మంది రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలోని ఎక్కువ భూములు అటవీ శాఖ పరిధిలో ఉన్నట్టు రికార్డుల్లో నమోదై ఉన్నాయి. అటవీ, రెవెన్యూ భూముల హద్దులు తెలియక పలు గ్రామాల్లో ఏళ్లుగా అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి. లింగంపేట మండంలో భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లను బుధవారం ప్రారంభిస్తున్నారు.

నేలకొండపల్లిలో 120 పెండింగ్ భూవివాదాలు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో మంగళవారం నుంచి భూభారతి చట్టం అమల్లోకి వచ్చింది. కానీ, తొలి రోజు రిజిస్ట్రేషన్లు కాలేదు. తహసీల్దార్ కార్యాలయంలో రెండు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రైతులు రాలేదు. మండలంలో మొత్తం 45,584 ఎకరాల భూమి ఉండగా, అందులో 24,644 ఎకరాల భూమి సాగులో ఉంది. 35,334 మంది రైతులు ఉండగా, 20,900 పాస్‌పుస్తకాలు ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలో 3,417 సాదా బైనామాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలో అసైన్డు, గ్రానైట్ భూముల వివాదాలతోపాటు రైతులకు సంబంధించి పాసు పుస్తకాల్లో ఎక్కువ భూమి, క్షేత్రస్థాయిలో తక్కువ భూమి ఉండడం, మరికొన్ని చోట్ల రైతుల ఆధీనంలో ఎక్కువ భూమి, పాసు పుస్తకాల్లో తక్కువ భూమి ఉండడం వంటి కేసులు ఉన్నాయి. మండలంలో 120 భూవివాదాలు నమోదై పరిష్కారం కాకుండా ఉన్నాయి.

మద్దూర్‌లో 30,621 ఎకరాల భూమి...

నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉండగా మొత్తం 30,621 ఎకరాల భూమి ఉంది. ఇందులో 30,473 ఎకరాలు సాగు భూమి. ఈ భూములకు సంబంధించి 47,706 మంది పట్టాదారులు ఉన్నారు. ఈ మండలంలో ఒకరి భూములు మరొకరికి వెళ్లడం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉండటం, పట్టా ఒకరిపై ఉండి.. కాస్తులో మరొకరు ఉండటం, భాగపరిష్కారాల సమస్యలు, నిషేధిత భూముల జాబితాలో పడటం, వివాదం లేకున్నా పార్ట్- బిలో చేర్చడం వంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 17న గ్రామసభలను ప్రారంభించనున్నారు. భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

వెంకటాపూర్‌లో పెండింగ్ సాదా బైనామాలు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో భూభారతి పోర్టల్‌ను మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు రైతుల నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్లు అందలేదు. మండలంలో 25 గ్రామ పంచాయతీలు, పది రెవెన్యూ గ్రామాల్లో 13,533 మంది రైతులు ఉన్నారు. మండలంలోని 74,667 ఎకరాల భూమి భూభారతి చట్టం పరిధిలోకి రానుంది. గతంలో వెంకటాపూర్ మండలం నుంచి వచ్చిన సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించే గ్రామసభల షెడ్యూల్‌ను కలెక్టర్ బుధవారం ప్రకటించే అవకాశం ఉంది.

భూభారతితో రైతుల సమస్యలకు పరిష్కారం



రైతులకు సంబంధించి ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలు భూభారతిలో పరిష్కారం కానున్నాయి. మండలంలోని ప్రతీ రైతు సమస్యను పరిష్కరించి పట్టాలు అందజేస్తాం. 17వ తేదీ నుంచి గ్రామసభలు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తాం. వాటిపై గ్రామంలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తాం

- సురేష్, తహసీల్దార్, లింగంపేట

ఈ చట్టంతో రైతులకు ఎంతో మేలు



భూభారతి చట్టం రైతులకు ఒక వరం. ధరణిలో ఆర్ఎస్ఆర్, మ్యుటేషన్‌లో వివాదాలుంటే కోర్టుకెళ్లి తేల్చుకోవాల్సి వచ్చేది. భూభారతి ద్వారా వారం రోజుల గడువుతో నోటీసులిచ్చి సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. ధరణిలో అప్పీల్ చేసుకునే అవకాశం లేదు. భూభారతిలో అప్పీల్‌కు అవకాశం ఉంది. భూవివాదాల తరుణంలో కేసుల పరిష్కారానికి గతంలో పలువురు రైతులు సహకరించే వారు కాదు. ఇప్పుడు నోటీసులు ద్వారా అందరినీ మండల కార్యాలయానికి పిలిపించి సమాచారం సేకరించి సమస్యను త్వరగా పరిష్కరించే వీలు ఉంది.

- ఓరుగంటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్, నేలకొండపల్లి

ఎంఎన్‌జేలో ఒక్క పూటలోనే కీమోథెరపీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):క్యాన్సర్ బాధితులు కీమోథెరపీ కోసం రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేకుండా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డే కేర్ విధానానికి శ్రీకారం చుట్టింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే క్యాన్సర్ బాధితులు, వారి బంధువులు ఒక్కపూటలో అన్నీ చక్కబెట్టుకుని ఇంటికి వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. ఇంతకు ముందు ఆస్పత్రిలో అడ్మిషన్ ఒకరోజు, వైద్య పరీక్షలకు మరోరోజు, ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్‌కు ఇంకో రోజు సమయం పట్టేది. ఆ తర్వాతే కెమోథెరపీ జరిగేది. ఇప్పుడు అన్నీ ఒకే రోజులో పూర్తయ్యేలా, ఉదయం వస్తే సాయంత్రం తిరిగి వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేశామని ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. డే కేర్ విధానంలో రోజూ 50 నుంచి 60 మందికి కెమోథెరపీ చేస్తున్నామని చెప్పారు. మెరుగైన రేడియేషన్ థెరపీ కోసం నాలుగు అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. శరీరంలోని అంతర్గత భాగాల్లో వచ్చే క్యాన్సర్లకు రేడియేషన్ చికిత్స చేసే బ్రాకీ థెరపీని కూడా ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వెల్లడించారు.

గురుకులంలో 30 మంది విద్యార్థులకు జ్వరం

కోరుట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. దాంతో విద్యార్థుల రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం టీ హబ్‌లోని ల్యాబ్‌కు తరలించారు. మంగళవారం ఉదయం గురుకులంలోని 14 మంది విద్యార్థులకు జ్వరం ఉండడంతో వారిని కోరుట్లలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు తీసుకొచ్చారు. వారిలో ఒకరికి తీవ్ర జ్వరం ఉండడంతో వెంటనే ఆ విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గురుకులంలో మొత్తం 30 మంది విద్యార్థులకు జ్వరం వచ్చినట్లు గుర్తించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ప్రమోద్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులకు జ్వరం వచ్చిందని చెప్పారు. ఆస్పత్రిలోని విద్యార్థులను మంగళవారం డిశార్చి చేశారు.

ఉపాధి హామీ కూలీగా మాజీ సర్పంచ్

- పెండింగ్‌లో రూ.20 లక్షల బిల్లులు
- కుటుంబ పోషణకు తప్పడం లేదన్న దార్ల రామ్మూర్తి



ఇనుగుర్తి లాలుతండా అటవీప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్న మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి

ఇనుగుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆయన పేరు దార్ల రామూర్తి. ఇనుగుర్తి గ్రామ మాజీ సర్పంచ్. ఆయన మంగళవారం ఉపాధి హామీ పథకం కింద కూలీగా పనుల్లో పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇనుగుర్తి ఒకటి. గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులకు సుమారు రూ.20 లక్షల బిల్లులు బకాయిలున్నాయని రామ్మూర్తి తెలిపారు. ఆ అభివృద్ధి పనులు చేపట్టడానికి అప్పులు చేసి మరీ ఖర్చు చేశానని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వద్ద బిల్లులు బకాయిగా ఉండటంతో కుటుంబ నిర్వహణ కోసం తానూ తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లాల్సి వస్తోందని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంటర్ వరకూ చదివిన రామ్మూర్తి గతంలో తెలుగు రచనా నైపుణ్యంతో జర్నలిస్టుగా పనిచేశారు. అయినా, ఇప్పుడు కుటుంబ పోషణ కోసం.. 'అన్‌స్కిల్డ్' పనులకూ వెళ్లడం విద్యావంతులను ఆలోచింపజేస్తోంది.

వక్ఫ్ సవరణ నిరసన సభకు సన్నాహాలు

- ఏఐఎంపీఎల్‌బీ ఆధ్వర్యంలో సభ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఆహ్వానాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 19న దారుల్‌సలాం మైదానంలో భారీ ఎత్తున నిరసన సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 50 వేల మందికి పైగా ముస్లింలను తరలించేందుకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌రెడ్డితో పాటు వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించే పార్టీల నేతలకు ఆహ్వానాలు పంపినట్టు తెలిసింది. అయితే కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ వేదికను పంచుకుంటుందా లేదా అనే విషయంలో స్పష్టత రాలేదు.

ప్రియుడు మోసం చేశాడని.. విషం తాగి దళిత యువతి బలవన్మరణం

- ప్రియుడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- సూసైడ్ నోట్ స్వాధీనం.. ప్రియుడి అరెస్టు



మల్లీశ్వరి (ఫైల్)

నిడమనూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు తనను మోసం చేశాడనే ఆవేదనతో ఆమె కుమిలిపోయింది. తనను ప్రేమించానని చెప్పి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. తనకు తెలియకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు ధర్మారపు మల్లీశ్వరి అనే 27 ఏళ్ల దళిత యువతి. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కముంతలపహాడ్ గ్రామ వాస్తవ్యురాలు. సరూర్‌నగర్‌లోని ఓ హాస్టల్లో ఉంటూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం.. బొక్కముంతలపహాడ్ గ్రామానికే చెందిన కుక్కల జాన్‌రెడ్డి అనే యువకుడు హైదరాబాద్‌లోనే ఓ రీహాబిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. మల్లీశ్వరి, జాన్‌రెడ్డి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. మల్లీశ్వరికి చెప్పకుండా జాన్‌రెడ్డి మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇది తెలిసి డిప్రెషన్‌లోకి వెళ్లిన మల్లీశ్వరి సోమవారం తెల్లవారుజామున హాస్టల్‌లోని మరుగుదొడ్డిలోకి వెళ్లి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. లోపలి నుంచి ఆమె ఎంతకూ బయటకు రాకపోవడంతో స్నేహితులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి మరుగుదొడ్డి తలుపులు పగులగొట్టి మల్లీశ్వరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు చెప్పారు. మల్లీశ్వరి తల్లిదండ్రులు కోటమ్మ, పాపయ్య సోదరుడు శివకుమార్, బంధువులు హైదరాబాద్‌కు చేరుకుని పోస్టుమార్టం అనంతరం మల్లీశ్వరి మృతదేహాన్ని సోమవారం రాత్రికి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహంతో సోమవారం రోజంతా, మంగళవారం ఉదయం దాకా జాన్‌రెడ్డి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల దాకా కోదాడ-జడ్చర్ల హైవేపై ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మల్లీశ్వరి కుటుంబీకులకు నచ్చజెప్పారు.. మల్లీశ్వరి మృతికి కారణాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహిస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా జాన్‌రెడ్డిని సరూర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్లీశ్వరి సూసైడ్ నోట్ సైతం సరూర్‌నగర్ పోలీసులకు లభించనట్లు తెలుస్తోంది.

2030 నాటికి 200 మిలియన్ చ.అడుగుల కమర్షియల్ స్పేస్

- గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్
- కాగ్నిజెంట్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల



గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా 2030 నాటికి రాష్ట్ర రాజధానిలో 200 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్ ఏ కమర్షియల్ స్పేస్ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తంగా నానక్‌రాంగూడలో ఏర్పాటు చేసిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ)ని మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ గ్లోబల్ బిజినెస్ హబ్‌గా మారిందని, అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై తదితర మెట్రో నగరాల్లో డిమాండ్ తగ్గుతుంటే హైదరాబాద్‌లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదైందని శ్రీధర్ బాబు చెప్పారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో అమెజాన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా తదితర అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలు 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఏడాది వ్యవధిలో 70కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమ య్యాయని అన్నారు. హైదరాబాద్‌ను జీసీసీలకు హబ్‌గా మార్చడమే కాకుండా.. వాటిని గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. కాగా, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఏర్పాటు చేసిన జీసీసీలో ప్రస్తుతం 1000 మంది ఐటీ, డేటా నిపుణులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రెండు, మూడేళ్ల వ్యవధిలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు.

మన పోలీస్.. దేశంలోనే నెంబర్ 1

ఉత్తమ న్యాయవ్యవస్థల్లో రెండో స్థానం రాష్ట్రానిదే

- మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే.. సమర్థవంతమైన పోలీసు, న్యాయవ్యవస్థలు
- తొలి ఐదు స్థానాలు ఈ రాష్ట్రాలకే..
- కర్ణాటక నెంబర్ వన్.. తర్వాతి ర్యాంకుల్లో ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు
- 18 రాష్ట్రాలలో అట్టడుగున బెంగాల్
- 'ఇండియా జస్టిస్ రిపోర్ట్- 2025' వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థగా తెలంగాణ పోలీస్ విభాగం నిలిచింది. అదే సమయంలో సమర్థవంతమైన న్యాయవ్యవస్థలకు సంబంధించి దేశంలోనే రెండో స్థానం సాధించింది. ఈ రెండింటితో పాటు న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణ కూడా కలిపి చూస్తే జాతీయ స్థాయిలో తెలంగాణ మూడో స్థానంలో నిలవడం గమనార్హం. పోలీస్ వ్యవస్థ సామర్థ్యం అంశంలో ఏపీ, కర్ణాటక రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. మొత్తంగా పోలీసు, న్యాయవ్యవస్థలు దక్షిణాది రాష్ట్రాల్లోనే మెరుగ్గా ఉన్నాయని వెల్లడైంది. కర్ణాటక అగ్రస్థానంలో నిలవగా తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు ఉన్నాయి. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. పోలీసు, న్యాయవ్యవస్థ, న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణ అనే నాలుగు అంశాల పరంగా దేశంలోని 18 పెద్ద, మధ్యస్థాయి రాష్ట్రాల పరిస్థితిని అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. మొత్తం 10 పాయింట్లకుగాను 6.78 స్కోరుతో కర్ణాటక టాప్‌లో నిలవగా, 3.63 స్కోరుతో పశ్చిమ బెంగాల్ అట్టడుగున నిలిచింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలు బెంగాల్ కంటే కాస్త ముందు నిలిచాయి. గతేడాది 11వ స్థానంలో నిలిచిన తెలంగాణ ఈసారి మూడోస్థానానికి.. ఐదో స్థానంలో ఉన్న ఏపీ రెండో స్థానానికి చేరుకోవటం విశేషం.

లక్ష జనాభాకు 155 మంది పోలీసులు

దేశవ్యాప్తంగా ప్రతి లక్ష జనాభాకు సగటున 197.5 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 155 మంది మాత్రమే ఉన్నారు. లక్ష జనాభాకు కేవలం 81 మంది పోలీసులతో బిహార్ ఆఖరు స్థానంలో ఉంది. అయితే, గతంతో పోలిస్తే 2022-25 మధ్యకాలంలో ఆ రాష్ట్రం పరిస్థితి మెరుగుపడటం గమనార్హం. ఇదే మూడేళ్ల కాలవ్యవధిలో న్యాయవ్యవస్థ పరంగా రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్ అత్యంత మెరుగైన ఫలితాలు సాధించాయి. జైళ్ల నిర్వహణలో ఒడిశా, జార్ఖండ్ ఇతర రాష్ట్రాలకన్నా ముందున్నాయి. గత పదేళ్లలో జైళ్లలో ఖైదీల సంఖ్య దాదాపు 50 శాతం పెరిగింది. వీరిలో అత్యధికులు అండర్ ట్రయల్సే (దర్యాప్తు లేదా విచారణ పూర్తికాని కేసులకు సంబంధించిన నిందితులు). పదేళ్లలో జైళ్లలో వీరి వాటా 66 నుంచి 78 శాతానికి పెరిగింది. ప్రజలకు న్యాయ సహాయం పరంగా హరియాణా అన్ని రాష్ట్రాల్లోకి మెరుగైన పనితీరు చూపింది. పోలీసు, న్యాయవ్యవస్థకు బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధుల్లో అత్యధికభాగం సిబ్బంది జీతభత్యాలకే వెళ్తోంది. మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బందికి శిక్షణ వంటి కార్యకలాపాలకు అరకొర నిధులు మాత్రమే మిగులుతున్నాయి. దీనివల్ల పోలీసు, న్యాయసేవలపై ప్రతికూల ప్రభావం పడుతోందని నివేదిక పేర్కొంది.

రాష్ట్రంలో న్యాయ, పోలీసు వ్యవస్థల తీరిదీ..

- తెలంగాణలోని కింది కోర్టులలో 81 మంది ఎస్సీ, 119 మంది ఎస్టీ, 123 ఓబీసీ న్యాయమూర్తులు ఉన్నారని నివేదిక పేర్కొంది. తెలంగాణలో హైకోర్టులో 28.6శాతం, కింది కోర్టుల్లో 20.5% ఖాళీలు ఉన్నట్టు తెలిపింది.
- తెలంగాణలో 20 ఏళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులు 17.7 శాతం, 10-20 ఏళ్ల మధ్యవి 32.6శాతం ఉన్నాయని పేర్కొంది.
- తెలంగాణలో పోలీస్ సిబ్బందిలో 8.7 శాతం, జైలు సిబ్బందిలో 6.6 శాతం మహిళలు ఉన్నారని నివేదిక తెలిపింది. మహిళా న్యాయమూర్తులు కింది కోర్టులలో 55.3 శాతం, హైకోర్టులో 33.3 శాతం ఉన్నారని పేర్కొంది.
- తెలంగాణలో పట్టణాలలో 51,974 మందికి, గ్రామాలలో 50,373 మందికి ఒక పోలీస్‌స్టేషన్ ఉన్నాయని వెల్లడించింది.

గ్రూప్-1 ఫలితాలపై ఆరోపణలన్నీ అబద్ధాలే

- రాజకీయ దురుద్దేశంతో వేసిన నిందలే
- 25 శాతం మంది మహిళలు మెయిన్స్ రాసింది కోఠి కాలేజీలోనే
- ఉర్దూ మీడియంలో రాసిన 563 మందిలో ఒక్కరికే పిలుపు:టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఇతర నేతలు గ్రూప్-1 ఫలితాలపై చేసిన ఆరోపణలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఖండించింది. అన్నీ రాజకీయ దురుద్దేశంతో చేసిన ఆరోపణలేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్న ఉద్దేశంతోనే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్ టికెట్లు ఇచ్చామని తెలిపారు. మెయిన్స్ పరీక్షలను జీహెచ్‌ఎంసీ పరిధిలోనే నిర్వహించినందున అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరుగా హాల్ టికెట్లు ఇచ్చామని వివరించారు. కోఠి మహిళా కళాశాలలో రాసిన వారికే ఉద్యోగాలు వచ్చాయన్న ఆరోపణలపై స్పందిస్తూ.. అక్కడ మహిళలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు ఉండటంతో ఎక్కువ మందికి కోఠి కళాశాలనే పరీక్ష కేంద్రంగా కేటాయించామని చెప్పారు. మొత్తం గ్రూప్-1 మెయిన్స్ మహిళా అభ్యర్థుల్లో 25శాతం మంది కోఠి కాలేజీలోనే పరీక్షలు రాశారని వివరించారు. ఉర్దూ మీడియంలో 9మంది పరీక్ష రాస్తే ఏడుగురికి ఉద్యోగాలు వచ్చాయన్న ఆరోపణలూ అవాస్తవమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 563 మంది ఉర్దూ మీడియంలో పరీక్ష రాయగా అందులో 10 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారని చెప్పారు. వారిలో ఒక్కరినే ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచామని కమిషన్ కార్యదర్శి స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఏమైనా అనుమానాలుంటే 99667 00339 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని నవీన్ సూచించారు.

వృద్ధురాలిని చంపేసి.. మృతదేహంపై గెంతులేసి..

- వీడియో తీసి బెంగళూరులోని మిత్రులకు షేర్
- 17 ఏళ్ల బాలుడి పైశాచికానందం
- బెంగళూరులో వీడియో వైరల్... అక్కడి పోలీసుల అప్రమత్తం
- రాచకొండ పోలీసులకు సమాచారమివ్వడంతో ఘోరం వెలుగులోకి



కమలమ్మ(ఫైల్)

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆ పదిహేడేళ్ల బాలుడిది ఎంతటి వికృత మనస్తత్వం? ఏమా పైశాచికానందం? ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని చీరతో ఉరి బిగించి చంపేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్నాక ముఖంపై, మెడపై తన్నుతూ.. మృతదేహంపై గెంతులేశాడు. ఎగిరెగిరి దుంకుతూ నృత్యం చేశాడు. తన ఈ దుశ్చేష్టనంతా వీడియో తీసి.. బెంగళూరులో ఉన్న తన స్నేహితులకు షేర్ చేశాడు. ఈ మేరకు కుషాయిగూడ కృష్ణానగర్ కాలనీలో వృద్ధురాలు కమలమ్మ (70) దారుణ హత్యకు గురైన ఘటనలో తాజాగా వెలుగుచూసిన ఘోరమిది. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌లో కమలమ్మ ఒంటరిగా భవనంలో నివాసం ఉంటోంది. ఆమెకు ఎవ్వరూ లేరు. ఆ భవనంలోని రెండు షెటర్లను విద్యుదుపకరణాల దుకాణం కోసం కొన్నేళ్ల క్రితం రాజస్థాన్‌కు చెందిన ప్రకాశ్ చౌదరి, లలిత్ చౌదరికి ఆమె అద్దెకిచ్చింది. ఆ షాపులో రాజస్థాన్‌కే చెందిన 17 ఏళ్ల బాలుడు గత ఎనిమిది నెలలుగా పనిచేస్తున్నాడు. ఆ దుకాణం నిర్వహణ విషయంలో కమలమ్మ తరచూ ఆ బాలుడిని మందలిస్తోంది. అతడి తీరుపై చిర్రుబుర్రులాడుతోంది. అతడు కనిపించినప్పుడల్లా కసురుకుంటోంది. వృద్ధురాలి తీరుతో ఆమెపై కక్ష పెంచుకున్న బాలుడు, శుక్రవారం రాత్రి ఇంట్లోకి చొరబడి కమలమ్మ మెడకు చీరతో బిగించి చంపేశాడు. అప్పటికీ కోపం చల్లారని బాలుడు, మృతదేహంపై ఎగిరి దుంకుతూ.. మెడపై తొక్కుతూ నృత్యం చేశాడు. దీన్నంతా వీడియోగా చిత్రీకరించి.. ఇదిగో చూడండంటూ బెంగళూరులోని స్నేహితులకు వాట్సా‌ప్‌లో పంపాడు. అక్కడ ఆ వీడియో వైరల్‌గా మారడంతో బెంగళూరు పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌లో ఈ దారుణం జరిగినట్లు గుర్తించి రాచకొండ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రంగంలోకి దిగడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కుళ్లిన స్థితిలో వృద్ధురాలి మృతదేహాన్ని కనుగొంటే.. తాజాగా 17 ఏళ్ల బాలుడు ఘోరానికి పాల్పడ్డ వీడియో బయటపడింది. కమలమ్మ ఒంటరి మహిళ కావడం, సంతానం లేకపోవడంతో ఆస్తికోసం ఎవరైనా ఈ దారుణాన్ని చేయించారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం
- ప్రతి ఏటా మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు
- మహిళా సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి



శ్రీ సమ్మిట్‌లో భట్టి విక్రమార్క

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం నగరంలోని తాజ్‌దక్కన్ హోటల్‌లో హైదరాబాద్ సిటీ పోలీస్, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, సమానత్వంపై 'శ్రీ సమ్మిట్ 2.0' కార్యక్రమం జరిగింది. దీనికి భట్టి విక్రమార్క, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య, హెచ్‌సీఎస్సీ జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, ఉమెన్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ గీతా గోటితో కలిసి వారు జ్యోతి ప్రజ్వలన చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. శ్రీ సమ్మిట్ అనేది కేవలం మాట్లాడుకోవడానికి ఏర్పాటు చేసి కార్యక్రమం కాదని, మహిళల గౌరవం, సమానత్వం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండేలా నిర్ణయం తీసుకోవాల్సిన వేదిక అని అన్నారు. మహిళా సాధికారత సమాజం ప్రతీ ఒక్కరి కలని, అది సాధించడానికి మనందరం కలిసి నడవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని, వచ్చే నాలుగేళ్లలో ప్రతి ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందిస్తామని భట్టి చెప్పారు. నూతన హరిత ఇంధన విధానంలో మహిళలకు భాగస్వామ్యం కల్పించామని, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన పేర్కొన్నారు. సీపీ ఆనంద్ మాట్లాడుతూ.. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో లింగ వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత సమానత్వం అనేది ఇంటి నుంచి ప్రారంభమై, ప్రతి పని ప్రదేశంలో అమలు చేసినప్పుడే సాధ్యమవుతందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖతో కలిసి పనిచేయడానికి హెచ్‌సీఎస్సీ సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఉమెన్స్‌ఫోరం ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

కృష్ణాలో 72% ఏపీకే!

- ఈ ఏడాది 715 టీఎంసీల నీటి వినియోగం
- తెలంగాణ వాడుకుంది 27.80 శాతమే
- మొత్తం 990 టీఎంసీల్లో 275 టీఎంసీలే
- నీటి వాడకంపై లెక్కలు తీసిన కృష్ణా బోర్డు
- కేడీఎస్‌కు కొత్తగా కృష్ణా జలాలు అక్కర్లేదు
- కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగం విషయంలో మరోసారి తెలంగాణకు మరోసారి తీవ్ర నష్టం జరిగింది. ఈ వాటర్ ఇయర్ (2024-2025)లో కూడా తెలంగాణ కన్నా ఆంధ్రప్రదేశ్ పెద్దఎత్తున నీటిని అధికంగా వినియోగించుకుంది. 2024 జూన్ 1 నుంచి ఈ నెల 14వ తేదీ రాత్రి వరకు రెండు తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం 990.382 టీఎంసీలుగా ఉండగా.. ఇందులో 715.031 టీఎంసీలను (72.20 శాతం) ఏపీయే వాడుకున్నట్లు కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గుర్తించింది. తెలంగాణ కేవలం 275.350 టీఎంసీలు (27.80 శాతం) మాత్రమే వినియోగించుకున్నట్లు తేల్చింది. మరో 45 రోజుల్లో వాటర్ ఇయర్ ముగియనుండగా.. కృష్ణా బేసిన్‌లో ఎవరెంత మేర నీటిని వినియోగించారనే దానిపై కేఆర్ఎంబీ లెక్కలు తీసింది. వాస్తవానికి కృష్ణాలో చెరో 50 శాతం చొప్పున సమానంగా నీటిని పంచాలంటూ తెలంగాణ గత రెండేళ్లుగా పట్టుబడుతోంది. కానీ, దీనిపై తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి ఒప్పందాలు లేవు. కృష్ణా నీటి కేటాయింపులపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. అయితే అప్పటిదాకా నీటి పంపిణీ అధికారాలను త్రిసభ్య కమిటీ (కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి, రెండు తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు)కి ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో ఆ ఒక్క ఏడాదికే 63, 37% చొప్పున కృష్ణా జలాల పంపిణీకి తాత్కాలిక ఒప్పందం జరిగింది. అయితే రెండేళ్లపాటు వాటా మేరకు వినియోగం లేకపోవడంతో ఏపీ 66%, తెలంగాణ 34% చొప్పున నీటిని పంచుకున్నాయి. 2015 ఒప్పందం క్రమంగా 2022-23 దాకా కొనసాగింది. ఆ తరువాత 2023-24 వాటర్ ఇయర్‌లో నీటిని 50 శాతం చొప్పున పంచాలంటూ తెలంగాణ పట్టుబట్టింది. దీంతో నీటి వాటాను తేల్చే బాధ్యతను అపెక్స్ కౌన్సిల్ (కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మండలి)కి కట్టబెడుతూ కృష్ణాబోర్డు తీర్మానం చేసింది. అయితే నీటి పంపిణీ బాధ్యత అపెక్స్ కౌన్సిల్‌కు లేదని, తెలుగు రాష్ట్రాలే తేల్చుకోవాలని జలశక్తి శాఖ పేర్కొంది. కానీ, త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకోకముందే జలాశయాలు ఖాళీ అయ్యాయి.

కేడీఎస్‌కు కొత్తగా కృష్ణా జలాల కేటాయింపు వద్దు

కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్)కు కొత్తగా కృష్ణా జలాలను కేటాయించాల్సిన అవసరం లేదని తెలంగాణ పేర్కొంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నుంచి 80 టీఎంసీలు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా మరో 105 టీఎంసీలు, డ్రైన్లలో అదనంగా 42 టీఎంసీలు కేడీఎస్‌కు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పైగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తరువాత గోదావరి బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు భారీగా నీటిని తరలించడానికి గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఏపీ సర్కారు చేపట్టిందని నివేదించింది. ఈ మేరకు మంగళవారం జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో నీటి కేటాయింపులపై తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. పోలవరం ప్రాజెక్టు రెండు కాలువల నుంచి 10 వేల క్యూసెక్కుల దాకా నీటిని తరలించడానికి అనుమతినివ్వగా.. ఆ తర్వాత వీటి సామర్థ్యం పెంచుకున్నారని నివేదించారు. తాజాగా పోలవరం కుడి ప్రధాన కాలువ(ఆర్ఎంసీ) నుంచి రోజుకు 1.5 టీఎంసీల దాకా తరలించడానికి వీలుగా పనులు చేస్తున్నారని తెలిపారు. ఏకంగా 135 టీఎంసీలను పోలవరం నుంచి తరలించడానికి వీలుగా పనులు చేపట్టారని వివరించారు. కాగా, మరో రెండు రోజులపాటు తెలంగాణ వాదనలు వినిపించనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.